

కార్మిక వర్గ పోరాటం వారి విముక్తి కోసమే కాదు. అణచివేత నుంచి, దోపిడీ నుంచి మొత్తంగా మానవాళి విముక్తి కోసం అది పోరాడుతుంది. – హోచిమిన్


# న్యూడెమోక్రసీ
బులెటిన్

2020 ఆగస్టు | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ | సంపాదకుడు : వై.సాంబశివరావు


## ఈ శిక్షా విధానం శిక్షల కోసమేనా? శిక్షలు లేకుండా శిక్షించే లక్ష్యంతో ఓ శిక్షణయా!

### (సాయిబాబా నుండి వరవరరావు మరో 10 మందిని శిక్షించే తీరుపై ఓ రాజకీయ వ్యాఖ్యానం) –పి.ప్రసాద్

జి.ఎన్.సాయిబాబాపై నేరారోపణలు చేసిన తీరు నుండి ఆయన్ని విచారించి, నేర నిర్ధారణ చేసిన, శిక్షిస్తున్న తీరు తెన్నులన్నింటిలో ఒక ప్రత్యేకత కనిపిస్తున్నది. అదేవిధంగా వరవరరావుతోపాటు మరో 10 మంది పేరొందిన విప్లవ, ప్రజాతంత్ర మేధావుల మీద భీమా కోరెగావ్, ఎల్గార్ పరిషత్ కేసులను బనాయించిన తీరు నుండి, కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్.ఐ.ఎ) చేపట్టిన, విచారణ లేకుండానే శిక్షిస్తున్న తీరు తెన్నులన్నింటిలో కూడా అలాంటి ప్రత్యేకతే కనిపిస్తున్నది. ప్రజాభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా నేడు రాజ్యం ఈ ప్రత్యేకతలను కొనసాగిస్తోంది. ముఖ్యంగా మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పరచడంలో ఎదురైన భంగపాటు తర్వాత మోడీ ప్రభుత్వ వైఖరిలో మరింత ప్రత్యేకత వెల్లడైనది. శరద్‌పవార్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నూతన రాష్ట్ర ప్రభుత్వం భీమాకోరెగావ్, ఎల్గార్ పరిషత్ కేసులను ఎక్కడ కొట్టివేస్తుందో అని స్వయంగా ఆ కేసులను ఎన్.ఐ.ఎ స్వాధీనం చేసుకోవడం గమనార్హం! మోడీ ప్రభుత్వ నేపథ్య చొరవతో చేపట్టిన ఈ అసాధారణ చర్యలో కూడా ప్రత్యేకత వుంది. ఈ అసాధారణ ప్రత్యేకతలకు గల వాస్తవ కారణాలను నిశితంగా పరిశీలించాల్సి ఉంది.

బూర్జువా న్యాయవ్యవస్థకు ఎన్నడూ మానవత్వం వుండదు. ఎందుకంటే, మానవత్వమనేది వర్గాతీతమైనది కానందున! మానవత్వానికి కూడా వర్గ ప్రయోజనాలు వున్నాయి. అదే సమయంలో ఆయా నిర్దిష్ట చారిత్రక దశలలో వర్గాతీత మానవత్వంగా చిత్రించబడి చెలామణిలో వుండే సగటు లేదా సామాన్య మానవత్వం ఒకటి ఉనికిలో వుంటుంది. దానిని పాటిస్తున్నట్లు నటించడం ఆయా దశలలోని రాజ్యాలకు అవసరమౌతుంది. తన వర్గ ప్రయోజనాలకు లోబడి పైన పేర్కొన్న సగటు చెలామణిలోని ఆనాటి మానవత్వ ప్రాతిపదికను రాజ్యాలు వీలైనంత వరకు పాటిస్తున్నట్లు నటిస్తుండగలవు. తద్వారా అవి ఏ పాలిత జనాన్ని కళ్ళు కప్పి తమ దోపిడీ పరిపాలనను కొనసాగించాలనుకున్నాయో, అట్టి లక్ష్యానికి కొంతవరకు ‘ సగటు మానవత్వం ’ ను ఉపయోగించుకోజూస్తాయి. పైన పేర్కొన్న కేసుల్లో ఈ సాంప్రదాయాలు కూడా నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. ఇదీ దీని ప్రత్యేకతయే.

జి.యన్.సాయిబాబా 90 శాతం వికలాంగుడు. వరవరరావు 80 ఏళ్ళ వృద్ధుడు. సాయిబాబాను అండా సెల్‌లో శిక్షించడం గానీ, వరవరరావు నడవలేని నిస్సహాయ స్థితిలో నిర్బంధంలో కొనసాగించడం గానీ నాటి సమాజాలలో చెలామణీలో వుండే సగటు మానవత్వ విలువలను అతిక్రమిస్తున్నాయి. అదేవిధంగా వరవరరావుకు కరోనా పాజిటివ్‌గా వైద్య పరీక్షలో నిర్ధారణ జరిగిన తర్వాత కూడా నిర్బంధాన్ని కొనసాగించడం మరింత అతిక్రమిస్తున్నట్లుగానే భావించాల్సి వుంది. వీటిని సునిశితంగా పరిశీలించాల్సి ఉంది.

నాటి చారిత్రక దశలలో చలామణిలో వుండి సగటు మానవత్వ ప్రమాణాల గూర్చి పైన పేర్కొన్నాను. వాటిని అనుసరించి దోపిడీ రాజ్యాల న్యాయవ్యవస్థలు కూడా కొన్ని ప్రమాణాలను మినహాయింపులుగా కలిగి వుంటాయి. అవి క్షమాబిక్షల రూపంలోగానీ, ప్రత్యేక మినహాయింపులుగా గానీ, పెరోల్ రూపంలో వ్యక్తమౌతుంటాయి. వాటి పేరిట శిక్షాకాలాలను తగ్గించడం లేదా శిక్షల తీవ్రతను

( మిగతాది 3వ పేజీలో )

## కామ్రేడ్ లింగన్న ఎత్తిన విప్లవ పతాకాన్ని సమున్నతంగా నిలబెడదాం! – పి.సూర్యం,



గోదావరిలోయ ప్రతిఘటనా పోరాట యోధుడు, సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణా రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ లింగన్న అమరత్వం పొంది జులై 31కి 1 సంవత్సరం. కా॥ లింగన్న ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞగా మొదటి వర్థంతిని రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపిచ్చింది. నార్త్–ఈస్ట్ రీజనల్ కమిటీ తన ప్రాంతంలో జులై 24 నుండి 31 వరకు వారం రోజులు సంతాప సభలు జరపాలని పిలుపిచ్చింది.

కా॥ లింగన్నని గత సం॥ జులై 31న వందలాది పోలీసు మూక తనున్న ప్రదేశాన్ని చుట్టుముట్టింది. శత్రు చేత చిక్కిన కా॥ లింగన్నని అత్యంత కౄరంగా చిత్రహింసలు పెట్టి చంపివేసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన మరుసటి రోజు నుండి ఎన్‌కౌంటర్లుండవని కేసీఆర్ పదేపదే పల్కిన మాటలు బూటకమని రుజువుపర్చుకున్నాడు. తెలంగాణను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కొనసాగించిన దాష్టీకాలన్నింటినీ టీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నది. ప్రజాస్వామిక హక్కులను హరించి వేస్తుంది. కేంద్ర ప్రభుత్వంచే శెభాష్ అనిపించుకోవడానికి ఎంతో తాపత్రయపడుతున్నది. అందులో భాగమే బూటకపు ఎన్‌కౌంటర్లు. కా॥ లింగన్నని ఎన్‌కౌంటర్ పేరిట చేసిన ప్రభుత్వ హత్య.


భద్రాద్రి కొత్తగూడెం ఎస్.పి. ఆధ్వర్యంలో ఈ కౄర హత్యకి ఒడిగట్టింది. కా॥ లింగన్నని చంపిన సమాచారం తెలుసుకొన్న ప్రజలు వందలాది మంది సంఘటనా స్థలంకి చేరుకున్నారు. తమ ప్రియతమ నాయకుడిని విగత జీవిగా చూడటంతో ప్రజల్లో కసి, ద్వేషం పెల్లుబికింది. హతమార్చిన పోలీసుని ప్రతిఘటించారు. కాల్పులు చేసి, ప్రజలను చెల్లాచెదురు చేసి కా॥ లింగన్న శరీరాన్ని స్వాధీన పర్చుకొని దొంగచాటుగా జిల్లా కేంద్రానికి తరలించారు. బాడీని ప్రజలకి అప్పగించకుండా వుండేందుకు శతవిధాల ప్రయత్నం చేశారు.

మరణించిన లింగన్న శవం కూడా రాజ్యాన్ని గజగజ వణికించింది. లింగన్న మరణానంతరం తన జ్ఞాపకార్థం స్థూపం నిర్మించుకుంటుంటే శాడిస్టు పోలీసులు దుర్మార్గంగా కూల్చివేసారు. నేటికి స్థూప నిర్మాణాన్ని అడ్డుకొంటున్నారు. ఆ ప్రాంత ప్రజలకి అత్యంత ప్రేమ పాత్రుడయిన కా॥ లింగన్న స్థూప నిర్మాణాన్ని అడ్డుకొనే చట్టం ఎక్కడ వుంది? విప్లవోద్యమంలో అమరత్వం పొందిన వీరులనేక మందికి స్మారక చిహ్నాలని నిర్మించుకోవడం వారి హక్కు. దాన్ని అడ్డుకోవడం చట్ట వ్యతిరేకం, పాశవికం.

కా॥ లింగన్న హతమయి సంవత్సరం గడుస్తున్న సందర్భంలో ప్రథమ

( మిగతాది 2వ పేజీలో )

# ప్రముఖ కవి, రచయిత, బహుజన విప్లవ సామాజికోద్యమ నాయకుడు కామ్రేడ్ ఉ.సా కు విప్లవ జోహార్లు



ప్రముఖ కవి, రచయిత, బహుజన విప్లవ సామాజికోద్యమ నాయకుడు కామ్రేడ్ ఊప్పుమావులూరి సాంబశివరావు (ఉ.సా) ఈ రోజు కోవిడ్‌తో హైద్రాబాద్‌లో మృతి చెందారు. వారి అకాల మరణం పట్ల సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి చెందింది. కా॥ ఉ.సాకు విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది.

కామ్రేడ్ ఉ.సా విద్యార్థిగా ఉన్నప్పుడే విప్లవ రాజకీయాలను విశ్వసించి అమరులు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి గార్ల నాయకత్వంలో నిర్మాణమైన యు.సి.సి.ఆర్.ఐ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసారు. కవిగా, కళాకారుడిగా, రచయితగా విప్లవ, ప్రజా ఉద్యమాలను గానం చేస్తూ అనేక పాటలు, రచనలు చేసారు. జనసాహితి సంస్థలో సుధీర్ఘకాలం పనిచేసి ప్రజా సాహిత్యరంగంలో మెరుగైన కృషి చేసారు. 1980లలో కొండమొదలు ఉద్యమ ప్రాంతంలో కొన్నాళ్ళు ఉండి అక్కడి ఆదివాసీలలో కలిసిపోయి వారి జానపద బాణీలలో తాను స్వయంగానూ, కా॥ సన్నశెట్టి రాజశేఖర్‌తోనూ కలిసి అనేక ఉత్తేజకరమైన పాటలు రచించారు. తర్వాత కాలంలో పార్టీ నిర్ణయం ప్రకారం నల్గొండ జిల్లాలో పార్టీ ఆర్గనైజర్‌గా వెళ్ళి రైతాంగ సమస్యలపై, కరువు సమస్యపై వేలాదిగా రైతులని కదిలించి గొప్ప ఉద్యమాన్ని నడపడంలో కీలక పాత్ర పోషించారు.

తర్వాత క్రమంలో పార్టీ నుండి బయటకి వచ్చి బహుజన విప్లవ అవగాహనని ప్రచారం చేసారు. కామ్రేడ్ సత్యమూర్తితో కలిసి ఎం.ఎల్ సెంటర్‌ని స్థాపించి కొన్ని సంవత్సరాల పాటు ‘ ఎదురీత ’ పత్రికని నిర్వహించారు. భారత సమాజంలో మనువాద బ్రాహ్మణీయ భావజాల వ్యవస్థీకృత స్వభావాన్ని విశ్లేషించిన మొదటితరంలో అగ్రగణ్యుడు కా॥ ఉ.సా. మనువాదం ఫాసిజంగా మారుతున్న నేటి పరిస్థితులలో తాను ప్రత్యేక కేంద్రీకరణ పెట్టి ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి కృషి చేస్తున్న సందర్భంలో ఆయన మరణం బహుజన, ప్రగతిశీల, లౌకిక ఉద్యమాలకి తీరని లోటు.

సామాజిక సంఘాల నిర్మాణంపైన, రాజకీయాల భోధనపైన ప్రత్యేక దృష్టి పెట్టి నూతన తరాన్ని చైతన్యపరిచే కర్తవ్యాన్ని నిర్వహించారు. కామ్రేడ్ మారోజు వీరన్నకు మార్గదర్శకుడుగా వుండి సి.పి.యు.ఎస్.ఐ ఏర్పాటుకు ప్రోత్సహించారు.

చివరి వరకు పీడిత ప్రజల పక్షపాతిగా, సామాజిక చింతనాపరుడిగా నిలిచాడు. ఆయన మరణం సామాజిక ఉద్యమాలకు తీరని లోటు. ఆయనకు సామాజిక విప్లవ జోహార్లు అర్పిస్తూ బంధు, మిత్రులకు సంతాపాన్ని, సానుభూతిని తెలియచేస్తున్నాము.

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ**
**ఆం.ప్ర. రాష్ట్ర కమిటీ**

**25.7.20**

---

(మొదటి పేజీ తరువాయి)

వర్ధంతి సభ రాష్ట్రంలో, దేశంలో జరుపుకోవాలని పార్టీ నిర్ణయించింది. దానిలో భాగంగా జరుపుతున్న ప్రథమ వర్ధంతి సభలను జరగకుండా ఆటంక పర్చడం ఎంతో నీచంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీరు వుందో స్పష్టమవుతోంది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు కా॥ మధుని అక్రమంగా నిర్బంధించి తప్పుడు కేసులో యిరికించి జైలుకి పంపడం దుర్మార్గం. ప్రతిఘటనా పోరాట ప్రాంతమంతటా నేటికి తీవ్ర నిర్బంధాన్ని సాగిస్తుంది. ముఖ్యంగా ఇల్లెందు, గుండాల ప్రాంతాల్లో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నది. ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తుంది.

గత 50 సం॥లుగా విప్లవకారుల నాయకత్వంలో గోదావరి లోయ ప్రాంతంలో పోరాడి అనేక విజయాలను సాధించింది. ప్రారంభంలో పాక్షిక దోపిడీకీ వ్యతిరేకంగా ప్రజలు పోరాడారు. ఈ క్రమంలో భూపోరాటాలను సాగించారు. లక్షలాది ఎకరాలను ప్రజలు సాగు చేసుకొంటున్నారు. దాని నుండి వారి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యాన్ని మెరుగుపర్చుకొన్నారు. వారి హక్కులను సాధించుకుంటున్నారు.

నేడు ఆదివాసీల, మిగతా పేద ప్రజల స్వాధీనంలో వున్న భూములను అక్రమ స్వాధీనానికి రాజ్యం పూనుకున్నది. పోలీసులచే దారుణాతిదారుణంగా ప్రజలపై దాడులు కొనసాగిస్తూ వుంది. తప్పుడు కేసుల్లో ఇరికిస్తుంది. వారి జీవన భృతి కోసం సాగిస్తున్న వ్యవసాయాన్ని, ఇతర పనులను స్థంభింప చేస్తుంది. అనేక వత్తిడిలకు గురి చేస్తుంది. రాజకీయంగా లొంగతీసుకోవాలని ప్రయత్నిస్తుంది. కొంత మందిని ఏజంటుగా సృష్టించుకొని సమాచారం పొందుతూ పాశవిక దాడులకు పూనుకొంటుంది. అనేక మంది విలువయిన కామ్రేడ్స్‌ని పొట్టన పెట్టుకొన్నది. అందులో భాగమే కా॥ లింగన్నని చిత్రహింసలు పెట్టి కౄరంగా చంపివేసింది.

విప్లవకారుల చీలికలు కూడా ప్రజలను నిరుత్సాహపర్చాయి. శత్రువు తన దాడులను మరింత తీవ్రం చేయడానికి దోహదపడ్డాయి. పటిష్టవంతమయిన విప్లవ పార్టీ నిర్మాణాన్ని ఈ చీలికలు దెబ్బతీస్తున్నాయి. విప్లవోద్యమంలో ప్రారంభం నుండి నేటికి కొనసాగుతున్న అతివాద, మితవాద, అరాచకవాద విధానాలు చాలా నష్టపర్చాయి. నిర్మాణానికి గుండె కాయ అయిన కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రం బాగా దెబ్బతిన్నది. ఇవన్నీ బలమైన విప్లవోద్యమ నిర్మాణానికి ఆటంకంగా తయారయ్యాయి.

ఉద్యమంలోని ఎగుడు, దిగుడు, ఆటుపోట్లు, స్థబ్దతలను విప్లవకారులు విశ్లేషించుకొంటున్నారు. ఈ విశ్లేషణ పేరిట వుద్యమాలలోని లోటుపాటులను వ్యతిరేక దృష్టితో చూసే ధోరణి బాగా పెరిగింది. ఇది నిరాశ, నిస్పృహలకి దారి తీస్తుంది. నక్సల్‌బరి పంథా నుండి దూరం చేస్తుంది. నయారివిజనంతో జరిగిన పోరాటంలో మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానాన్ని సిద్ధాంతంగా రూపొందించుకొన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవం రాజకీయ కర్తవ్యంగా చేపట్టారు. దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాని కమ్యూనిస్టు విప్లవకారులు స్వీకరించారు. దాన్ని ఆచరిస్తున్నారు.

ప్రపంచంలో రష్యా, చైనా విప్లవాలు కూలిపోయాక దేశ దేశాల్లోని విప్లవోద్యమాలకి ఆటంకాలు ఏర్పడ్డాయి. రివిజనిజం పైచేయి సాధించింది. వీటికి వ్యతిరేకంగా పోరాడుతూ, ఆయా దేశాల్లోని పరిస్థితులపై ఆధారపడి విప్లవోద్యమాలను కాపాడుకొంటున్నారు. ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిని దెబ్బతీయడానికి సామ్రాజ్యవాదులు, వీరి అనుకూల పాలకవర్గాలు చేయని దాడి లేదు. పాల్పడని కుట్ర లేదు. భౌతిక దాడులను సాగిస్తున్నది. రాజకీయదాడులను సాగిస్తున్నది. మార్క్సిజానికే కాలం చెల్లిందని పెద్ద యెత్తున దాడి చేస్తున్నది. వీటన్నింటిని చాలా కష్టంతో ఎదుర్కొక తప్పదు.

సామ్రాజ్యవాదం, దాని అనుకూల పాలక వర్గాలు నేడు ఎప్పుడు లేని సంక్షోభం లో కూరుకుపోయాయి. అవి సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకి వ్యతిరేకంగా గొప్ప గొప్ప పోరాటాలు సాగుతున్నవి. ఇవన్నీ విప్లవోద్యమాల నిర్మాణానికి అనుకూలమయిన పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఈ పోరాటాలను వ్యవస్థ వ్యతిరేక ప్రత్యామ్నాయ పోరాటాల వైపు మళ్ళించడమే విప్లవకారుల ప్రధాన కర్తవ్యం. దానికి సరయిన సిద్ధాంతం, నిర్మాణం లేకుండా ముందుకు తీసుకుకెళ్ళలేం. అందుకే కమ్యూనిస్టు విప్లవకారుల సిద్ధాంతాన్ని, రాజకీయాలను, నిర్మాణాన్ని రూపొందించుకొన్నారు. వాటి అన్వయింపులో, ఆచరణలో, దొర్లుతున్న వాటిని సమీక్షించుకుందాం. ముందుకు పోదాం.

భారత దేశంలో ఈ క్రమంలో సాగుతున్న విప్లవోద్యమంలో వేలాది మంది మన ఆత్మీయ సహచరులను కోల్పోయాం. అందులో మన రాష్ట్ర కమిటీ సభ్యుడు కా॥ లింగన్న ఒకరు. వారు కొనసాగించిన భారత విప్లవ పంథాని నిస్సంకోచంగా కొనసాగిద్దాం. మొక్కవోని ధైర్యంతో పోరాడుదాం. దృఢదీక్షతో కొనసాగుదాం. అమరవీరుల ఆశయాలను సాధించే వరకు అవిశ్రాంతంగా పోరాడుదాం. అమరవీరులకు జోహార్లు. కా॥ లింగన్నకి అరుణారుణ శ్రద్ధాంజలి.

> *స్వేచ్ఛ అనేది జీవుల జన్మ హక్కు. నా ప్రజల జన్మ హక్కుల కోసం నన్ను కన్న నా నేలపై నా రక్తం వర్షిస్తుంది. అది రేపటి భవిష్యత్తుకు బాటలు వేస్తుంది.* — నెల్సన్ మండేలా

( మొదటి పేజీ తరువాయి)

తగ్గించడం లేదా శిక్షలను రద్దుచేయడం వంటి చర్యలను చేపడటాతాయి. అవన్నీ ' మానవతా చర్యల ' పేరిట దోపిడీ వర్గ న్యాయవ్యవస్థలు చేపడుతున్నవే. నిజానికి వాటికీ ఏ మానవత్వమూ వుండదు. మానవత్వాన్ని కూడా తమ దోపిడీ వ్యవస్థల పరిరక్షణ కోసం వుపయోగించుకునే లక్ష్యం కోసం ఒక సాధనంగా వినియోగించుకుంటాయి. పై కేసుల్లో పై ప్రమాణాల ప్రకారం సాయిబాబా, వరవరరావు పట్ల, పై కేసుల్లోని మరికొందరు నిర్బంధితుల పట్ల మానవతా చర్యలను చేపట్టాల్సి వుంది. అవేవీ చేపట్టలేదు. వరవరరావు కరోనా వ్యాధి పీడితుడిగా నిర్ధారించిన తర్వాత కూడా ఇలాంటి ' మానవతా ' చర్యలను చేపట్టలేదు. ఇది ముమ్మాటికీ అసాధారణత్వాన్ని వెల్లడి చేస్తున్నది.

ఇప్పటి వరకూ అమలులో వున్న లేదా ఉనికిలో ఉన్న కొన్ని న్యాయ ప్రమాణాలకు కాలదోషం పడుతున్న పరిస్థితికి నిదర్శనమిది. ఇంతవరకూ ఉనికిలో లేని కొత్త న్యాయ ప్రమాణాలు లేదా న్యాయ సంస్కృతి కొత్తగా అమలులోకి వస్తున్న స్థితిని సూచిస్తాన్నాయి. వీటి నుండి ఈ నిర్ధారణలకు రాక తప్పదు. వీటిని ఇంకా పాత కళ్ళద్దాలతోనే పరిశీలిస్తే వాస్తవ నేపథ్య కారణాలను అర్థం చేసుకోలేము. ఈ నేపథ్య కారణాలను అన్వేషించే దృక్కోణంతో మనం పరిశీలించక తప్పదు. అందుకొక ప్రయత్నం చేద్దాం.

చరిత్ర గమనంలో వర్గాలు ఏర్పడ్డాయి. వర్గాలు ఏర్పడే క్రమంలో రాజ్యాలు ఏర్పడ్డాయి. రాజ్యాల అవసరం కోసం రాజ్యాంగాలు రూపొందాయి. వర్గాలు ఉనికిలోకి రాకుండా రాజ్యాలు ఉనికిలోకి రాలేదు. రాజ్యాలు ఉనికిలోకి రాకుండా రాజ్యాంగాలు ఉనికిలోకి రాలేదు. చరిత్రలో రాజ్యాంగాలు ఉనికిలోకి రాకముందే రాజ్యాల ఉనికి ఉంది. కానీ రాజ్యాల ఉనికి లేకుండా రాజ్యాంగాల ఉనికి మాత్రం ఊహాతీతమైనది. ఎద్దు/గుర్రమూ లేకుండా బండి ఉనికిలోకి రాలేదు. కానీ బండి ఉనికిలోకి రాని కాలంలో కూడా ఎద్దు ఉనికిలో వుంది. బండి ఉనికిలో వుండటం వల్ల ఎద్దు ఉనికిలోకి రాలేదు. అందుకు భిన్నంగా ఎద్దు ఉనికిలోకి రావడం వల్లనే బండి ఉనికిలోకి వచ్చింది. ఎద్దూ బండీ ఒకటి కాదు. అవి రెండూ సమానాంశాలు కాదు. సమాంతర అంశాలు కూడా కాదు. అదేవిధంగా చరిత్ర పరిణామ క్రమంలో ఉనికిలోకి వచ్చిన రాజ్యాలూ, రాజ్యాంగాలూ ఒకటి కాదు. అవి రెండు కవల పిల్లలు కాదు. అవి సమాన వ్యవస్థలు గానీ, సమాంతర వ్యవస్థలు గానీ కావు. ఈ చారిత్రక దృష్టితో పరిశీలిద్దాం.

ఆయా నిర్దిష్ట సామాజిక వ్యవస్థలలో ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సంబంధాలను బట్టి ఆయా రాజ్యాల స్వభావాలు వుంటాయి. వాటి మౌలిక స్వభావం మారకుండా వాటి స్వరూపాలు నిరంతరం మారతాయి. అవి మారే కొద్దీ రాజ్యాంగాల స్వరూపాలు కూడా మారుతుంటాయి. అవి సహజంగా పరిమాణాత్మక మార్పులుగా వుంటాయి. భారత రాజ్యాంగానికి 1950 నుంచి ఇటీవల కాలం వరకూ వందకు పైగా సవరణలు జరిగాయి. అవి స్థూలంగా దాని మౌలిక స్ఫూర్తికి అనుగుణంగానే జరిగాయి. దాని స్వభావం మారకుండానే స్వరూపం మారుతూ వచ్చింది. అయితే ఇటీవల సంవత్సరాలలో పరిస్థితి అలా లేదు. మౌలికంగా రాజ్యాంగమే మార్పులకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. దీన్ని ప్రత్యేకంగా పరిశీలించాల్సి ఉంది.

ఆయా ఆర్థిక వ్యవస్థలలో వస్తుగతంగానే మౌలిక మార్పులు చోటు చేసుకుంటున్నప్పుడు, వాటికి ప్రాతినిధ్యం వహించే, రాజ్యాల స్వభావం కూడా మౌలికంగా మారుతుంది. సహజంగానే రాజ్యాంగాలు కూడా మౌలిక మార్పులకు లోనవుతాయి. ఉదా :- 1929 నాటి ఆర్థిక మాంద్యం తర్వాత నాటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మౌలిక మార్పుకు గురైంది. ఫలితంగా బూర్జువా ప్రజాస్వామ్య రాజ్యాలు క్రమంగా ఫాసిస్టు రాజ్యాలుగా పరిణామం చెందాయి. ఆనాటి ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి విధానం యొక్క అవసరాలు ఫాసిజాన్ని ఒక పాలనా రూపంగా డిమాండ్ చేసాయి. దానికి అనుగుణమైన రాజ్యాంగాలు కూడా కొత్తగా ఉనికిలోకి రావాల్సి వుంటుంది. అట్టి పరిణామ ప్రక్రియకు నిదర్శనంగా నాడు ఇటలీ, జర్మనీలలో ఫాసిస్టు, నాజీ పార్టీలు ఉనికిలోకి వచ్చాయి. నాటి ఫాసిజం, నాజీయిజాలు తొమ్మిది దశాబ్దాల తర్వాత నేటి ప్రపంచ యవనికపై తిరిగి రంగ ప్రవేశం చేస్తున్నాయి. ఈ నేపథ్యం నుండి నేటి భారతదేశ రాజ్య మార్పులను, రాజ్యాంగ మార్పులనూ పరిశీలించాల్సి వుంది.

నేటి భారతదేశ ఆర్థిక వ్యవస్థ సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థతో ముడిపడి వుంది. దానివల్ల నేడు ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వచ్చే మార్పులకు భారతదేశ ఆర్థిక వ్యవస్థ దూరంగా వుండజాలదు. నేడు సంపదకూ, దారిద్ర్యానికీ మధ్య వ్యత్యాసాలు పెరిగే కొద్దీ, ఇక్కడి ఉత్పత్తి శక్తుల యొక్క అవసరాలు మారతాయి. పాత రాజ్యవ్యవస్థలు యథాతథ రూపంలో ఉత్పత్తి శక్తుల కొత్త అవసరాలను నెరవేర్చలేని కొత్త పరిస్థితి ఏర్పడుతున్నది. పాత చెప్పుల సైజును కొత్తగా ఎదిగే కాళ్ళ అవసరాలు నేరవేర్చడం లేదు. చెప్పుల సైజును బట్టి కాళ్ళ సైజును మార్చరు. పైగా కాళ్ళ సైజును బట్టే చెప్పులను మార్చుకోవాలి. రాజ్యాల పాత స్వరూప, స్వభావాలను బట్టి ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి విధానాలను నియంత్రించడం సాధ్యపడదు. తద్భిన్నంగా ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి విధానాల యొక్క నూతన అవసరాలను బట్టే, నూతన రాజ్యాలు ఉనికిలోకి వస్తాయి. వాటికి అనుగుణ:గా నూతన రాజ్యాంగాలు కూడా ఉనికిలోకి వస్తాయి. ఈ మార్పులకు గురికావాల్సిన పరిస్థితులు నేడు మన ఎదుటకు వస్తున్నాయి. వాటి రాజకీయ లక్షణాలు నేడు కనిపిస్తున్నాయి. ఈ దృక్కోణంలో నేటి పరిణామాల్ని పరిశీలించాలి.

కైజర్ నేతృత్వం వహించిన జర్మన్ సామ్రాజ్యం మొదటి ప్రపంచ యుద్ధంలో ఓటమి పొందింది. దాని పతనం నుంచి జర్మనీ శ్రామిక విప్లవం వెన్నంటింది. రష్యా సోషలిస్టు విప్లవాన్ని వెన్నంటి జర్మనీ సోషలిస్టు విప్లవం త్వరలో ఆసన్నమౌతున్నదని ఆనాటి ప్రపంచ రాజకీయ విశ్లేషకులు జోస్యాలు కూడా చెప్పారు. కానీ జర్మనీలో నాటి ఎర్రజెండా విప్లవాన్ని నియంత్రించడానికి జర్మనీలోని ఎర్రజెండా నామధేయులకు రాజ్యాధికారానికి అప్పగించడానికి నాటి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ పూనుకున్నది. ఫలితంగా జర్మన్ కమ్యూనిస్టు పార్టీ సమాధుల మీద జర్మనీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ రాజ్యాధికారానికి వచ్చింది. రాచరిక రాజ్యం స్థానంలో కొత్తగా వైమర్ రిపబ్లిక్ ఏర్పడింది. మిలియన్ల శ్రామికుల నెత్తుటి మడుగుల మీద బూటకపు ఎర్రజెండా రాజ్యం అధికారానికి వచ్చింది. రోజా లక్సెంబర్గ్, కారల్ లీబ్‌నెఖ్ట్‌ల సమాధులపై నూతన రాజ్య స్థాపన జరిగింది. నాటి నూతన రాజ్య ప్రధాన లక్ష్యం శ్రామికవర్గ విప్లవ నియంత్రణే! అందుకోసం అది సాపేక్షికంగా శ్రామికవర్గ ప్రజలకు తాత్కాలికంగా అనేక ప్రజాతంత్ర హక్కులను మంజూరు చేసింది. మొదటిసారి సార్వజనీన ఓటింగ్ హక్కుతో పాటు సాపేక్షిక స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కల్పించింది. వాటిని అనుభవించిన శ్రామిక ప్రజలలో ఒక ఆశ లేదా భ్రమ కలిగింది. అయితే దాని వయస్సు సరిగా 14 సం॥లు కూడా లేదు. 1929 నాటి ఆర్థిక మాంద్యం తర్వాత వైమర్ రిపబ్లిక్ మనుగడకు ముప్పుగా మారింది. అది మఖలో పుట్టి పుబ్బలో అంతరించిన రాజ్యవ్యవస్థగా మారింది. చివరకు వైమర్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహించే హిండెన్‌బర్గ్ ప్రభుత్వానికి ముప్పు వచ్చింది. ఆ పరిస్థితుల నేపథ్యం నేడు పునరావృతమౌతోంది.

మహోన్నతమైన నాటి శ్రామిక విప్లవాన్ని నియంత్రించడానికి నాటి జర్మనీ బడా పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ అండతో జర్మనీ శ్రామికవర్గాలకు అనేక కొత్త సౌకర్యాలు, చట్టబద్ధ హక్కులను కల్పించింది. సోషల్ డెమోక్రసీని భుజానకెత్తుకున్నది. వాస్తవ ఎర్రజెండాను దెబ్బతీసేందుకు బూటకపు ఎర్రజెండాను ముద్దాడింది. 1929 తర్వాత తన అవసరాలను సోషల్ డెమోక్రసీ నెరవేర్చ లేకపోయింది. దానితో జర్మనీ బూర్జువావర్గం సోషల్ డెమోక్రసీకి వ్యతిరేకంగా నాజీ పార్టీని బాహాటంగా బలపరిచింది. ఫలితంగా 1933 జనవరిలో హిట్లర్ జర్మనీ ఛాన్సలర్‌గా ఎన్నికయ్యాడు. తన పాత సేవకురాలు వైమర్ రిపబ్లిక్ అధినేత హిండెన్‌బర్గ్ ద్వారానే హిట్లర్‌ను జర్మనీ బడా బూర్జువావర్గం ఛాన్సలర్‌ను చేయించింది. దీనితో రాజ్య స్వరూప, స్వభావాలను మార్చేపనికి దిగింది. హిట్లర్ అధికారానికి రాగానే జర్మనీ రీచ్‌స్టాగ్ భవనాన్ని (పార్లమెంటు భవనం) తామే దగ్ధం చేయించింది. కమ్యూనిస్టులు, కార్మికనేతలపై కుట్రకేసులను బనాయించింది. హిట్లర్ ప్రభుత్వం ద్వారా జర్మనీ బూర్జువా వర్గం చేయించిన ఈ దగ్ధకాండ యొక్క లక్ష్యాలలో ఒకటి నాటి జర్మనీ రాజ్యాన్ని మౌలికంగా మార్చడం! దాని తక్షణ ఫలితంగా ఉనికిలోకి వచ్చిందే ' ఎనేబిలింగ్ చట్టం-1933. ఈ కొత్త నిర్బంధ రాజ్యదాడికి వాస్తవ కమ్యూనిస్టులతో పాటు సోషల్ డెమోక్రేట్లు కూడా గురయ్యారు. ఆలస్యంగా కమ్యూనిస్టులతో చేతుల కలపడానికి వారు సిద్ధపడ్డారు. కానీ అప్పటికే పరిస్థితి చేజారింది. అంతిమంగా వైమర్ రిపబ్లిక్ రాజ్యాంగ వ్యవస్థ నశించి, దాని

( మిగతాది 4వ పేజీలో )

( 3వ పేజీ తరువాయి)
స్థానంలో ఫాసిస్టు రాజ్యవ్యవస్థ ఉనికిలోకి రావడానికి అదో మూలమలుపు సంఘటనగా మారింది. సహజంగానే జర్మనీ రాజ్యాంగ వ్యవస్థ కూడా మార్పులకు గురైనది.

భారతదేశంలో 2014లో ఆరెస్సెస్ ప్రభుత్వం అధికారానికి రావడం కాకతాళీయ పరిణామం కాదు. అంతకుముందు 15 సార్లు జరిగిన పార్లమెంటు ఎన్నికలకి భిన్నమైనది. భారతదేశ దోపిడీ వ్యవస్థ తన కొత్త అవసరాలను నెరవేర్చగలిగే కొత్త రాజ్యపాలనా వ్యవస్థను డిమాండ్ చేస్తూ వస్తున్నది. దాని ఫలితమే ఆరెస్సెస్ ప్రభుత్వాలు అధికారం స్వీకరించడం!

1947కి ముందు ఒక విప్లవ రాజ్యవ్యవస్థ ఏర్పడే పరిణామ ప్రక్రియను నియంత్రించడానికి ఒక వ్యూహాత్మక ప్రయత్నం దోపిడీ వర్గాల వైపు నుండి జరిగింది. రెండు దశాబ్దాల బ్రిటీష్ వలస వ్యతిరేక స్వాతంత్రోద్యమ ఫలితంగానూ, దేశంలో విప్లవ పరివర్తనను నియంత్రించే ఉద్దేశ్యాలతోనూ ఇక్కడ కూడా సాపేక్షంగా మెరుగైన హక్కులు, స్వేచ్ఛలతో 1950లో సాపేక్షికంగా మెరుగైన రాజ్యాంగం ఏర్పడింది. అది తర్వాత అనేక సవరణలకు గురవుతూ వచ్చింది. దానికి అనుగుణమైన న్యాయవ్యవస్థ కూడా అమలులో వుంది. అవి నాడు చెలామణీలో వున్న సగటు ప్రజాస్వామ్యం, సగటు మానవత్వాలను ప్రతిబింబించాయి. నేడు దేశంలో సంపదకూ, దారిద్ర్యానికీ మధ్య పెరిగే వ్యత్యాసం ఒక కొత్త భౌతిక పరిస్థితిని సృష్టిస్తోంది. నేటి ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి విధానం యొక్క అవసరాలను నేటి రాజ్య వ్యవస్థ సంతృప్తి పరచలేక పోతున్నది. దాన్ని మౌలికంగా మార్చుకోవాల్సిన పరిస్థితి నేటి దోపిడీ వ్యవస్థకు ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో రాజ్య వ్యవస్థతో పాటు రాజ్యాంగానీ, న్యాయవ్యవస్థనూ మార్చుకోవాల్సి వస్తున్నది. పై కేసులను ఈ వెలుగులో పరిశీలించాల్సి వుంది.

క్షమాభిక్ష, శిక్షల తగ్గింపు, పెరోల్స్ వంటి మినహాయింపులను అనారోగ్యం, వృద్ధాప్యం, అంగవైఖల్యాల వంటి మానవతా కారణాలతో గతంలో న్యాయవ్యవస్థ మంజూరు చేస్తుండేది. అది అలా చేయగలిగిందంటే, అది ప్రాతినిధ్యం వహించే రాజ్యాంగ వ్యవస్థ దానిని అనుమతించిందని అర్థం! అంటే అది ఆనాటి ఉత్పత్తి శక్తులకు కూడా ఉపయోగపడిందని అర్థం! ఫలితంగా రాజ్యవ్యవస్థ ప్రయోజనాలకు అది విరుద్ధంగా లేదని కూడా అర్థం! నేడు అట్టి అన్ని ప్రమాణాలను అటకెక్కిస్తున్నదంటే, ఒక మౌలిక మార్పును అది వెల్లడిస్తున్నదని అర్థం చేసుకోవాల్సి వుంటుంది.

నేడు సాయిబాబా, వరవరరావు తదితరులను విచారిస్తున్న లేదా శిక్షిస్తున్న పద్ధతులలో ఒక మౌలిక మార్పు కనిపిస్తోంది. అందుకే ' ఇంత దారుణమా? ', ' ఇంత అమానుషమా? ', ' ఎంతైతే మాత్రం యింత ఘోరమా? ' అనే వ్యాఖ్యలు తరచుగా వినిపిస్తున్నాయి. వీరిపట్ల ప్రభుత్వ విధానాన్ని, న్యాయవ్యవస్థ వైఖరిని ఖండించే సందర్భాలలో నేడు తరచుగా ఈ తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయంటే, అదో ప్రత్యేక పరిస్థితిని వెల్లడిస్తాయి. దీనికి గల మూల కారణాలన్నీ అర్థం చేసుకోవల్సి వుంది.

భీమాకోరేగావ్, ఎల్గార్ పరిషత్ కేసుల విచారణ ప్రక్రియను జాప్యం చేయడం వెనుక నేటి దోపిడీ పాలకవర్గాలకు నిర్దిష్ట లక్ష్యం లేకుండా వుండదు. మోడీపై హత్యా ప్రయత్నానికి తాము పాల్పడ్డామని అంగీకరించి, లొంగిపోతే శిక్షల నుంచి మినహాయించవచ్చు. ఈ నిందితులలో ఒకరో, కొందరో అప్రూవర్లుగా మారితే కూడా శిక్షల నుంచి మినహాయించవచ్చు. లేదంటే తాము నమ్ముతున్న విప్లవ, లేదా ప్రజాతంత్ర ఆశయాల నిబద్ధతను వదులు కుంటున్నట్లు ప్రకటిస్తే కూడా శిక్షల నుంచి మినహాయింపు లభించవచ్చు. తద్వారా ప్రధానిపై హత్యా ప్రయత్న కేసు అక్రమమైనది కాదని నిరూపించుకునే అవకాశం మోడీ ప్రభుత్వానికి లభిస్తుంది. ఇలాంటి అవకాశం లభించేంత వరకూ, అంటే నిందితులలో లొంగుబాట్లు లేదా రాజకీయ దిగజారుళ్ళు చోటు చేసుకునేంత వరకూ కేసుల విచారణ ప్రక్రియలో జాప్యం చోటు చేసుకునే అవకాశం లేకపోలేదు. నిర్బంధంలో వున్న నిందితుల లొంగుబాటు కోసం వారి వద్దకు రాయబారాలు అధికారికంగా జరగనక్కర లేదు. అందుకు అనువైన భౌతిక పరిస్థితులను రాజ్యం సృష్టిస్తే సరిపోతుంది. ఇది రాజ్య ప్రక్రియలో భాగమే. అయితే ఈ కొత్త భౌతిక పరిస్థితులను నిర్బంధితులు అధిగమిస్తుండటం ఒక అసాధారణ రాజకీయ పరిణామమే.

రెండేళ్ళు గతిస్తున్నప్పటికినీ, నిర్బంధితుల ఆశయ దీక్ష సడల లేదు. ఒకవైపు సాయిబాబా నుండి గానీ, మరోవైపు వరవరరావు సహా 11 మంది నుండి గానీ ధృడ సంకల్పం సడలకపోవడం అసాధారణమైనదే. రెండేళ్ళ క్రితం ఎన్.ఐ.ఎ బృందం కస్టడీలోకి వెళ్ళే సమయంలో తన అభిమాన లోకానికి పిడికిలెత్తి అభివాదం చేస్తూ శారీరక ఆరోగ్యంతో ఉత్సాహంగా వరవరరావు కనిపించారు. రెండేళ్ళ నిర్బంధ జీవితం ఆయన్ని శారీరకంగా నడవలేని నిస్సహాయ స్థితికి నెట్టింది. అలాంటి నిస్సత్తువ మధ్య కూడా పిడికిలి ఎత్తే సుసాంప్రదాయాన్ని ఆయన విడిచి పెట్టలేదు. మిగిలిన నిర్బంధితుల పరిస్థితి కూడా అలాంటిదే. వారిని నిర్బంధించిన రాజ్యాన్ని రాజకీయంగా ఓడిస్తున్న స్థితికి అది నిదర్శనం! రానున్న కాలంలో రాజ్యవ్యవస్థలో దానికి అనుగుణంగా రాజ్యాంగాలలో, దానికి లోబడ్డ న్యాయవ్యవస్థలలో వస్తున్న ఫాసిస్టీకరణ ధోరణులను ఎదుర్కొనాల్సిన, అధిగమించాల్సిన ధైర్య స్థైర్యాలను నేడు నిర్బందితులు అందిస్తున్నారు. ఇది ఒక విషాధంలో కూడా ఒక గర్వనీయమైనది.

ఈ శిక్షా పద్ధతుల ద్వారా నేడు మారుతున్న రాజ్యం తన ప్రత్యర్ధి రాజకీయ వర్గాలకు ఒక హెచ్చరిక చేయదల్చుకున్నది. గత కాలంలో వలే తాను ఇక నుంచి ' మానవత్వ ' ప్రమాణాలను పాటించబోనని హెచ్చరించ దలుచుకున్నది. గతంలో వలె బెయిల్స్, పెరోల్స్ ఇవ్వనని హెచ్చరించ దలుచుకున్నది. పాత న్యాయ ప్రమాణాల ప్రకారం ఇక ముందు సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేయబోనని హెచ్చరించ దలుచుకున్నది. ఒకసారి ఈ తరహా కుట్రకేసుల్లో ఇరుక్కున్నవాళ్ళు గతంలో వలే మధ్యలో విడుదలవుతారనే ఆశలను ఇక నుంచి వదులుకోండని హెచ్చరించ దలుచుకున్నది. ఈ డజను మందిని నిర్బంధంలో అమానుషంగా కొనసాగించడం ద్వారా బయట రోడ్డుమీద ఉద్యమిస్తున్న వేలమందిని భయోత్పాతానికి గురిచేసే లక్ష్యం రాజ్యానికి వుంది. ఉద్యమ శక్తులు నోరు మూసుకోకపోతే ' మీకూ యిదే గతి ' పడుతుందని రాజ్యం హెచ్చరించ దలిచింది. ఈ శిక్షా విధానపు లక్ష్యం కేవలం ఆ డజను మందిని శిక్షించడమే కాదు. కోట్ల మంది ప్రజలను పరోక్షంగా శిక్షించే లక్ష్యం ఈ శిక్షావిధానంలో దాగి వుంది. ఈ కొత్త ధోరణులను వెల్లడించడానికి ఈ కేసులు ఉదాహరణుగా నిలుస్తాయి.

తొంభై శాతం అంగవైకల్యం గల సాయిబాబాను అండా సెల్లులో నిర్బంధించడం అమానుషత్వం క్రిందకి రాదనే కొత్త రాజకీయ సంస్కృతి నేటి రాజ్యానికి అవసరమౌతోంది. 80 ఏళ్ళ వయోవృద్ధుడై, నిర్బంధంలో కరోనా పాజిటివ్ రోగిగా నిర్ధారించబడ్డ వరవరరావును నిర్బంధంలో కొనసాగించడం అమానవీయత క్రిందకి రాదనే కొత్త సాంప్రదాయాన్ని నేడు రాజ్యం నెలకొల్పదలుచుకున్నది. నేటి వరకూ చెలామణీలో వున్న సగటు మానవత్వం, ' అయ్యో పాపం ', ' ఎంత అన్యాయం ', ' ఇంత అమానుషత్వమా ', ' ఇదేమి దారుణం ' వంటి భావనలన్నింటినీ సమూలంగా రూపుమాపాల్సిన బాధ్యతలను నేటి రాజ్య వ్యవస్థ చేపడుతున్నది. దాని కనుగుణంగానే రాజ్యాంగ ప్రమాణాలూ, న్యాయ ప్రమాణాలు మారిపోతాయి. ఇప్పుడు జరిగే పరిణామ ప్రక్రియ అదే!

పై కేసులలో నేటి విచారణా విధానంలో ప్రత్యేకతల వెనుక మూల కారణాలను అర్థం చేసుకొని ఈ కొత్త పరిస్థితులను అధిగమించడానికి తగిన కర్తవ్యాలను రూపొందించుకోవడం విప్లవ, వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఎదుట వుంది. నిర్బంధితుల విడుదలకి తాత్కాలిక నిరసన కార్యక్రమాలకు బదులు దీర్ఘకాలిక ప్రక్రియ కూడా పట్టుదలతో నిరంతర కృషిని చేపట్టాల్సి వుంటుంది. అందుకు అనుగుణంగా విశాల ప్రాతిపదికతో కూడా కృషిని సాగించాల్సి వుంటుంది. ఈ కృషిలో నిర్బంధితుల ధృడ దీక్ష, సడలని సంకల్పాలను స్ఫూర్తిగా తీసుకోవల్సి వుంది.

జర్మనీ గత నాజీ చరిత్ర నుండి వర్తమాన చరిత్రకు గుణపాఠాలున్నాయి. అవి భవిష్యత్తులో పునరావృతం కానివ్వకుండా తగిన కర్తవ్యాలను కూడా నిర్దేశిస్తుంది. అది భీమాకోరేగావ్, ఎల్గార్ పరిషత్ కేసులకు వర్తిస్తుంది. వరవరరావు, సాయిబాబా తదితరుల పట్ల నేడు రాజ్యం అనుసరిస్తున్న " ప్రత్యేక న్యాయ " సంస్కృతి వారికే పరిమితం కాదు. లేదా వారి ఆలోచనలు, అభిప్రాయాలతో ఏకీభవించే రాజకీయ బృందాలకే పరిమితం కాదు. ఈ కేసులు అందిస్తున్న గుణపాఠమిదే.

హిట్లర్ కుక్క చావు చచ్చి చరిత్ర చెత్తకుప్పకి చేరిన తర్వాత ఆయన్ని

( మిగతాది 5వ పేజీలో )

## కామ్రేడ్ వరవరరావు తదితరులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ విజయవాడలో ధర్నా



80 సంవత్సరాలు పైబడిన కురువృద్ధుడు, విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, విప్లవ రచయిత వరవరరావుతో పాటు ఇంకా మరికొందరు ప్రముఖ ప్రజాస్వామికవాదులను కుట్ర పూరితంగా భీమా కోరేగావ్ కేసులు బనాయించి అరెస్టు చేసి రెండు సంవత్సరాలు దాటినా ఇంకా బెయిల్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ 2020 జులై 17న ఉపా వ్యతిరేక ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా నిర్వహించారు. స్థానిక హనుమాన్‌పేటలో గల మార్క్స్, ఏంగెల్స్‌ల విగ్రహాల వద్ద జరిగిన ధర్నాలో విరసం నాయకులు అరసవిల్లి కృష్ణ, ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్, కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర నాయకులు దుడ్డు ప్రభాకర్, పికెఎస్ రాష్ట్ర నాయకులు కొండయ్య, పిఓడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు పి.పద్మ తదితరులు ప్రసంగించారు. వరవరరావుకి కరోనా సోకడానికి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ నిర్బంధమే కారణమన్నారు. ఎలాంటి రుజువులు లేకపోయినా కనీసం బెయిల్ కూడా ఇవ్వకుండా వరవరరావు తదితరులను నిర్బంధించడం ప్రజాస్వామ్య వ్యతిరేకమని వక్తలు పేర్కొన్నారు. అలాగే 60 సంవత్సరాలు దాటిన ఖైదీలందరిని కరోనాను దృష్టిలో ఉంచుకొని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరిస్తున్న ఉపా నల్ల చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగమం నాయకులు బి.జమిందార్, ఇఫ్టూ నాయకులు కె.పోలారి, కుటుంబరావు, పి.డి.ఎస్.యూ రాష్ట్ర నాయకులు ఏ.రవిచంద్ర హక్కుల సంఘం నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత యువకుడికి శిరోముండనం చేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని ఆందోళనలు










**జంగారెడ్డి గూడెం :**

తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం ఎద్దులపల్లిలో అక్రమ ఇసుక రవాణాని అడ్డుకున్నాడని దళిత యువకుడు వరప్రసాదుపై దాడిచేసి పోలీస్ స్టేషన్‌లో శిరోముండనం చేసిన పోలీసులను మరియు రాజమండ్రిలో దళిత బాలికపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తే.22-7-2020న పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో నిరసన కార్యక్రమం చేసారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు యు.వెంకటేశ్వరరావు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ, ఎం.సుబ్బారావు, కె.వెంకటరావు, ఎం.లక్ష్మయ్య, ఇ.శ్రీను, కె.అబ్బులు, పి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**నిడదవోలు :**

దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకి వ్యతిరేకంగా తే.26-7-20న పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులోని అంబేద్కర్ విగ్రహము వద్ద IFTU అనుబంధ అభ్యుదయ పెయింటింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకుడు గ్రీష్మ కుమార్, రవ్వ సురేష్ కుమార్, యెల్లమిల్లి చంటి, బండి బుచ్చిరాజు, యాదాల రమణ, గంగాధరం, రాజ్ కుమార్, రాజ్పాల్, సాయి, సత్తిపండు, చైతన్య, నూతంగి రమేష్, ప్రవీటటణ్, వేణు తదతరులు పాల్గొన్నారు.

**రాజమండ్రి :**

రాజమండ్రిలో తే.9-7-2020న దళితులపై జరుగుతున్న దాడులు మరియు ముంబైలోని డా॥ అంబేద్కర్ ఇంటిపై దాడిని ఖండిస్తూ స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ కూడలి వద్ద ఐ.ఎఫ్.టి.యు, కె.ఎన్.పి.ఎస్ ఆధ్వర్యంలో నివసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు ఎ.వి.రమణ, కెఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కోనల లాజర్, నాయకులు జి.మనోహర్ మాట్లాడారు. సుదర్శనరావు, సురేష్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు డా॥ అంబేద్కర్ ఇంటిపై దాడిచేసిన మతోన్మాదులను ఖఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు.

( 4వ పేజీ తరువాయి)

భారతదేశంలోని నియో నాజీ శక్తులు స్ఫూర్తిదాతగా తీసుకున్నాయి. అట్టి ఫాసిస్టు రాజకీయ స్ఫూర్తితోనే జర్మన్ ఛాన్సలర్‌గా హిట్లర్ ప్రమాణ స్వీకారం (30-1-1933న) చేసిన పట్టాభిషేకపు 15వ వార్షికోత్సవం (30-1-1948న) గాంధీని పొట్టన పెట్టుకున్నాయి. అయితే ఆనాటికి ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి విధానానికి ఆరెస్సెస్‌ని అధికారానికి తెచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడలేదు. గాంధీ, నెహ్రూలు అధికారికంగా ప్రాతినిధ్యం వహించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అప్పటికింకా దోపిడీ వర్గాల ప్రయోజనాలను నెరవేర్చే స్థితిలో ఉంది. అది నేడు వాటికి అవసరం లేకుండా పోయింది. అందుకే నేడు ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి విధానాల అవసరాల కోసం ఆరెస్సెస్ సంస్థ అధికారం స్వీకరించింది. అది రాజ్య వ్యవస్థనూ, రాజ్యాంగ వ్యవస్థనూ, న్యాయవ్యవస్థనూ ఫాసిస్టు దిశలో మారుస్తున్నది. ఇది పై కేసులు వెల్లడిస్తున్నది. అయితే నాటి జర్మనీలో తమ చేతులు కాలిన తర్వాత పసరు కోసం ఆకులను రుద్దుకున్న నాటి జర్మన్ సోషల్ డెమొక్రసీ పరిస్థితి రాకూడదంటే, నాటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రాతినిధ్యం వహించిన రాజకీయ శక్తులు అప్రమత్తం కావాల్సి ఉంది. ఇది నేటి అవసరం. వరవరరావు, సాయిబాబాల దగ్గరే నూతన న్యాయ ప్రయోగ ప్రక్రియను అడ్డుకోకపోతే అది మున్ముందు రాహుల్ వరకూ విస్తరిస్తుంది. ఈ వెలుగులో విశాల ఐక్య నిరసనోద్యమం వీరి విడుదలకై కొనసాగాల్సి వుంది. అతి త్వరలో విడుదలైతే సంతోషిద్దాం. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల సంస్థలు, మేధావులు స్పందిస్తున్నందున అటి విడుదలకు అవకాశం లేకపోలేదు. కానీ అలా విడుదల కాకపోతే నిరుత్సాహం చెందడం ప్రజాతంత్ర సమాజానికి తగదు. పాత న్యాయ సంస్కృతి దృక్కోణపు వెలుగులో కాకుండా నూతన దృక్కోణంతో సుదీర్ఘ, సుదృఢ, విశాల నిరసనోద్యమానికి సిద్ధమౌదాం.

# దేశ సార్వభౌమత్వాన్ని, భద్రతను పణంగా పెట్టి మోడీ ప్రభుత్వం సాగిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం!

- కె. పోలారి

దేశ ఆర్థిక పరిస్థితి సంక్షోభంలోకి నెట్టబడింది. నిరుద్యోగం పెరిగిపోతున్నది. బ్యాంకులు సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నాయి. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు బాధలు పడుతున్నారు. బడ్జెట్లలో లక్షల కోట్లు అంకెల గారడీ కేటాయింపులేనని, నిధుల కొరతలు కనిపిస్తూనే ఉన్నాయి. అయినా మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్లలో రుణమాఫీలు చేస్తున్నది. ఒకవైపున కార్పొరేట్ల పన్నును సగానికి సగం తగ్గించి దేశ ఆర్థిక పరిస్థితిని దివాళా తీయిస్తున్నారు. మరోవైపున ఆర్థిక రంగాన్ని గట్టెక్కించడానికంటూ సామాన్యులపై పన్నులు, జిఎస్టి భారాలు వేస్తున్నారు. ఇక్కడితో ఆగకుండా నిధులు సమీకరణ చేయాలంటే ప్రభుత్వ రంగ సంస్థల్లోని వాటాలను అమ్మకతప్పదని బిజెపి పాలకులు చెబుతున్నారు. ఇందుకు ప్రభుత్వం మూడు కారణాలు చెబుతున్నది. ఒకటి దేశ ఆర్థిక ప్రగతి సాధించాలంటే నిధుల సమీకరణ కావాలి. అందుకు ప్రభుత్వ రంగంలో వాటాలను అమ్మడం మినహా వేరే దారి లేదంటున్నారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థలలోని బ్యూరోక్రసీ కారణంగా ఆయా సంస్థలు అభివృద్ధి కావడం లేదు. అదే ప్రైవేటు యాజమాన్యాలు అయితే సమస్యలు వస్తే వెంటనే వ్యక్తిగతంగా తగు నిర్ణయాలు తీసుకొని పరిష్కరిస్తారు. సంస్థలు అభివృద్ధి అవుతాయి. ప్రభుత్వ అజమాయిషీ ఉంటే అభివృద్ధి కావని అంటున్నారు. మూడు ప్రైవేటు రంగంలో అయితే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. నిరుద్యోగం తగ్గుతుందని మోడీ & కో సెలవిస్తున్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో జవాబుదారీతనం లేని కారణంగా సంస్థలు నష్టాలలో పేరుకొని పోతున్నాయని అందుకే వాటిని అమ్మేస్తున్నామని గతంలో చెప్పేవారు. ఇప్పుడు నష్టాల గురించి చెప్పే పరిస్థితి లేదు. అందుకే అభివృద్ధి, ఉపాధి, నిధుల సమీకరణ అని మాట్లాడుతున్నారు. ప్రభుత్వం ఇప్పుడు కరోనా సంక్షోభాన్ని అందివచ్చిన అవకాశంగా ఎంచుకున్నది. సందట్లో సడేమియాగా ప్రజల దృష్టి అంతా కరోనా భయంతో ఉంటే ఈ సమయంలో తన ప్రైవేటీకరణ చర్యలను మోడీ సర్కారు ఇదే అదునుగా వేగవంతం చేసింది. 20 లక్షల కోట్ల ప్యాకేజీని ఒక సమ్మోహనాస్త్రంగా దేశంపైకి వదిలింది. 20 లక్షల కోట్ల ప్యాకేజీ అనే మైకం తెరలతో ప్రజల కళ్ళు కప్పేశారు. అదే సమయంలో రైల్వే, ఇస్రో, ఆయిల్, కోల్ తదితర కీలక రంగాల ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టారు. కళ్ళు తెరచి చూస్తే ఇటు 20 లక్షల కోట్ల ప్యాకేజీ, అటు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ మొత్తంగా కార్పొరేట్ బకాసురుల కడుపులు నింపడానికేనని అర్థమవుతుంది.

ప్రభుత్వమే కాదు కొందరు మేధావులు కూడా ప్రభుత్వరంగమైన, ప్రైవేటురంగమైనా తేడా ఏమీ లేదంటున్నారు. రెండు చోట్ల ఉద్యోగులను, కార్మికులను దోపిడీ చేయడం జరుగుతుంది కదా అంటున్నారు. విదేశీ పెట్టుబడులు వలన, ప్రైవేటు రంగం వలన కార్మికులకు ఉపాధి దొరుకుతుందని చెబుతున్నారు. ప్రభుత్వ వాదననే మరో కోణంలో ప్రచారం చేస్తున్నారు. చిల్లర దుకాణాలలో, వీధి వ్యాపారాలలో బడుగు జీవులకు ఉద్యోగాలు ఉండవని, అదే రిలయన్స్, వాల్మార్ట్, డిమార్ట్ వంటి మాల్స్‌లలో అయితే ఉద్యోగాలు వస్తాయి కదా అని అంటున్నారు. ఒక్కో వాల్మార్ట్ వంటి సంస్థ వలన దాని చుట్టుప్రక్కల ఉండే చిల్లర వ్యాపారాలు, వీధి వ్యాపారాలు, చివరకు తోపుడు బండ్లపై కూరగాయలు, పండ్లు అమ్ముకునే వందల మంది ఉపాధిని కోల్పోతారు. కానీ ఒక్కో మార్ట్ లో మహా అయితే పదుల మందికి అతి తక్కువ వేతనాలతో ఉపాధి ఉంటుంది. వందల మంది ఉపాధి పోతున్న సంగతి చూపకుండా పదుల మందికి ఉపాధి దొరుకుతున్నదని చూపిస్తున్నారు. సరిగ్గా ప్రభుత్వం నేడు ఇలాగే చెబుతున్నది.

ఒకసారి చరిత్రలోకి వెళితే ప్రారంభం నుండి ప్రభుత్వ రంగం లేదు, ప్రైవేటు రంగం మాత్రమే ఉండేది. అదే ప్రైవేటు రంగంలో ఒక భాగం ప్రభుత్వ రంగంతో కలసి మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ప్రభుత్వ మరియు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య రంగంగా మారింది. తిరిగి నేడు వాటిని ప్రైవేటు రంగానికి మార్చుతున్నారు. ఇంతక ముందు ఎందుకు ప్రైవేటు రంగాన్ని ప్రభుత్వ రంగంగా మార్చారు, నేడు ఎందుకు ప్రభుత్వ రంగాన్ని తిరిగి ప్రైవేటు రంగంగా మారుస్తున్నారో పరిశీలించాలి.

రాచరిక సమాజాలలో వ్యాపారాలు, భూస్వామ్య సమాజాల్లో ఏర్పడ్డ తొలిదశ కుటీర పరిశ్రమలు, గిల్డ్‌లు వంటి పరిశ్రమలను ప్రభువులకు కప్పం కడుతూ ప్రైవేటుగా వ్యక్తులే నడుపుకునే వారు. పెట్టుబడిదారి సమాజంలో కూడా తొలుత పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ప్రైవేటుగానే ఉండేవి. మన దేశాన్ని ఆక్రమించి పాలించిన బ్రిటీషు వారు మొదటిగా ప్రైవేటు వ్యాపారులుగానే వచ్చారు. పరిశ్రమలను వారు ప్రైవేటుగానే నడిపారు. తర్వాత క్రమంలో ఈస్ట్ ఇండియా స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వం పాలన చేపట్టింది. 1947కి ముందు దేశంలో ఎన్ని పరిశ్రమలు, వాణిజ్య, వ్యాపార కేంద్రాలు ఉన్నాయో అవన్నీ ప్రైవేటు వారి చేతుల్లోనే ఉండేవి. ప్రభుత్వ అధీనంలో కేవలం 18 ఆయుధ తయారీ కర్మాగారాలు మాత్రమే ఉండేవి. అయితే ప్రపంచవ్యాపితంగా అనేక ప్రభుత్వాలు మావి సంక్షేమ రాజ్యాలు అని చెప్పుకుంటూ సంస్కరణలను చేపట్టడానికి, అనేక ప్రజానుకూల చట్టాలు చేయడానికి, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు, ఇతర వాణిజ్య సంస్థలు ఏర్పాటు చేయడానికి పూనుకున్నాయి. దీనికి నాడు ప్రపంచంలో రష్యాలో విప్లవంతో కొత్తగా ఉనికిలోకి వచ్చిన కార్మిక రాజ్యమే ప్రధాన కారణం. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా వచ్చిన సోషలిస్టు వ్యవస్థే కారణం. 1917లో రష్యాలో కార్మికవర్గ విప్లవ విజయంతో సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. దేశాల ప్రజల దృష్టి కమ్యూనిజం వైపు రాకుండా చేయడానికి వారు రెండు విధాలుగా ప్రయత్నాలు చేశారు. ఒకవైపున అప్పుడే పుట్టిన రష్యా కార్మికవర్గ ప్రభుత్వాన్ని చిదిమి వేయడానికి రకరకాల కుట్రలు చేశారు. యుద్ధాలతో రష్యాను దురాక్రమణ చేయాలని ప్రయత్నించారు. మరోవైపున సోషలిజం కాదు పెట్టుబడిదారీ విధానమే అందరికీ ప్రజాస్వామ్యం ఇస్తుందని చెప్పడానికి సంస్కరణలు, కొన్ని ప్రజానుకూల చట్టాలు, ప్రజలందరికీ ఓటు హక్కు వంటి చర్యలు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో మన దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఉనికిలోకి వచ్చాయి. ఆనాటి ప్రధాని నెహ్రూ కూడా సోషలిజం పేరు జపించాడు. పెట్టుబడిదారీ పాలకుల ఉద్దేశాలు ప్రజలకు ప్రజాస్వామ్యం అందించాలని కాదు. మేడిపండు లాంటి నినాదాలతో ప్రజలను మభ్యపెట్టాలని వారి ఉద్దేశ్యం. ఆనాటి పాలకులు ఈ కొత్త నినాదాలతో ఒకే గుండుకు రెండు పిట్టలు మాదిరిగా ఎంచుకున్నారు. ఒకవైపున అప్పటికే కష్టాలలో, నష్టాల ఊబిలో కురుకపోయి ఉన్న ప్రైవేటు పరిశ్రమలను, బ్యాంకులను జాతీయం చేయడం లేదా వాటిలో ప్రభుత్వం ఈక్విటీలుగా పెట్టుబడులు పెట్టడం ద్వారా ప్రైవేటు పెట్టుబడిదారులకు ఉపశమనం కలిగించారు. మరోవైపున వాటిని జాతీయం చేస్తూ సోషలిస్టు విధానాలను ఎంతో కొంత మేరకు అమలు చేస్తున్నట్లు ప్రజలను నమ్మించగలిగారు. అదే సందర్భంలో ప్రైవేటు రంగంలో కంటే ప్రభుత్వ రంగంలో ఉద్యోగ, కార్మికులు తమ పోరాటాల ద్వారా సంస్కరణల సౌకర్యాలలో, వేతనాలలో కొంతమేరకైనా మేలు పొందగలిగారు. బక్క చిక్కి ఉన్న ప్రైవేటు రంగ సంస్థలు ప్రభుత్వ రంగంగా మారిన తరువాత లక్షల కోట్ల విలువలు కలిగివున్న ఆస్థులుగా ఎదిగాయి. మరోవైపు మిలియన్ల మందికి ఉద్యోగాలు కల్పించబడ్డాయి. ఇప్పుడు ఆ ఆస్తులకు, వాటిలోని లక్షల మంది ఉద్యోగాలకు మోడీ ప్రభుత్వం ఎసరు పెడుతున్నది.

1947 అధికార మార్పిడి తరువాత కాంగ్రెస్ నెహ్రూ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు రెండు రంగాల మిశ్రమ ఆర్థిక వ్యవస్థ విధానాన్ని ఆమోదించింది. ఇందుకోసం 1951 లో పారిశ్రామిక అభివృద్ధి నియంత్రణ చట్టం చేశారు. ఆ వెలుగులో 1951 చివరినాటికి 5 ప్రభుత్వ రంగ సంస్థలు (పి.ఎస్.యూ లు) ఏర్పడ్డాయి. అలా ఏర్పడ్డ పబ్లిక్ రంగ సంస్థలు నేడు 340కి పైగా చేరుకున్నాయి. 1991 నూతన ఆర్థిక విధానాల అమలు తరువాత కొన్ని పి.ఎస్.యూలు శాశ్వతంగా మూసివేసినా ఇంకా చిన్నా, పెద్దా సుమారు 300 వరకు సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్ప్రైజెస్, అండర్ టాకింగ్స్ సంస్థలు ఉన్నాయి. ఈ 300 పి.ఎస్.యూలలోని ప్రభుత్వ వాటాలలో కనీసం 25 శాతం వాటాలను

( తరువాయి 7వ పేజీలో)

( 6వ పేజీ తరువాయి )
విక్రయించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నది. మరో దుర్మార్గమైన విషయం ఏమిటంటే దేశ రక్షణకు, ఆర్థిక స్వావలంబనకు కీలకమైన ఇస్రో, రక్షణరంగ పరిశ్రమలు, టెలికాం కమ్యూనికేషన్స్, ఇన్సూరెన్స్, ఇంధన రంగాలైన ఆయిల్, కోల్ ఇండియా వంటి సంస్థలను కూడా అమ్మకానికి ఉంచారు. ఆయా ప్రభుత్వరంగ సంస్థలలో చాలా వాటిలో ఇప్పటికే ప్రైవేటు సంస్థల పెట్టుబడులు ఉన్నాయి. కానీ 51 శాతానికి పైగా ప్రభుత్వ వాటాలు ఉన్న కారణంగా వాటిపై ప్రభుత్వ అజమాయిషీ, నియంత్రణ కొనసాగుతున్నాయి. ఇప్పుడు అలాంటి అజమాయిషీ, నియంత్రణల హక్కులను కోల్పోయే విధంగా ప్రభుత్వం వాటిలోని వాటాలను విక్రయిస్తుంది. వాటిపై పూర్తి పెత్తనాన్ని ప్రైవేటు కంపెనీలకు సంక్రమింప చేస్తున్నది. దీనితో ప్రభుత్వరంగాలలోని లక్షలాది మంది ఉద్యోగులు ప్రైవేటు ఉద్యోగులుగా మారిపోతారు. నష్టాలు తగ్గించాలని, పొదుపు చేయాలనే పేరుతో ఉద్యోగుల జీతభత్యాలలో కోత, ఉద్యోగుల సంఖ్యను కుదించడం జరుగుతుంది.

బి.ఎస్.ఎన్.ఎల్ ప్రభుత్వ రంగంలో ఉన్న కారణంగా ప్రభుత్వం నేరుగా ఉద్యోగులను తొలగించలేక వి.ఆర్.ఎస్ ప్రకటించారు. గుడ్డిలో మెల్ల అనుకుంటూ 90 వేల మంది ఉద్యోగులు విఆర్ఎస్ తీసుకున్నారు. ఇంత మంది తీసుకుంటారని ప్రభుత్వం కూడా ఊహించలేదు ప్రభుత్వం మీద నమ్మకం లేకనే బి.ఎస్.ఎన్.ఎల్ ఉద్యోగులు విఆర్ఎస్ తీసుకున్నారు. మొన్నమొన్నటి వరకు లాభాలు రాబట్టిన బిఎస్ఎన్ఎల్‌ను నష్టాల ఊబిలోకి ప్రభుత్వమే నెట్టింది. జియో వంటి ప్రైవేట్ సంస్థలకు 4 జి ఇచ్చిన ప్రభుత్వం, సొంత సంస్థ బిఎస్ఎన్ఎల్‌కి నిన్నటి వరకు 4 జి ఇవ్వని వైనం ఉద్యోగుల మనసులో ఉన్నది. ప్రభుత్వ తీరు మారదని అంచనాతో ఉద్యోగులు స్వచ్ఛంద పదవీ విరమణకు ఎక్కువ మంది మొగ్గుచూపారు.

ఇక ఇండియన్ రైల్వే చూద్దాం. అందులో 13 లక్షల మంది గర్వకారణంగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇండియన్ రైల్వే 2018-19 సంవత్సరములో 6,996.22 కోట్ల రూపాయల లాభాలను ఆర్జించింది. ఎక్కువ లాభాలు వచ్చే సరుకుల రవాణా వ్యవస్థను ముందే ప్రైవేటీకరణ చేశారు. ఇప్పుడు లాభాలు చాలా తక్కువగా వస్తున్నాయని పాసింజర్ రైళ్లను, రైల్వేస్టేషన్‌లను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకున్నారు. ఇందువలన సౌకర్యాలు పెరగడంతోపాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెబుతున్నారు. నిజానికి ఇప్పటికే ఇండియన్ రైల్వే మూడు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయవలసి ఉన్నది. రైల్వే ప్రైవేటీకరణ వలన మూడు లక్షల ఉద్యోగాలు భర్తీ కాకపోగా ఉన్న 13 లక్షల ఉద్యోగాల్లో సగానికి సగం కోతపడే అవకాశం ఉంది. మరో పక్కన ప్రజలకు ఇస్తున్న రాయితీలు రద్దు కాబడతాయి. ఇక ప్రైవేటు రంగంలో రైళ్ల భద్రతా చర్యలు ఆశించడం అవివేకమే అవుతుంది. ప్రజల ప్రాణాలకు ఇది ప్రమాదం.

ఎల్ఐసి విషయం చూస్తే 245 ప్రైవేటు భీమా సంస్థలు, పిఎఫ్ సొసైటీలు దివాలా తీసే స్థితిలో ఉన్న వాటిని విలీనం చేసి 1956 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిని స్థాపించింది. స్థాపించినప్పుడు ప్రభుత్వం అందులో పెట్టిన మూల పెట్టుబడి కేవలం ఐదు కోట్ల రూపాయలు మాత్రమే. నేడు దేశంలో ఇన్సూరెన్స్ రంగంలో 70 శాతం మార్కెట్ వాటాతో ఎల్ఐసి అగ్రగామి సంస్థగా ఉంది. 33 కోట్ల పాలసీదారులతో, 36 లక్షల కోట్ల ఆస్తితో ఎల్ఐసి దేశానికి గర్వకారణంగా ఉంది. 2018-19 సంవత్సరంలో 2,610.74 కోట్ల రూపాయల డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి చెల్లించింది. అంతేకాకుండా నష్టాల్లో, ఇబ్బందుల్లో ఉన్న ఇతర ప్రభుత్వరంగ సంస్థలలో, బ్యాంకులలో ప్రభుత్వ సూచన మేరకు వేల కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టింది. 2018-19 సంవత్సరంలో 53,214.41 కోట్ల రూపాయల లాభాలను సాధించింది. 2018లో మన దేశ భక్త బిజెపి పాలకులు అంతర్జాతీయ వాణిజ్య సంస్థకు ఇచ్చిన హామీ మేరకు ఈ కామధేనువును ప్రైవేటీకరణ కత్తికి బలి ఇవ్వనున్నారు.

ప్రపంచ దేశాలలో భారతదేశానికి సాంకేతిక రంగంలో గొప్ప గుర్తింపును అందించిన సంస్థ ఇస్రో. దేశ రక్షణ రంగంలో కమ్యూనికేషన్ వ్యవస్థలో ఇస్రో కీలక పాత్ర పోషిస్తున్నది. అంతరిక్ష పరిశోధనల కోసం ప్రారంభించబడిన ఈ సంస్థ అనతికాలంలోనే వాణిజ్య కార్యకలాపాలను సాగించే స్థాయికి ఎదిగింది. వాణిజ్య కార్యకలాపాలను నిర్వహణ కోసం బెంగుళూరు కేంద్రంగా ఆంట్రిక్స్ ఎంటర్ప్రైజెస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. దేశ విదేశీ సంస్థలకు తన వాణిజ్య సేవలను అందిస్తూ కోట్ల రూపాయల లాభాలతో ఇస్రో తన పరిశోధనలకు, ప్రయోగాలకు కావలసిన నిధులను సమకూర్చుకునే స్థాయికి చేరింది. మన దేశంలో జియో, సన్ నెట్ వర్క్ వగైరా 84 ప్రధాన ఖాతాదారులకు కమ్యూనికేషన్ సేవలు అందిస్తున్నది. రోదసీ ప్రయోగాలకు, శాటిలైట్స్‌కి సంబంధించి కొన్ని విడి భాగాలను ఉత్పత్తులు చేస్తూ మార్కెటింగ్ చేస్తున్నది. ఎల్ఐసి, రైల్వే వంటి లాభాల సంస్థల సరసన ఇస్రో చేరింది, 2015 నుండి 18 వరకు మూడు సంవత్సరాల కాలంలో ఇస్రో 5,600 కోట్లు లాభాలు సంపాదించింది. ఇందులో ఉపగ్రహ ప్రయోగాల ద్వారా 1,232 కోట్లు సంపాదించగా, మిగిలిన ప్రధాన లాభాలు కమ్యూనికేషన్ సేవల నుండి పొందుతున్నదే. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 91.63 కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఇస్రో సంపాదించింది. ఆర్థికంగా పాడి కుండ లాంటి ఇస్రోను రక్షణ, కమ్యూనికేషన్‌లకు ప్రమాదమని తెలిసి కూడా పాలకులు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించనున్నారు. ప్రైవేటు సంస్థలు ఇస్రో రంగంలోకి రావడం ప్రజలకు ప్రమాదం. స్కైలాబ్ ఘటన సందర్భంగా ప్రజలంతా ఎంతగా భయపడ్డారో చూశాం. 2006లో జిఎస్ఎల్వి ప్రయోగం విఫలమైన సందర్భంగా అదే పరిస్థితి. తృటిలో ప్రమాదాలు తప్పాయి. భవిష్యత్తులో అలాంటి ప్రమాదాలు ముందుకు రావని అనుకోనక్కర్లేదు. అలాంటి సమయాల్లో లాభాపేక్ష కలిగిన ప్రైవేట్ సంస్థలు ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వవు. ఇస్రో ప్రైవేటీకరణలో మరో పెద్ద కుట్ర దాగి ఉంది. అంతరిక్షంలో నూతన గ్రహాల పరిశోధనకు కూడా ప్రైవేటు సంస్థలకు అవకాశం ఇస్తున్నారు. అంటే ఆ విధంగా చంద్రుని వంటి ఇతర గ్రహాలలో కనుగొనబోవు ఖనిజాలు, వనరులపై వారికి హక్కులు కల్పిస్తున్నారు. ఈ భూమిపైనా, ఆకాశంలో కూడా కార్పొరేట్లకే హక్కులు అంటున్నారు.

కోల్ ఇండియా, ఆయిల్ కార్పొరేషన్ వగైరా పి.ఎస్.యూలు లాభాల బాటలోనే ఉన్నాయి. ఎయిర్ ఇండియా, బి.ఎస్.ఎన్.ఎల్ లాంటి కొన్ని సంస్థలు నష్టాల ఊబిలోకి పోవడానికి ప్రభుత్వ విధానాలే కారణం. 2010 వరకు అవి లాభాలను పొందుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ఒక పథకం ప్రకారం ప్రైవేటు సంస్థల లాభాల కోసం వీటిని దివాళా దిశగా నడిపించింది. ప్రభుత్వ రంగ సంస్థలుగా ప్రస్తుతం 300 వరకు ఉన్న పబ్లిక్ సెక్టార్ సంస్థల మూలధనం 2 లక్షల 75 వేల 697 కోట్ల రూపాయలు కాగా, వాటి పెట్టుబడుల విలువ 16లక్షల 40వేల 628 కోట్లుగా వున్నది. సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ CPSU సంస్థలు 2018-19 సంవత్సరంలో 25 లక్షల 53 వేల 370 కోట్లు ఆదాయం గడించాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లోని కొన్ని పి.ఎస్.యూలు ఈ క్రింది విధంగా 2018 -19 సంవత్సరంలో లాభాలు గడించాయి.

ఓ.ఎన్.జి.సి 26,716 కోట్లు, కోల్ ఇండియా 10,470 కోట్లు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ 9,939 కోట్లు, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ 7,132 కోట్లు, గెయిల్ 6,029 కోట్లు లాభాలు పొంది ఉన్నాయి. ఇలా లాభాలు కలిగి ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి నిధులు సమకూర్చుకోవాలని మోడీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసుకున్నది. వడివడిగా అడుగులు వేస్తున్నది. ఈ ప్రైవేటీకరణలో దేశ ప్రయోజనాలుగాని, ప్రజల ప్రయోజనాలుగాని లేవు. కేవలం స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలే ఉన్నాయి. ఇప్పటికే వారికి 10 లక్షల కోట్ల రూపాయల రుణ మాఫీ చేశారు. వారి కోసమే నష్టాలలో ఉన్న బ్యాంకులను లాభాలు ఉన్న బ్యాంకులలో విలీనం చేస్తున్నారు. కార్పొరేట్ పన్ను తగ్గిస్తూ వారికే వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్నారు. అయినా బకాసుర కార్పొరేట్ల ఆకలి తీరేది కాదు. ఒకప్పుడు నష్టాల్లో ఉన్న పరిశ్రమలను జాతీయం చేసినప్పుడు లేదా వాటిల్లో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టినప్పుడు వారే లాభం పొందారు. ఇప్పుడు ప్రజల పన్నులతో ఎంతో అభివృద్ధి చెందిన ప్రభుత్వ రంగాన్ని తిరిగి వాళ్ళకే అప్పగిస్తూ లాభాలు కల్పిస్తున్నారు. ప్రజల ఆస్తులకు ట్రస్టీగా ఉండవలసిన ప్రభుత్వం నేడు ప్రజల ఆస్తులు అమ్మే దళారునిగా మారింది. పైగా దేశ భద్రతను కూడా వదిలేసి కీలక రంగాలను కూడా ప్రైవేటీకరణ చేస్తున్నది. కావున ఈ ప్రైవేటీకరణలను నిలువరించడానికి కార్మిక వర్గంతో పాటు దేశభక్తియుత ప్రజలందరూ ముందుకు రావాలి లేనిచో దేశం మరింత తిరోగమన దిశలోకి పోవడం ఖాయం. కనుక అన్ని శక్తులను ఐక్యం చేసి ఉద్యమిద్దాం!

# క్విట్ ఇండియా రోజు ఆగస్టు 9న సేవ్ ఇండియాగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపును ఆగస్టు 7,8 తేదీలలో స్కీమ్ వర్కర్ల ఆందోళనలను, ఆగస్టు 11,18 తేదీలలో జె.ఎ.సి కార్మిక ఉద్యమాన్ని, ఆటో మోటారు కార్మికుల ఫైనాన్స్ వాయిదాలు, వడ్డీ రద్దు డిమాండ్‌లను బలపర్చండి! క్రియాశీలకంగా పాల్గొనండి!

కరోనా వైరసతో దేశమంతా కల్లోలమయంగా తయారయ్యింది. సాధారణ, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి అకస్మాత్తుగా తలక్రిందులుగా మారింది. 50 కోట్ల మంది ప్రజలు అత్యంత పేదరికంలోకి నెట్టబడ్డారు. లాక్‌డౌన్ కాలంలో మూసివేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలలో 35 శాతం వరకు ఇప్పటికి మొదలు కాలేదు. కొత్తగా 25 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగ వర్గాలు నిరుద్యోగులుగా మారారు. స్వయం ఉపాధి పొందే ఆటో, మోటారు, హమాలీ, బి.వో.సి తదితర కార్మికుల పరిస్థితి అత్యంత దయానీయంగా తయారైంది. లాక్‌డౌన్ కాలానికి యాజమాన్యాలు జీతాలు చెల్లించపోయినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వ్యవసాయ కార్మికులకు, ఉపాధి హామీ పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

ఐదు నెలల లాక్‌డౌన్, అన్‌లాక్‌డౌన్ కాలంలో కరోనా నివారణకు కేంద్ర పభుత్వం మాటలు తప్ప ఎలాంటి చర్యలు చేపట్టని కారణంగా దగ్గర దగ్గర రెండు మిలియన్ల మందికి కరోనా వ్యాపించింది. ప్రతి రోజు 50 వేలకు పైగా కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. దేశంలో 90 శాతానికి పైగా ప్రజలు కష్టాల పాలౌతున్నారు. చిన్న, చితకా పరిశ్రమలు నష్టాల ఊబిలో కూరుకొనిపోతున్నాయి. ఇలాంటి సంక్షోభ పరిస్థితితుల్లో కూడా రెండు శక్తులు బాగా లాభపడుతున్నారు. కరోనా కాలాన్ని వారు కలిసివచ్చిన కాలంగా మార్చుకున్నారు. కష్టాలు, బాధలు ప్రజలకు నెట్టేసి వేల, లక్షల కోట్ల లాభాలను ఆ శక్తులు సొంతం చేసుకుంటున్నాయి. ఆ శక్తులలో ఒకటి దేశ, విదేశీ కార్పొరేట్ వర్గాలు కాగా, రెండవది మోదీ ప్రభుత్వం. కరోనా విషయంలో ప్రజలను వాళ్ళ కర్మకు వదిలేసిన మోదీ, తాను మాత్రం తన ప్రియమైన విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు కోట్ల రూపాయలు దోచిపెట్టే చర్యలు అపలేదు. ప్రజల ఆస్తులై ప్రభుత్వ రంగ సంస్థలు అయిన పి.ఎస్.యు లను కార్పొ ప్రైవేటు శక్తులకు అప్పనంగా అప్పగించడానికి పూనుకున్నారు. ఎలాంటి జవాబుదారితనం, పారదర్శకత లేని పి.యం కేర్‌కు వచ్చిన వేలకోట్లు మోడీ & కో రహస్యంగా ఉంచుతున్నది.

లాక్‌డౌన్ అనంతరం పారిశ్రామిక ప్రమాదాలు మరింత ఎక్కువగా జరుగుతున్నాయి. మన రాష్ట్రంలో ఎల్.జి. పాలీమర్స్ నుండి నిన్నటి షిప్‌యార్డు క్రేన్ వరుస ప్రమాదాలలో పదుల మంది చనిపోతున్నారు. చనిపోయిన తరువాత పరిహారాలు ప్రకటించడం, ప్రమాదాలకు గల కారణాలను శోధిస్తున్నట్లు ప్రహసనం చేయడం అలవాటుగా మారింది. నిజానికి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలే కాకుండా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. లక్షల పరిహారంతో ప్రాణాలకు విలువ కట్టే కన్న ప్రాణాలను కాపాడటమే మిన్న. కావున ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించాలని ప్రారిశామిక ప్రమాదాలు జరగకుండా చూసే యాంత్రాంగాన్ని, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను పటిష్టపరచాలి. ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాలకు హత్యానేరంతో సమానమైన శిక్షలు పడే విధంగా చట్టాలు సవరించాలి.

గతంలో నష్టాల పేరుతో చాపక్రింద నీరులా ప్రైవేటీకరణ చర్యలను కేంద్రం చేసేది. కార్పొరేట్ల సేవ కారణంగా దేశ ఆర్థిక పరిస్థితి దిగజారింది. దీనిని చక్కదిద్దే పేరుతో, నిధుల సమీకరణ కోసమంటూ బాహటంగానే లాభాలు వస్తున్న పి.ఎస్.యూ లను అదే కార్పొరేట్లకు కారుచౌకగా అమ్మేస్తూ ప్రైవేటీకరణ చేస్తున్నది. కార్పొరేట్లకు నిధులు మళ్ళించే లక్ష్యంతో పెట్రో, డీజిల్‌ల రేట్లను ప్రభుత్వ పన్నులతో వాస్తవ ధర కంటే రెట్టింపు చేసింది. రోజురోజుకు ధరలు పెంచుతూపోతున్నది.

కరోనా సాకుతో ప్రజలను లాక్‌డౌన్ బందీలుగా చేశారు. ప్రశ్నించే వారిని, అన్యాయాన్ని ఎత్తి చూపే వారిపై కుట్ర కేసులు బనాయించి ఉపా క్రింది అరెస్టులు చేశారు. రోడ్లపై కనీస నిరసనలకు అవకాశం లేకుండా చేశారు. మరో ప్రక్క ఈ కాలంలోనే రైల్వే, బొగ్గు, ఆయిల్, గ్యాస్, ఇన్స్యూరెన్స్, ఎయిర్ ఇండియా, ఆటమిక్ ఎనర్జీ, రక్షణ రంగ పరిశ్రమలు చివరకు రోదసి (ఇస్రో) వంటి మినీరత్న, నవరత్న, మహారత్నాలుగా పేరు గాంచి లాభాలను ఆర్జిస్తున్న పి.యస్.యు లను ప్రైవేటీకరణతో ప్రైవేటు శక్తులకు ధారపోస్తున్నారు. 70 సంవత్సరాలుగా ప్రజా ధనంతో అభివృద్ధి కాబడి లక్షల కోట్ల రాబడి పొందుతూ 30 మిలియన్లకు పైగా ఉద్యోగులకు ఉపాధినిస్తున్న ఈ ప్రభుత్వ రంగ సంస్థలను ఈనకాసి నక్కల పాలు చేసిన చందంగా తిరిగి ప్రైవేటు పెట్టుబడుదారుల పాలు చేస్తున్నారు. ఇదే ఆత్మ నిర్భర్ అంటూ మన నిరంకుశ బిజెపి పాలకులు శెలవిస్తున్నారు.

మోదీ ప్రభుత్వ ఈ నిరంకుశ, ప్రజావ్యతిరేక విధానాలను నిలుపుదల చేయాలని కోరుతూ మొన్న జూన్ 3న కార్మికవర్గం దేశవ్యాపిత ఆందోళనలు చేశారు. బొగ్గుగని కార్మికులు తమ గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జూన్ 2,3,4 తేదీలలో దేశవ్యాపితంగా సమ్మె చేశారు. తిరిగి ఆగస్టు 18న సమ్మె చేయనున్నారు. రక్షణ రంగ పరిశ్రమల ఉద్యోగ సంఘాలు సమ్మెయోచనలో వున్నాయి. అయినా మోదీ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడడం లేదు. అందుకే కేంద్ర కార్మిక సంఘాలు క్విట్ ఇండియా రోజైన ఆగస్టు 9న సేవ్ ఇండియా, సేవ్ పీపుల్స్ ప్రాపర్టీ, సేవ్ వర్కింగ్‌క్లాస్ అంటూ దేశవ్యాపిత ఆందోళనలకు పిలుపునిచ్చాయి. మరో ప్రక్క దేశంలో 200కు పైగా రైతు సంఘాలు వ్యవసాయ రంగంను కార్పొరేట్ కబంధహస్తాల్లో యిరికించడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్, సేవ్ పీపుల్ ఉద్యమానికి సిద్ధమౌతున్నారు.

ప్రభుత్వంలో భాగమే అయినా వారు ప్రభుత్వ ఉద్యోగులు కారు. కనీసం ప్రైవేటు కార్మికులకు ఇచ్చే కనీస వేతనాలు కూడా లేకుండా వెట్టి చాకిరికి ప్రతిరూపాలుగా స్కీం వర్కర్లు పనిచేస్తున్నారు. అలాంటి అంగన్‌వాడీ, ఆశా, మిడ్డే మీల్స్ వంటి స్కీం కార్మికులు కూడా తమ సమస్యలపై ఆగస్టు 7,8 తేదీలలో దేశ వ్యాపిత ఆందోళనలు చేయబోతున్నారు.

ముందు ఇసుక పాలసీ వలన అటు తర్వాత కరోనా కారణంగా 18 నెలలుగా ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలని మన రాష్ట్రంలో బి.వో.సి సంఘాలు జె.ఎ.సి గా ఏర్పడి ఆగస్టు 11,18 తేదీలలో ఉద్యమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దేశంలో ప్రధాన రంగమైన ఆటో, మోటారు కార్మికులకు కరోనా కారణంగా ఎలాంటి ఆదాయంలేదు. కాని వాహనాల లోన్ల వాయిదాల చెల్లింపులు, వడ్డీలు, ఇన్సూరెన్స్, ఇతర టాక్స్‌లు ఏవి ఆగే పరిస్థితి లేదు. కావున మరో ఆరు నెలలు ఋణ చెల్లింపులకు మారిటోరియం ప్రకటించాలనీ, వడ్డీలు మాఫీ చేయాలని, ప్రభుత్వ టాక్స్‌లు ఈ ఏడాది పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఉద్యమ ఐక్య కార్యచరణకు రాష్ట్రంలో సిద్ధమౌతున్నారు. కావున పై దేశవ్యాపిత, రాష్ట్ర వ్యాపిత ఆందోళనలలో కార్మిక వర్గం చురుగ్గా పాల్గొనాలని ఇఫ్టూ రాష్ట్ర కమిటీ కోరుచున్నది.

**ప్రధాన డిమాండ్లు :**

**1) ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి.**

**2) కరోనా నివారణ చర్యలతో పాటు ఆటో, మోటారు, హమాలీ, షాపు వర్కర్స్, క్వారీ & క్రషర్స్ తదితర అసంఘటిత రంగ పేద కార్మిక కుటుంబానికి రూ.10/-వేల చొప్పున 6 నెలలు అందించాలి.**

**3) 8 గంటల పనిని 12 గంటలుగా మార్పులు, తదితర కార్మిక చట్టాల సవరణలను రద్దు చేయాలి.**

**4) స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి 4వ తరగతి జీతభత్యాలు అందించాలి.**

**5) పారిశ్రామిక ప్రమాదాలను జరగకుండా ప్రభుత్వం ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను పటిష్టపరచాలి. ప్రమాదాలను హత్యా నేరాలుగా గుర్తించి నేరస్థ యాజమాన్యాలకు కఠిన శిక్షలు విధించాలి.**

**6) వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే మూడు బిల్లులను ఉపసంహరించాలి.**

**7) ఆటో,మోటారు లారీ రంగాల కార్మికుల ఋణ వాయిదాల చెల్లింపులకు మరో 6 నెలలు మారిటోరియం ఇచ్చి, వడ్డీలను పూర్తిగా మాఫీ చేయాలి. ప్రభుత్వ టాక్స్‌లు ఈ ఏడాది రద్దు చేయాలి.**

**8) ఇసుక పాలసీ, కరోనా కారణంగా ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలి.**

( మిగతాది 11వ పేజీలో )

# సమకూరని ఆదాయం - ఖర్చు చెయ్యని కేటాయింపులు
# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2020-21

- దివాకర్

రాష్ట్ర వార్షిక బడ్జెట్ కోసం అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తారు. పన్నుల రాయితీల కోసం కొందరు, ఆర్థిక సహకారం కోసం కొందరు, ఉద్యోగులు, శ్రామికులు తమకు ఏమి ఇస్తారు అని ఆశగా బడ్జెట్ ఫలితాలకు ఎదురు చూస్తారు. ముఖ్యంగా బడా బాబులు, కార్పొరేట్ శక్తులు మరింత ఆశగా చూస్తారు. ఖర్చులేని విధాన నిర్ణయాలు ప్రజా జీవితాలపై ప్రభావం పడే అంశాలు ఉంటాయి. అధికారానికి వచ్చిన రాజకీయ పార్టీ ఎన్నికలలో చేసిన వాగ్దానాలను వార్షిక బడ్జెట్‌లో ప్రతిభించాల్సి వుంటుంది. కాని అలా ఏ పాలక పార్టీ అధికారానికి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు పరిమితమయ్యి బడ్జెట్ రూపకల్పన చెయ్యరు. అది వారి నైజం. గెలవడానికి ప్రజల నుండి ఓట్లు కావాలి. ఓట్ల సందర్భంలో ప్రజలతో చాలా సౌమ్యంగానే ఉంటారు. మొత్తం ఎజెండాను బయటపెట్టరు. అధికారానికి వచ్చిన తరువాత వారి నైజం ప్రజలు గమనించగలరు. నేడూ అదే పరిస్థితి వుంటుంది.

2020-21 వార్షిక బడ్జెట్ ఒక ప్రహసనం. జనరల్ వార్షిక బడ్జెట్ ఆమోదం కోసం ప్రతీ సంవత్సరం రాష్ట్ర అసెంబ్లీని 45 రోజులలో 35 పనిదినాలు నిర్వహించి మార్చి 31కి ద్రవ్య వినియోగ బిల్లు ఆమోదిస్తారు. ఉభయ సభలలో విస్తృత చర్చలు నిర్వహిస్తారు. అధికార పక్షం బడ్జెట్ ప్రవేశపెడితే ప్రతిపక్షం చర్చను ప్రారంభిస్తారు. వార్షిక సభలకు ముందు రాష్ట్ర గవర్నర్‌చే ప్రారంభ ఉపన్యాసం ఇప్పిస్తారు. ఈ సందర్భంగా గత సంవత్సరానికి సంబంధించిన సాంఘిక, ఆర్థిక సర్వే నివేదిక సభకు అందిస్తారు. సభ చివరలో గత సం॥ ఖర్చులు, ఆడిట్ నివేదికలు, ప్రభుత్వరంగ కార్పోరేటు సంస్థల వార్షిక నివేదికలు సభకు అందిస్తారు. గవర్నర్ ఉపన్యాసం అనంతరం రాష్ట్ర ఆర్థిక మంత్రి తన వార్షిక బడ్జెట్ ప్రసంగంతో పాటు, సెక్రటేరియట్ పరిధిలో 33 శాఖలకు చేసిన కేటాయింపు, ఆదాయ వనరుల వివరణలతో కూడిన సమగ్రమైన పత్రాలను 500-600 పేజీలలో డిమాండ్స్ వారీగా సభకు అందిస్తారు. వార్షిక బడ్జెట్ ఆమోదం సుదీర్ఘ శాసన ప్రక్రియ. చూడటానికి చాలా హట్టహాసంగా వుంటుంది. అధికారంలో ఉన్నవారికి కలిసి రాకపోతే అంతా ప్రహసనమై పోతుంది. నేడు అదే జరిగింది.

2020-21 వార్షిక బడ్జెట్ ఆమోదం మార్చి 31కి జరగాలి. కానీ పంచాయితీ ఎన్నికలు ముందుకు తెచ్చి పూర్తిస్థాయిలో సభలు జరిపే పరిస్థితి లేకుండా చేసారు. ఈ లోపు కోవిడ్-19 సమస్య ముందుకు వచ్చి మార్చి 22 నుండి కేంద్రం లాక్ డౌన్ ప్రకటించింది. దీనితో ఓట్ ఆన్ ఎకౌంట్ పేరిట 90 రోజులకు రూ॥ 70,995 కోట్ల ద్రవ్యం వినియోగించు కోవటానికి అనుమతి పొందారు. ప్రత్యేక ఆర్డినెన్సు ద్వారా మార్చిలో జీ.ఓ.ఎం.ఎస్ నెం. 873 ద్వారా వార్షిక బడ్జెట్ రూ॥ 2.82 లక్షల కోట్లుగా చూపి మూడు నెలలకు రూ॥ 70,995 కోట్లు వినియోగించుకోవటానికి ప్రభుత్వం అనుమతి పొందింది. కానీ ఈ కాలంలో రూ॥ 24 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయింది. కేంద్రం లాక్ డౌన్ ఎత్తివేసిన తరువాత జూన్ 16, 17 తేదీలలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి కొన్ని గంటలలోనే ఆమోద ప్రక్రియను ముగించారు. కరోనాను కంట్రోల్ చేయ్యడంలో కేంద్రం, రాష్ట్రం విఫలమయ్యాయి. ఎపిడమిక్ చట్టం అమలులో వుంచుతూ ఆరోగ్య జాగ్రత్తల పేరిట అనేక షరతులతో సడలింపులు ఇచ్చారు. ఈ కాలంలో సభలు జరపలేని పరిస్థితి చూపి ఉభయ సభలను వార్షిక బడ్జెట్, ఇతర బిల్లుల ఆమోదానికి కేవలం రెండు రోజులు కేటాయించారు. దీనిలోనే ఆన్లైన్లో ఉభయ సభల నుద్దేశించి రాష్ట్ర ప్రభుత్వాన్ని పొగుడుతూ గవర్నర్ 23 పేజీల ఇంగ్లీషు ప్రతిని తన నివాసం నుండి వినిపించారు. 2019-20 ఆర్థిక సర్వే 344పేజీల, 33 శాఖల ఆర్థిక పత్రాలు (600 పేజీలు) సభ ముందు పెట్టారు. ఆర్థిక మంత్రి తన ప్రసంగం పత్రం 43 పేజీలు వినసొంపుగా చదివారు. అందులో మాటల మూటలే అధికం. 10 మంది నాయకుల, మేధావుల రచనల నుండి 21కి పైగా కొటేషన్లతో ప్రసంగం సాగించారు. అందులో రాలేని ఆదాయాలతో ఖర్చు చెయ్యలేని కేటాయింపులు చేసి భవిష్యత్‌లో రాష్ట్రం అప్పుల కుప్ప కాక తప్పదని చెప్పుతూ కేటాయింపులు అన్నీ ఖర్చు చెయ్యలేమని చంద్రబాబు లాగానే బడ్జెట్ ద్రవ్య నియంత్రణ నియమాలు (ఎఫ్ఆర్‌బీఎం) సడలించాలని కేంద్రాన్ని కోరారు. అప్పటికే కరోనా దృష్ట్యా కేంద్రం విధించిన షరతులకు ఆమోదిస్తే జిఎస్‌డిపిలో వార్షికంగా మరో 2% అప్పు చేసుకొమ్మని చెప్పింది. జిఎడిపిలో గతం కంటే 30 నుంచి 35% అప్పుల స్తతికి అవకాశం ఇచ్చింది.

గవర్నర్ ప్రసంగంపై విమర్శలు చేసి ధన్యవాదాలు తెలిపే విధానం కొనసాగుతుంది. ఉభయ పక్షాలు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సాంప్రదాయం తామంతా ఒకటే అని చాటుకోవడమే. రాజ్యాంగ పరిధిలో దోపిడీ వర్గాలు ప్రజలను దోచుకొనే దగ్గర ఒకటౌతారు. పంచుకొనే దగ్గర ఎంత తీవ్రమైన విరోధానికైనా వెళతారు. అదే నేటి శాసన సభల వేదికలపై జరుగుతోంది. ఉభయ సభల ఆమోదంతో రాష్ట్ర వార్షిక బడ్జెట్ కానీ, ఇతర బిల్లులు కానీ అమలులోకి రావాలి అంటే ఉభయ సభల ఆమోదం జరగాలి. దోపిడీ పాలకవర్గాలు ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నికైన అసెంబ్లీకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి, కౌన్సిల్‌ని కేవలం పెద్ద మనుషుల సభగా గుర్తింస్తున్నారు. దీనితో కౌన్సిల్ ఆరోవేలుగా వుండిపోయింది. చర్చలు నడిస్తే అనేక లోపాలు బహిరంగ మవుతాయి. కానీ నేటి వార్షిక బడ్జెట్ సభలు కేవలం రెండు రోజుల్లో కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఏకపక్షంగా రూ॥ 2,24,789.18 కోట్లు వార్షిక బడ్జెట్ ఆమోదం అయింది. బయట, లోపల ఈ అంకెలపై స్పందించడానికి, ప్రజలకు, ప్రజాస్వామ్య శక్తులకు, విశ్లేషకులకు అవకాశం లేకుండా పోయింది. అంతేకాదు, అత్యంత విషాదభరితమైన " పౌర గణన " రాష్ట్రంలో అమలుకు ఆమోదించడం. చర్చలు లేకుండానే అధికార వికేంద్రీకరణ బిల్లు ఆమోదం అయింది. అధికార పార్టీ ప్రవేశపెట్టిన విధాన పత్రాలతో కూడిన బిల్లులు ప్రజాస్వామ్యయుతంగా ఆమోదం జరగని స్థితి. అసెంబ్లీలో బ్రూట్ మెజారిటీ ఉండి కూడా చర్చకు అవకాశం ఇవ్వకపోవడం అధికార పార్టీ బలహీనత లేదా రాజకీయ కుతంత్రంతో కూడింది. పాలకవర్గాలు చెప్పుకొనే పారదర్శకత ఒక బూటకం అని మరోసారి రుజువైంది. ఈసారి కేంద్ర ప్రభుత్వం కూడా కోవిడ్-19 కారణం చూపి పూర్తిస్థాయి చర్చలు లేకుండానే అర్థాంతరంగా కేంద్ర బడ్జెట్‌ని ఆమోదింప చేసుకొని సభలు వాయిదా వేసుకున్నాయి.

### రాష్ట్ర సాంఘిక, ఆర్థిక పరిస్థితి :

ప్రభుత్వం, ప్రైవేటు వర్గాలు చేస్తున్న ఖర్చులు, సహజ వనరులు, మానవ వనరుల వినియోగంలో వచ్చే ఆర్థిక ఫలితాలు ప్రతి శ్రమజీవి ఉత్పత్తి విలువ జిఎస్డీపీలో అంటే రాష్ట్ర స్థూల ఆదాయంలో భాగంగా అవుతోంది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగాల నుండి లెక్క వేస్తున్నారు. ఈ ప్రకారం నీటి వినియోగం, సహజ వనరుల వినియోగం, భూమి వినియోగం, ప్రభుత్వ విధానాలు, ప్రకృతి, పర్యావరణ అంశాలు పరిగణనలోకి తీసుకొంటే నేటికి మన రాష్ట్రంలో వున్న మానవ వనరులు వినియోగించుకోలేక పోతున్నాం. రిజిస్టరు అయిన నిరోద్యోగులే 10 లక్షలకూ పైగా వున్నారు. గ్రామీణ ప్రాంతంలో నీటికొరత, నీటి వినియోగం, సాగుయోగ్యమైన భూమి, పరిశ్రమలు, కారిడార్స్, ఎస్ఇజెడ్‌ల పేరిట లక్షల ఎకరాలు పంటలు పండే భూములనే పడావు పెట్టారు. వ్యవసాయరంగంలో ఆధునిక యంత్రాల రాకతో శ్రామికులకు ఒక ఎకరాలో గతంలో 70 రోజులు పనిదినాలు లభించగా నేడు 20 రోజులకు మించి లభించని స్థితి. దీనికితోడు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెరగకపోవుట అనేక పరిశ్రమలు ఆధునికీకరణ పేర మూతపడటంతో ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలు, సర్వీసు రంగాలలో శ్రామికుల శాతం తగ్గింది. తాత్కాలిక, చాలీచాలని వేతనాలపై ఆధారపడే స్థితి పెరిగింది. వార్షిక, నెలల, రోజులవారీ నిరుద్యోగ స్థితి పెరుగుతుందే తప్పా తగ్గటం లేదు. అయినా రాష్ట్ర స్థూల ఆదాయం పెరుగుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. ఆర్థిక సర్వే ప్రకారం నేటికి ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ తలసరి ఆదాయంలో 65% జీవనాధారంగా వ్యవసాయరంగం ఉండటమేకాక రాష్ట్ర స్థూల ఆదాయంలో వ్యవసాయ అనుబంధ రంగాల నుండే చేరుతున్నట్లు లెక్కలు తెలుపుతున్నాయి ఈ రంగం నుంచే నేడు వార్షిక ఆదాయం పెరుగుతున్నది. అలాగే పరిశ్రమల రంగంలో భారీ పరిశ్రమల కంటే మధ్యతరహా, చిన్న పరిశ్రమల ద్వారానే అత్యధిక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అయినా చిన్న, మధ్యతరహా, వ్యవసాయ అనుబంధ, వనరుల ఆదాయంగా స్థానికంగా పరిశ్రమలను ప్రోత్సహించే విధానాల బదులు స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ పరిశ్రమలకు అవసరాలకు

( మిగతాది 10వ పేజీలో )

(9వ పేజీ తరువాయి)

మించిన వనరులు ప్రతి పాలకులు వారికి సమకూర్చారు. అయినా పాలకులు ఆశించిన పరిశ్రమలు, పెట్టుబడి రావడం లేదు. చివరికి కార్మిక హక్కులను కూడా బలిస్తున్నా ముందుకు రాని పెట్టబడి. దీనిపై ఆర్థిక సర్వేలో స్పష్టమైన వివరణ లేదు. మరిన్ని రాయితీలు ఇవ్వడానికే పథకాలు ఇస్తున్నారు. మూడవది సర్వీస్ రంగంలో అధిక ఆదాయాలతో తక్కువ మందికి ఉపాధి ఇస్తూ రాష్ట్ర స్థూల ఆదాయానికి వ్యవసాయరంగం కంటే కొంత ఎక్కువ సమకూర్చుతున్నట్లు లెక్కలు చూపుతున్నాయి. సర్వీస్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎంత పెరుగుతాయో అంతకంటే ఎక్కువగా తగ్గే పరిస్థితి వున్నది. కంప్యూటరీకరణ నియంత్రణ లేకపోతే కంప్యూటర్ల తయారు చేసేవారికి ఉపాధి లేకుండా చేస్తుంది. కావున మనిషిలేని అభివృద్ధి మానవ సమాజానికి తీవ్రంగా నష్టం చేస్తుంది. అంతర్జాతీయ బూర్జువా మేధావుల సలహాతో మానవ ముఖం కనబడాలనే దానికి పాలవ వర్గాలు పరిపాలనా వ్యవహారాలు నడుపుతున్నారు. అభివృద్ధిలో మానవ వినియోగంతో పాటు తిరిగి అభివృద్ధి ఫలాలు మనిషి అందుకొనే ఆర్థిక, రాజకీయ విధానాలు రాకుండా అంతరాలు తగ్గవు. అంతరాలు తగ్గని అభివృద్ధి సామాజిక వైరుధ్యాల పెరుగుదలకు దారి తీయక తప్పదు.

**స్థూల ఆదాయం - తలసరి పంపిణీ - లెక్కల ఆంతర్యం :**

2018-19లో స్థూల ఆదాయం 2011-12 స్థిర ధరల ప్రకారం 6,21,301 కోట్లు కాగా, 2019-20లో 2011-12 స్థిర ధరల ప్రకారం రూ॥ 6,72,018 కోట్లు. 8.16% ఎక్కువ. దీనిని ప్రస్తుత ధరలకు సవరించి చూపారు. ఆ ప్రకారం 2018-19లో రూ॥ 62,957 కోట్లు కాగా 2019-20కి 9,72, 782 కోట్లు పెరిగింది. 12.73% పెరిగినట్లు అయింది. తలసరికి వచ్చేసరికి 2018-19లో 1,15,173 రూ.లు కాగా 2019-20కి 1,69,519 రూ.లుగా అంటే 12.14% పెరిగినట్లు చూపారు. ఇదే కాలంలో జిల్లాల, మండలాల, గ్రామాల కుటుంబాల వారీగా ప్రతీ స్థాయిలో తలసరి లెక్కవేస్తే తీవ్ర వ్యత్యాసాలు కనబడతాయి. ఒక వార్డు లేదా గ్రామ స్థాయిలో లెక్కవేస్తే ఆదాయ వ్యత్యాసాలు స్పష్టంగా కనబడతాయి. ఒక భూస్వామికీ, పారిశ్రామికవేత్తకీ, పర్మినెంట్ ఉద్యోగులకి, రోజువారీకూలీకి వచ్చే ఆదాయాలు అన్నీ కలిపి తలసరి ఆదాయంగా వివిధ స్థాయిల్లో తెలుపుతున్నారు. 660 మండలాల స్థాయిలో లెక్కవేస్తే రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల పరిధి మండలాలలోతలసరి వార్షిక ఆదాయం రూ60, 70 వేలకు మించి లేదు. ఈ లెక్కలు ఎలా ఉంటాయి అనేది ఒక పాత సామెత ఉన్నది. భూస్వామితో కలిపి " మావి 100 అరకలు అంటూ అందులో నాది ఒక అరక (జత ఎడ్లుతో కూడిన నాగలి) " అన్నట్లు ఈ తలసరి లెక్కలుంటాయి.

**ఇరిగేషన్ :** రాష్ట్ర వ్యాపితంగా 105.66 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం ఉండగా, ఉత్తరాంధ్ర 3 జిల్లాల్లో 16.53 ల.ఎ.లు, రాయలసీమ 4 జిల్లాల్లో 21.67 ల.ఎ.లు, తూర్పు, పశ్చిమ, కృష్ణ, గుంటూరు జిల్లాలకి 48.84 ల.ఎ.లకి సాగునీరు అందుతోంది. భౌగోళిక స్థితి కారణంగా కొన్ని ప్రాంతాలకి తక్కువ ఖర్చుతో ఎక్కువ నీరు అందుతుంది. అదే రాయలసీమకు నీరు అందటానికి నికర జలాలు ఇవ్వాలి. ఎక్కువ నిధులు ఇవ్వాలి. అలాగే ఉత్తరాంధ్రలో వర్షపాతం వున్నా తగిన కాల్వల వ్యవస్థ, నీటి సప్లయి విధానం లేక పాలకుల అశ్రద్ధలచే వలసలు నిత్యకృత్యం అయినవి. వెనుకబడిన ప్రాంతాలకు సానుభూతి ఎక్కువ-సహకారం తక్కువ అనే ధోరణి కొనసాగుతోంది.

సర్వేలో అన్ని రంగాలలో గత 12 నెలల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితాలపై రివ్యూ చేసినా లోపాల, వ్యత్యాసాల సవరణకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఉండాలి. కానీ ఎవరికో సమాధానం చెప్పినట్లు కొన్ని వ్యాఖ్యానాలున్నాయి. ప్రపంచ బ్యాంకు సలహా ప్రకారం సంక్షేమానికి ఖర్చు తగ్గించాలి. ప్రతీ ప్రభుత్వ సర్వీస్, అగ్నిమాపక సర్వీస్, పోలీస్ సర్వీస్ కి యూజర్ ఛార్జీలు వసూలు చెయ్యాలి. పాలకులు ఎన్నికల ప్రయోజనాల దృష్ట్యా ప్రపంచ బ్యాంకు సలహాలు అన్ని చోట్ల అమలు చెయ్యక సంజాయిషీ ఇచ్చుకున్నట్లు కొన్ని వ్యాఖ్యానాలున్నాయి. దాదాపు ఆర్థిక సర్వేలో 344 పేజీలలో గణాంకాలు ఇచ్చినా, గత ప్రభుత్వం కంటే తామే బడాబాబులకు సేవలు చేసే విధానం చేస్తాం అన్నట్లు తమ యజమానులకు సిగ్నల్స్ పంపుతూ మానవముఖంతో తమ ఆర్థిక విదానాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళుతున్న తీరు కనపడింది.

**రాష్ట్ర వార్షిక బడ్జెట్ - 2020-21 లెక్కల గారడి :**

రాష్ట్ర ఆర్థిక మంత్రి 20-21కి ప్రవేశపెట్టిన బడ్జెట్ పత్రాల నుండి ఒక అంచనాకు రావడానికి అవకాశం ఉన్నది. తన ప్రసంగం అంతా నవరత్నాలు, అదనపు సంక్షేమ పథకాలు, వివిధ రంగాలకు కేటాయింపులు తెలుపుతూ గతం కంటే 1.4% మాత్రమే తక్కువ ప్రతిపాదించినట్లు చెప్పాడు. ఇది వాస్తవమా. 2003లో ద్రవ్యనియంత్రణా బడ్జెట్ నిర్వహణా యాక్టు 2003కి భిన్నంగా రాష్ట్ర బడ్జెట్లు కొనసాగతున్నాయి. ఎఫ్ఆర్‌బిఎం నియమాల ప్రకారం ద్రవ్య లోటు, రెవెన్యూ లోటు, అప్పుల స్థితి, జిఎడిపిలో ప్రతీ సం॥ శాతాలు తగ్గాలి. 3% వుంటే 2%కి తగ్గాలి. దానికి భిన్నంగా రెవెన్యూ లోటు, ఆర్థిక లోటు, అప్పుల శాతం పెరుగుతున్నాయి. ఆదాయం-వ్యయాలు వాస్తవిక లెక్కలకు పోలిక లేకుండా వున్నాయి.

స్థూలంగా 2019-20లో వార్షిక బడ్జెట్ 2,27,975.00 కోట్లుగా ప్రతిపాదించారు. కానీ సవరించిన దానిలో 1,74,757.46 కోట్లుగా మార్చారు. సుమారు 53,000 కోట్లు తగ్గించారు. తాము చూపిన పత్రాల ప్రకారం వ్యవసాయ రంగానికి, ఉన్నత విద్యకి, సెకండరీ విద్యకి, సివిల్ సప్లయికి, వైద్యం-ఆరోగ్య రంగానికి, గృహ నిర్మాణానికి, నీటి సౌకర్యానికి, కార్మికుల భీమాకి, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధికి, రోడ్ల నిర్మాణానికి కేటాయింపులో 30 నుండి 60 శాతం కోత విధించారు. ఈ రంగాలకు తగ్గించి, సంక్షేమ రంగాలకు డైరెక్టుగా క్యాష్ అందించే దానికి పెంచారు. అయినా మొత్తంగా కేటాయించిన నిధులు కోత విధించడంతో పాటు మళ్ళించటం కూడా చేస్తున్నారు. దీనికి సంబంధించిన వాస్తవ ఖర్చులు, వచ్చే బడ్జెట్‌కి వస్తాయి. బడ్జెట్‌లో కేటాయించినవి ఎందుకు ఖర్చు చేయలేదు అంటే అంచనా వేసిన కొన్ని ఆదాయాలు రాలేదు. కేంద్ర సహాయం, రాష్ట్రం నుండి పన్ను ఆదాయం రాకపోతే ఖర్చులో కోత తప్పదు. దీనితో ఒకటి అర్థం చేసుకోవచ్చు. బడ్జెట్‌లో తెలిపే రాబడులు వాస్తవమైనవి కాదు. కాగా తిరిగి 2020-21కి బడ్జెట్ ప్రతిపాదన చేస్తూ 2019-20లో ప్రతిపాదించిన బడ్జెట్ కంటే కేవలం 1.4% మాత్రమే తక్కువ ప్రతిపాదించాం అని పేర్కొంటున్నారు. దీనిలోనూ వ్యవసాయ రంగానికి 35.12%, పంచాయితీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్‌కి 47.1%, ఉన్నత విద్యకి 12.28%, సెకండరీ విద్యకి 24.08%, ఆహారం, సివిల్ సప్లయికి 20.51%కి తగ్గించారు. సాగు, తాగునీటి సౌకర్యానికి 10.15% తగ్గించారు. క్యాష్ బదలాయింపు సంక్షేమ రంగాలకు పెంచారు. శాఖల వారీగా పరిశీలిస్తే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఏనాడు వారికి కేటాయించినవి వారికి కేటాయించలేదు. కేటాయింపులలో తగ్గిస్తే ఖర్చు చెయ్యబోతే టైమ్‌కి రావలసిన నిధులు రాకపోతే గత సంవత్సరం లాగానే మౌలిక రంగాలకు కేటాయింపుల కోత విధించక మానరు. లేదా ఆ మేరకు ఖర్చు చెయ్యాలి అంటే రెండు మార్గాలున్నాయి. ఒకటి అప్పులు చెయ్యడం, ఇప్పటికే ఎఫ్ఆర్‌బిఎం నిబంధనల పరిధి దాటారు. అయితే కోవిడ్-19 కారణంగా, కేంద్రానికి లోబడి వుంటే మరో 2% అప్పులు చేసుకొనే షరతులు ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం పెట్టింది. ఆ మేరకు కేంద్రానికి షరుతులకు లోబడతాం అని తెలిపింది. దీనిపై తీవ్ర విమర్శలున్నాయి. రెండు ప్రభుత్వ ఆస్తులు అమ్మడం. స్థూలంగా ప్రజల కొనుగోలు శక్తి పెంచగలిగే వాతావరణం కోవిడ్-19కి ముందు నుండి తగ్గింది. ఇసుక పాలసీ, ప్రభుత్వం శ్రామికులపైన, వ్యాపారాలపైనా, రాష్ట్ర ఖజానాపైన పడిన విషయం గుర్తించలేకున్నారు. వ్యవసాయరంగంలో రైతు పంటకు తగిన గిట్టుబాటు ధరలు రాకపోవడం, లక్షల ఎకరాల భూములు పడావు పెట్టడం, ప్రజల జీవన ప్రమాణాలపై వుంటుంది. అయినా రాష్ట్ర స్థూల ఆదాయం పెరిగింది అని చెప్పడం విచిత్రంగా వుంది. దీనిలో ఒక రహస్యం ఉన్నది. రాష్ట్ర స్థూల ఆదాయం పెంచి, నేటి ధరలకు అనుగుణంగా మార్చడం ద్వారా, దాని ఆధారంగా ప్రభుత్వ అప్పులు చేసుకొనే అవకాశం పెరిగింది.

**రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఎంత? :**

2018-19 ఎకౌంట్సు ఆధారంగా మొత్తం ఆదాయం 1,64,241.04 కోట్లు. దీనిలో రెవెన్యూ ఆదాయం -1,14,670 కోట్లు. కాపిటల్ అంటే లోన్లు, అప్పులు తేబడినవి 50,170. 18 కోట్లు, ఖర్చు చేసింది-1,63,959.95 కోట్లు. చివరకి మిగులు చూపారు. ఇక 2019-20 బడ్జెట్ ప్రవేశ పెట్టింది. ఆదాయం -2,27,974.99 కోట్లు కాగా రెవెన్యూ ఆదాయం -1,78,697.41 కోట్లు. కాపిటల్‌గా 49,277.58 కోట్లుగా చూపారు. కానీ తిరిగి సవరించి 2019-20 బడ్జెట్‌లో అంచనాలు మొత్తం రాబడి 1,74,688.30 కోట్లు వుంటుందని, దీనిలో రెవెన్యూ రాబడి 1,10,871.41 కోట్లు కాగా ఇందులోను సెంట్రల్ టాక్సు, రాష్ట్ర పన్నుల రాబడి బాగా తగ్గింది. సుమారు 64,000 కోట్లు తగ్గాయి. దానితో కేపిటల్ రాబడిలో 13 వేల కోట్లు పైగా అప్పులు చేసారు. అయినా బడ్జెట్ అంచనా ప్రకారం ఖర్చు చెయ్యలేమని అనేక శాఖలకు

(మిగతాది 11వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)
కేటాయింపులలో కోత విధించారు.

**2020-21లో ఆదాయం అంచనా నమ్మతగినదా? :**

రెవెన్యూ రాబడిని 1,61,958. 50 కోట్లుగా చూపారు. దీనిలో కేంద్ర టాక్సుల నుండి రాబడి 32,237.68 కోట్లు. రాష్ట్ర పన్నుల రాబడి 70,67.33 కోట్లు వస్తుందని ఆశ. ఇదే పద్దు క్రింద అంచనా కంటే గత సంవత్సరం రూ॥ 40 వేల కోట్లు తగ్గింది. నేడు ఏమి ఆశించి అంచానా వేసినట్లు? కాపిటల్ ఆదాయం : అప్పులు, లోన్లు-62,830.67 కోట్లు గా రాబడిగి చూపారు. ఇవి రావచ్చు. ఇంకా ఎక్కువ కూడా వుండవచ్చు.

మొత్తంగా వార్షిక రాబడిని 2020-21లో, రూ2,24, 891.80 కోట్లుగా చూపారు. పై రాబడులలో కేంద్ర, రాష్ట్ర పన్ను ఆదాయాలు కోవిడ్-19 కారణంగా అంచనా ప్రకారం రావడం కష్టం. కోవిడ్-19 ప్రభావం లేని 2019-20 ఆర్థిక సం॥లో పన్ను రాబడులు తగ్గాయి. నేటి ఆర్థిక సం॥లో కోవిడ్-19 ప్రభావం మొత్తం జనజీవనం పైన ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడింది. ఇది రాష్ట్రానికి, దేశానికి పరిమితి లేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎంతకాలం వుంటుందో తెలియని స్థితికి నెట్టబడింది. ఉత్పత్తి, సరుకు రవాణా, ప్రజా రవాణా, ఉపాధి అవకాశాలు మెరుగు కాకుండా ప్రజల కొనుగోలు శక్తి పెరగదు. అమెరికా, యూరప్ దేశాలలో లాగా నిరుద్యోగ భృతి ఇవ్వగలిగితే ఆర్థిక-సరుకు రవాణా చక్రం కనీసం ప్రారంభం అవుతుంది. ఉత్పత్తి, రవాణా, అమ్మకాలు, కొనుగోలు విశాల ప్రజల జీవన చక్రంపై ఆధారపడి వుంటుంది. ప్రపంచ ప్రజా జీవన చక్రం కదిలితేనే ప్రభుత్వాలకు పన్ను రాబడి వుంటుంది. పన్ను రాబడి లేపోతే చేసిన కేటాయింపుల ప్రకారం ఖర్చు చేయ్యలేరు. చివరకు అంతా కలిపి నేడు అందరూ వాడే పెట్రోల్ పై పన్ను పెంచుతున్నారు.

భారతదేశంలో అనేక నిర్మాణాలలో ఉత్పత్తి రంగాలలో మానవశక్తి వినియోగం అత్యధికం. భవన, ఇతర నిర్మాణాలలో కోట్ల మంది వలస కార్మికులున్నారనే విషయం కోవిడ్-19 లాక్ డౌన్ కాలంలో బహిర్గత మయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికులను ఆదుకోవడంలో చేసిన నిర్లక్ష్యం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం వుంటుంది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిన కాలంలో రాష్ట్ర బడ్జెట్ లో వేసుకున్న పన్ను రాబడులు ఆశించినంతగా రావు. కేటాయించిన ఖర్చులు చెయ్యలేరు. కేంద్రం నుండి ఆర్థిక సహాయం ఆశించిన ఫలితం కష్టం, స్థూల ఆదాయాలు కూడా పడిపోతే అప్పుచేసే కెపాసిటీ పెరగదు.

బడ్జెట్‌లోని రాబడులు-ఖర్చులు చివరకి దున్నకుండా విత్తనాలు వేస్తే కొయ్యకుండా పండుతాయి అనే విధంగా మారక తప్పదు. ఇలాంటి స్థితిలో కేంద్రం రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు ఏర్పాటు ఒకటే మార్గం. దీనికి రాష్ట్ర ప్రజలు కేంద్రంపై సమైక్యంగా ఆందోళనకు పూనుకోవడమే మార్గం.

2019-20లో వార్షిక బడ్జెట్‌లో చేసిన కేటాయింపులలో 53,000 కోట్లు ఖర్చు చెయ్యలేదు. రాబడి తగ్గడం కేంద్ర సహకారం లేకపోవడంతో అప్పులు చేసినట్లు తెలిపారు. అనేక శాఖలకు కోతలు విధించారు. రాష్ట్ర ఖజానికి రావలసిన రాబడులు రాలేని సంక్షోభం ప్రారంభం అయిందనేది వాస్తవం. దీని నివారణకు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఏమీ లేవు. రాష్ట్రం అప్పులు చేసినా రాష్ట్ర స్థూల ఆదాయం ఆధారంగానే. కానీ వాటి వివరాలలోకి వెళ్ళితే ఏ రంగం నుండి ఎంత ఆదాయం వచ్చేది నమ్మదగిన లెక్కలుగా లేవు. స్వయాన నేటి ఆర్థిక మంత్రి చంద్రబాబుపై విమర్శ చేస్తూ రాష్ట్ర స్థూల ఆదాయంపై ఘాటైన విమర్శలు చేసారు. అభివృద్ధి చూపడానికి లెక్కలు సవరించరించారని విమర్శించారు. చిన్న ఉదాహరణ. 14.5 లక్షల మత్స్యకారుల నుండి 76,309 కోట్ల స్థూలా ఆదాయం రాగా 1.45 కోట్ల రైతులు కేవలం వ్యవసాయం నుండి 49,000 కోట్లు స్థూల ఆదాయం రావడం నమ్మదగినదిగా లేదని ప్రకటించారు.

(8 వ పేజీ తరువాయి)

**9) పెట్రో, డీజిల్ ధరలు తగ్గించాలి. వాటిని జి.ఎస్.టి పరిధిలోకి తీసుకొనిరావాలి.**

**10) లాక్‌డౌన్ కాలానికి కార్మికులకి వేతనాలు చెల్లించాలి, ఉద్యోగాల నుండి తొలగింపులను ఆపాలి.**

**11) ఉపాధి హామీ పనులను, కూలి రేటును రెట్టింపు చేయాలి. పట్టణాలలో కూడా ఉపాధి హామీ పనులు అమలు చేయాలి.**

**12) పి.యం కేర్ ఫండ్స్‌ను కరోనా నివారణా చర్యలకై రాష్ట్రాలకు విడుదల చేయాలి.**

భారత కార్మిక సంఘాల సమాఖ్య - **(IFTU)**ఆం.రాష్ట్ర కమిటీ

ఈ విధంగా విమర్శ చేసిన ఆర్థిక మంత్రి అవే లెక్కలను నేటి ధరలకు అనుగుణంగా మార్చి వచ్చే సం॥ చివరికి రాష్ట్ర స్థూల ఆదాయం 10 లక్షల కోట్లు పెరుగుతుందని అన్నాడు. అయితే పెరిగిన సంపద చివరికి ఎవరికి చేరుతుంది. చెబుతున్న జాతీయ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 67% దారిద్ర్యరేఖ దిగువన ఉన్నట్లు పేర్కొన్నారు. అంతరాలు తెలుసుకోవడానకి ఈ లెక్కలు వరకు ఉపయోగంలేదు ఈ లెక్కలు మరిన్ని అప్పులు చెయ్యడానికి ప్రాతిపదిక అవుతాయి. వాస్తవ లెక్కలు తేల్చితే అప్పులు పొందే స్థాయి తగ్గిపోతుంది. కావున మార్చరు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం 2013-14 నుండి అన్ని శాఖల నుండి వారి జనాభా ప్రాతిపదికన కేటాయింపుల చేసి ఖర్చు చెయ్యాలి. అందుకు ఒక నోడల్ వ్యవస్థ వుంది. అయినా బడ్జెట్ పరిశీలిస్తే ఎస్టీ సబ్ ప్లాన్ క్రింద 2018-19లో 4,988.53 కోట్లు కేటాయించి, 3,281.46 కోట్లు ఖర్చు చేసినట్లు ఉన్నది. 1,707 కోట్లు ఖర్చు చెయ్యలేదు. కోత విధించిన దానిలో కూడ వారి ఆరోగ్యానికి, ఆహారానికి, రోడ్లు, ఆదాయ వనరులకి సపోర్టుగా కేటాయించిన నిధులే ఖర్చు చెయ్యలేదు. ఇంకేమి సంక్షేమం. అలాగే ఎస్సీ సబ్ ప్లాన్ క్రింద 2019-20 బడ్జెట్ లో 15,000 కోట్లు కేటాయించి 9,439.02 కోట్లు మాత్రమే ఖర్చు చేసారు. నిర్దిష్టంగా చట్టం వున్నా కేటాయింపులో ఈ రెండు శాఖలలో 33% కోత విధించారు. ఇంకా అన్ని శాఖల్లో 53,000 కోట్లు కోత విధించింది పైగా 60 వేల కోట్లు అప్పుచేసి రాష్ట్ర అప్పులస్థితి రూ॥ 3.45 లక్షల కోట్లకి చేర్చారు. కోవిడ్-19 కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాబడి వచ్చే అవకాశం లేదు, అప్పు లభించడం కష్టం. రాష్ట్రం ఆర్థిక సంక్షోభం వైపు ప్రయాణం అవుతుంది. ఆర్థిక సంక్షోభం నుండి బయట పడటానికి శాశ్వత పరిష్కారాల కంటే స్థూల ఆదాయాలు తారుమారు చెయ్యడం, కేంద్రంపై న్యాయమైన వాటా కోసం కాక యాచించే స్థితికి చేరడం, రాష్ట్ర సంపదను అమ్మడం, విభజన హామీలను అమలుకు డిమాండ్ చెయ్యక పోవడం. చెయ్యవలసిన పనులు చెయ్యకుండా వాయిదా వెయ్యడంతో రాష్ట్రం మరింత సంక్షోభానికి దారితీయక తప్పదు. మొత్తంగా రాష్ట్ర ప్రజల ముందు ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లెక్కల గారడి - నీటి మూటలు తప్పా ఆర్థిక సంక్షోభం నుండి బయటపడే మార్గం లేదు. ప్రజా సంక్షేమం ప్రశ్నార్థకం కాక తప్పదు. కోవిడ్-19 సృష్టిస్తున్న సంక్షోభానికి పరిష్కారం చూపలేదు.

రాష్ట్ర బడ్జెట్ ను పరిశీలిస్తే దీర్ఘకాలిక, ప్రజా జీవనానికి అవసరం అయిన రంగాలైన వ్యవసాయం, ఇరిగేషన్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, ప్రజా వైద్యానికి, విద్యకు, గ్రామీణ అభివృద్ధికి, నిధుల కోత విధించారు. క్యాష్ ట్రాన్సఫర్ విధానంలో నేడు రూ॥ 40 వేల కోట్లకు పెంచారు. నేటి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుంటే కోత విధించిన రంగాలకు కేటాయించిన నిధులైనా ఖర్చు చేయగలరా? ఈ స్థితిలో గ్రామీణ ప్రాంతానికి చేరిన లక్షల మంది వలస కార్మికుల ఉపాధి కోసం నిర్దిష్ట విధానం లేదు. కోనేరు రంగారావు కమీషన్ ప్రకారం అటవీ భూముల్లో సాగుచేసుకుంటున్న ఆదివాసీ, ఇతర పేదలకు పట్టాలు ఇచ్చే 2006 చట్టం, దేవాదాయ భూములు, తీర, అడవి, పడావు, ల్యాండ్ సీలింగ్,ల్యాండ్ బ్యాంకు, క్రింద వున్న 20 లక్షల ఎకరాలు భూమిలేని పేదలకు, సాగు చేయడానికి ముందుకు వచ్చే వ్యవసాయ పట్టబద్రులకు, గ్రామీణ నిరుద్యోగులకు సాగుయోగ్యమైన ఈ భూములు పంచాలి. వీరి వ్యవసాయాభివృద్ధికి సహకరించాలి.

పట్టణాలలో కోవిడ్-19 కారణంగా ఇసుక విధానం అమలు లోపంతో పనులు కోల్పోయిన వారికి, వీధి వర్తకులకు, రాష్ట్రంలో జీవన భృతి కోల్పోయిన వివిధ సెక్షన్ల ప్రజలకు-వారి జీవనభృతికి ఈ బడ్జెట్‌లో నిధులు డైరెక్టుగా సం॥రానికి వ్యక్తికి 20 వేలు, కుటుంబానికి 60 వేలు ఇచ్చే విధంగా 78 వేల కోట్లు కేటాయించవచ్చు. ఈ విధంగా ప్రజలు, సామాజిక, ఆర్థికరంగ నిపుణులు, ఉద్యమకారులు డిమాండ్ చేయాలి.

"కమ్యూనిస్టుల దృష్టిలో నీతి యావత్తూ ఐక్య క్రమశిక్షణలోనే వుంది. దోపిడీదార్లకు వ్యతిరేకంగా మేము చైతన్యంతో జరిపే ప్రజాపోరాటంలోనే వుంది. మాకు శాశ్వత నీతిలో విశ్వాసం లేదు. నీతిని గూర్చిన కాకమ్మ కథల్లోని బూటకత్వాన్ని మేము బహిర్గతం చేస్తాం. మానవ సమాజం మరింత ఉన్నత స్థాయిని అందుకోడానికి, శ్రమ దోపిడీ నుంచి అది విముక్తి చెందడానికి తోడ్పడేదే నీతి."
- వి.ఐ.లెనిన్

# కరోన వెనుక కనిపించని నిజాలు

K. ఉప్పలయ్య, TPTF

*"అన్ని సమస్యలకు మూల కారణం పెట్టుబడిదారీ విధానమే " – మార్క్స్*

*" ఏ వివాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే వుంటారు " – లెనిన్*

*" జరుగుతున్న ప్రతీ సంఘటనను అనుమానించాల్సిందే.." – బుద్ధుడు*

కరోన వైరస్‌కు కోవిడ్-19 అనే పేరు పెట్టి ప్రపంచ మహమ్మారిగా ప్రకటించిన నేపథ్యంలో పైన తెలిపిన మార్క్స్, లెనిన్, బుద్ధుడి వ్యాఖ్యానాల వెలుగులో ప్రజాకోణంలో చేయవలసిన అనుమానాలు కానీ, జరగవలసిన పరిశీలనలు కానీ కనీస మాత్రంగా అయినా జరగకపోవడం చాలా బాధాకరం. W.H.O ప్రకటించినట్లుగా, ప్రపంచంలో ఉన్న అన్ని దేశాలు, ప్రజలు నమ్ముతున్నట్లుగా ఈ వైరస్ నిజానికి అంత ప్రమాదకరమేనా..?? ప్రచారంలో ఉన్నంత భయంకరమైనదేనా..?? మానవాళి ఉనికికే ఇది పెను సవాలు విసురుతుందా..?? ఇది నిజంగానే ప్రపంచ మహమ్మారా ..?? దీని వెనుక ఏమైనా (మానవ) శక్తులు దాగి ఉన్నాయా..?? ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోవలసి ఉంది.. ఈ పనిని అభ్యుదయవాదులు, ప్రజా సమస్యల విశ్లేషకులు, పరిశీలకులు, మేధావులు మార్క్సిస్టు కోణంలో పూర్తిచేయాల్సిన అవసరం ఉంది.. ఇది తక్షణ కర్తవ్యం.

కరోన వైరస్ గురించి సృష్టించబడ్డ భయాలు, అబద్దాలు, అర్థ సత్యాలు, అపోహలలో కొట్టుకపోయామంటే పెట్టుబడిదారీ విధానం యొక్క లాభాపేక్షను, దోపిడీ కాంక్షను తక్కువగా అంచనా వేశామనే భావించాలి. కరోన వైరస్ సహజమైనదా లేక సృష్టించబడ్డదా అనే చర్చ అప్రస్తుతం, దాని మూలంగా లేదా దాని పేరుతో సృష్టించబడ్డ భయాల (అతి తీవ్ర భయాలు) మీద అంతకంటే ఎక్కువ తీవ్రమైన చర్చలు, విశ్లేషణలు పెద్ద ఎత్తున లేవనెత్తాల్సిన అవసరం ఉంది. ఆ కోణంలో చూసినప్పుడు కరోన వైరస్ మూలంగా ఏర్పడ్డ భయాలు పెట్టుబడిదారీ విధానం యొక్క సృష్టి మాత్రమే. గతంలో ప్రజలకున్న అవసరాలను, కొన్నిసార్లు అవసరాలను సృష్టించి కూడా (అవసరం లేని వస్తువులను కూడా నిత్యావసర వస్తువులుగా మార్చడం) లాభాలను ఆర్జించడం దాని లక్షణం. ఇంకా ప్రజలలో వుండే సహజ భయాలను (ఉదా: నమ్మకాలు, విశ్వాసాలు, ప్రాణభయం మొ॥) ఆసరాగా చేసుకుని దోపిడీకి పాల్పడడం జరుగుతూ వస్తుంది. కానీ, ప్రస్తుతం భయాలను సృష్టించి, ఆ భయాలను లాభాలుగా మార్చుకునే, ప్రజల శ్రమను చట్టబద్ధంగా దోచుకునే మహదావకాశాన్ని పొందడానికి వాడుకున్న (సృష్టించబడిన) ఆయుధమే ఈ వైరస్. అంటే సహజ భయాలు తెచ్చే లాభాల కంటే కృత్రిమ భయాలు తెచ్చే లాభాలు అనేక రెట్లు ఎక్కువ మరియు తక్షణమైనవి. ఈ రోజు పెట్టిన పెట్టుబడి రేపటికల్లా, కుదిరితే ఈరోజు సాయంత్రానికే లాభాలుగా, ఇంకా వీలైతే ముందే పెట్టుబడి మరియు లాభాలు కూడా సమకూరే (అడ్వాన్స్‌లు, ఆర్డర్లు ద్వారా) వ్యాపారం ఫార్మారంగంలో జరుగుతున్న విషయాన్ని గమనించాలి. కృత్రిమ భయాలు, తక్షణ లాభాలు అనేవి పెట్టుబడిదారీ విధానం యొక్క ఉచ్ఛస్థితిగా పరిగణించాలి. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత దశ అనడం కంటే వేల రెట్లు ఎక్కువైన (గతం కంటే) తక్షణ సంపదను తెచ్చిపెడుతున్న ప్రస్తుత పరిస్థితినే అత్యున్నత దశగా మార్చుకోవాల్సి వస్తుంది. కరోన వైరస్ పేరుతో సృష్టించబడ్డ భయాలు ఇప్పటికే ఆ పనిని పూర్తి చేయడంలో పెట్టుబడిదారుల బొక్కసాలు నింపడంలో నిమగ్నమయ్యాయి. మొట్టమొదట వైరస్‌ను గుర్తించగానే W.H.O చేసిన పని ప్రపంచ మహమ్మారిగా ప్రకటించడం. ఈ ప్రకటనకు ముందు ప్రపంచ దేశాలతో గానీ, వైద్యరంగంలో నిపుణులతో గానీ, జీవశాస్త్రవేత్తలతో గానీ, వైరాలజిస్టులతో గానీ సంప్రదించకపోవడమే కాకుండా వైరస్‌పై ప్రాథమిక అధ్యయనం కూడా లేకుండా వ్యాప్తి రేటు, రికవరీ రేటు, వ్యాధి లక్షణాలు, మరణాల రేటు, వైద్య సంసిద్ధత, ఔషధ సంసిద్ధత వంటి ఏ ఒక్క విషయం మీద కూడా స్టడీ చేయకుండా కేవలం వ్యాప్తి ఎక్కువగా ఉంటుందన్న ఒకే ఒక్క కారణాన్ని చూపి ఏకంగా ప్రపంచ మహమ్మారిగా ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గతంలో వచ్చిన సార్స్ (9.6%), హంట (22%), ఎబోలా (70% మరణాలు రేటు), రొటా వంటి వైరస్‌లను మాత్రం చాలా తేలికగా తీసుకొని కేవలం 2 నుంచి 3% మరణాల రేటు (ఏ ఒక్క మరణం అయినా బాధకరమే కానీ వైద్య పరిభాషలో ఈ రేటు చాలా స్వల్పం) ఉన్న ఈ వైరస్‌ను మానవాళి ఉనికినే తుడిచి పెట్టేస్తుంది అన్నంత భయాన్ని వైరస్ కంటే వేగంగా ఎక్కువగా వ్యాప్తి చేయడం వెనుక పనిచేసిన శక్తులేవో ప్రపంచానికి తెలియాల్సి ఉంది. అలాగే ప్రపంచంలో సంపన్న దేశాలు, అభివృద్ధి పథంలో ఉన్న దేశాలు అయిన అమెరికా, బ్రిటన్, ఇండియా, బ్రెజిల్, రష్యా, మెక్సికో, స్పెయిన్, చిలీ, ఇరాన్, దక్షిణాఫ్రికాలలో మాత్రమే వైరస్ దానితో పాటు భయాలు తీవ్రంగా వ్యాపించడానికి గల కారణాలు కూడా ఆలోచించాలి. పేద దేశాల్లోని ప్రజలు ఆరోగ్యం కోసం లక్షల్లో ధారబోయగల సామర్థ్యం లేకపోవడమే అనే వాదన కొట్టిపారేయాల్సింది ఏం కాదు.

నిజానికి ప్రతీ రోజూ వేర్వేరు వ్యాధులతో ఎంతోమంది మరణిస్తున్నారు. క్యాన్సర్, నిమోనియా వంటి ఇతర వ్యాధులతో ప్రతీరోజు జరిగే మరణాలు కరోన మరణాల కంటే ఎక్కువే. కానీ అవేవి ప్రస్తుత మరణాల లాగా ఏ రోజుకారోజు ప్రకటించబడడం లేదు. ఇది గుర్తించాల్సిన విషయం. అలాగే వైరస్ వల్ల జరుగుతున్న మరణాల్లో 60% కంటే ఎక్కువ గుండె సంబంధిత కారణాలతో జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం భయాందోళనకు గురికావడమే. మానసిక ఒత్తిడి, భయం అనేవి రోగనిరోధక శక్తిని తగ్గించడమే కాకుండా హైపర్ టెన్షన్, గుండె నొప్పి, గుండె పనితీరు దెబ్బతినడానికి కారణమవుతాయన్న విషయం తెలిసిందే. అంటే ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించినట్లైతే ప్రస్తుత మరణాలను సగానికంటే ఎక్కువగా తగ్గించే అవకాశం ఉంది. ప్రస్తుత వైరస్ సోకిందన్న భయం కంటే, దాని తర్వాత ఎదుర్కోవాల్సిన పరిణామాలు మరింత భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

భౌతిక దూరం స్థానంలో ప్రయోగించిన సామాజిక దూరం చాలా దూరం ముందుకెళ్లి సామాజిక వెలి గా మారింది.

పాలు, నీళ్లు, కూరగాయలకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి దాపురించింది. సాధారణ వ్యాధులకు సైతం చికిత్స చేయడానికి వైద్య సిబ్బంది వెనుకడుగు వేయాల్సి రావడం, కళ్ళముందే ప్రాణం పోతున్నా, నదిరోడ్డు మీదే పడిపోయి చనిపోతున్నా స్పందించలేని అమానవీయత సృష్టించబడింది. కుటుంబ సంబంధాలు, బంధుత్వాలు, స్నేహాలు, మానవ సంబంధాలన్నీ మంట కలిసిన స్థితిలో ప్రపంచం దూసుకుపోతుంది. పెట్టుబడిదారీ విధానానికి కావాల్సిన మానవ సంబంధాల విచ్ఛిన్నతను కరోన వైరస్ పేరుతో పరిపూర్ణం చేశారు. వైరస్ గురించి W.H.O గాని, వివిధ దేశాధినేతలు గానీ, వైద్య నిపుణులు గానీ మొదట నుంచి చేస్తున్న ప్రకటనలు, సూచనల్లో ఎన్నో వైరుధ్యాలు కనపడుతున్నాయి. అందులో మొదటిది వైరస్ సోకిన 80% మందికి అది వారికి సోకిన విషయం తెలియకుండానే తగ్గిపోతుందని ప్రకటించారు. ఇది ఎంతో అసంబద్ధమైనది, సందేహాస్పదమైనది. 80% మందికి తమ శరీరంలోకి వచ్చి ఏ హాని చేయకుండా వెళ్లిన విషయం కూడా గుర్తించలేనప్పుడు ఆ వైరస్‌ను ప్రపంచ మహమ్మారి అనడం హాస్యాస్పదంగా ఉంది. ఇది జలుబు వైరస్ యొక్క లక్షణం. అది కూడా వ్యాప్తిరేటు చాలా ఎక్కువ, రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉన్న వ్యక్తులలో ఈ వైరస్ ప్రవేశించిన విషయం గానీ, తగ్గిపోయిన విషయం గానీ గుర్తించడం జరగదు. తీవ్రమైన నిమోనియాగా మారితే తప్ప ప్రాణాంతకం కాదు. కుటుంబంలో ఒక్కరికీ జలుబు చేస్తే దాదాపుగా మిగతా సభ్యులందరికీ వ్యాపించడం మనందరికీ అనుభవంలో ఉన్న విషయమే. ఇప్పటికీ దీనికి పూర్తిస్థాయిలో ఔషధం లేదా వాక్సిన్ లేకపోవడం, ఏ మందులు వాడకుండా ఉన్నప్పటికీ నిర్దిష్టకాలం తరువాత దానంతట అదే తగ్గుముఖం పట్టడం వంటి పోలికలు చూసినప్పుడు జలుబును కూడా మహమ్మారిగా అయినా ప్రకటించాలి లేదా కరోనను సాధారణ జలుబు గానో లేక నిమోనియా గానో గుర్తించాలి. కరోన వైరస్ సోకిన ఒక వ్యక్తికి వైద్యం అందించిన కొన్ని రోజుల తర్వాత అతని శరీరంలో వైరస్ లేకుండా (నెగిటివ్) పోతుంది. దానర్థం సాధారణ భాషలో వైరస్ చంపబడింది. అంటే వైరస్ మీద వైద్యం కోసం వినియోగించబడ్డ మందులు పనిచేసినట్లే. అయినప్పుడు వైరస్‌కు మందు లేదని చెప్పడం సందేహం కలిగిస్తుంది. ఒకవేళ మందు లేదనేది నిజం అయితే ఏ మందులు ఇవ్వక పోయినా నిర్దిష్ట కాలం తర్వాత నెగిటివ్‌గా వచ్చే అవకాశం ఉందనే కదా అర్థం. ఇదొక ముఖ్యమైన వైరుధ్యం.

( మిగతాది 13వ పేజీలో )

ప్రకటన

# అయోధ్య భూమి పూజ వెనక దేశ ప్రజల దృష్టిని మౌలిక సమస్యల నుండి, కారోనా నుండి దారి మళ్లించే రహస్య రాజకీయ ఎజెండా!

370, 35A రద్దుల ద్వారా కాశ్మీర్ స్వయంప్రతిపత్తిపై గత ఏడాది ఆగష్టు 5న మోడీ సర్కారు క్రూర ఫాసిష్టు దాడికి దిగింది. నేటికీ కాశ్మీర్ లోయ కర్ఫ్యూ పాలనలోనే ఉంది. 75 లక్షలమంది కాశ్మీరీ జాతీయులు సంపూర్ణ లాక్ డౌన్ లో మగ్గుతున్నారు. దానికి సరిగ్గా ఏడాది నిండిన రోజు అనగా ఈ ఏడాది ఆగష్టు5న అయోధ్యలో అత్యాధునిక రామాలయం నిర్మాణం కోసం భూమి పూజ పేరిట మోడీ ప్రభుత్వం శంఖుస్థాపనకి పూనుకున్నది. ఇది నేడు దేశ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల నుండి, ముఖ్యంగా కారోనా వైరస్ బారి నుండి దేశ ప్రజల్ని కాపాడలేని అసమర్థత, నిర్లక్ష్యం, ప్రజావ్యతిరేక విధానం నుండి దృష్టిని మళ్లించే చర్యగా మా పార్టీ భావిస్తున్నది. ప్రజల్లో మత విద్వేష ఉన్మాదం పెంచి, మౌలిక సమస్యల పరిష్కారం కోసం వారిని ఆలోచింపజేయ నివ్వని కుట్ర ఉందని కూడా భావిస్తున్నది. ఈ చర్య వెనుక దాగిన మోడీ ప్రభుత్వ రహస్య రాజకీయ ఎజెండాను అర్థం చేసుకుని, దానికి అవకాశం ఇవ్వకుండా ప్రజలను మౌలిక సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా కారోనా కాలంలో ఎదురయ్యే ఉద్యోగం, ఉపాధి, ఆరోగ్య పరిరక్షణ, ఉచిత వైద్య చికిత్స, సంక్షేమం వంటి తక్షణ డిమాండ్ల పై మరియు నిర్బంధానికి వ్యతిరేకంగా సంఘటిత పరిచే కృషిని చేపట్టాల్సి ఉందని మా పార్టీ అభిప్రాయపడుతున్నది.

తే.7-8-20 **సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ, రాష్ట్ర కమిటీ, ఏ. పి.**

( 12వ పేజీ తరువాయి)

అలాగే కరెన్సీ నోట్ల చెలామణి ద్వారా వైరస్ వ్యాపిస్తుంది కానీ, వార్తా పత్రికల ద్వారా వ్యాపించదు అని ప్రకటించారు. ఇది మరొక వైరుధ్యం. దీని వెనుక గల వ్యాపార కోణం కూడా అర్థం చేసుకోవచ్చు. కరెన్సీ నోట్లను నియంత్రించడం ద్వారా పెట్టుబడిదారులకు అనుకూలమైన డిజిటల్ కరెన్సీ వినియోగం పెంచుకోవడం ఈ వైరుధ్యం వెనుక దాగిన ప్రయోజనం అయి ఉండవచ్చు. అదే సమయంలో వార్తా పత్రికలు నియంత్రణ వల్ల ఇప్పటికిప్పుడు వచ్చే ప్రయోజనం లేకపోగా తాము సృష్టించిన భయాలు, ఆందోళనలు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి చేరాలంటే పత్రికల అవసరం ఎంతైనా ఉందనేది వారి అభిప్రాయం. అలాగే వైరస్ సోకిన వ్యక్తి లాలాజలం ద్వారా అంటే దగ్గడం, తుమ్మడం, చీదడం ద్వారా విడుదల అయ్యే తుంపర్లు బయటి వస్తువుల మీద అతుక్కుని వేరొక వ్యక్తి వాటిని తాకడం ద్వారా శరీరంలోకి ప్రవేశించడం జరుగుతుందని ప్రకటించి, ప్రస్తుతం గాలి ద్వారా కూడా వ్యాప్తి చెందుతుందని ప్రకటిస్తున్నారు. ఇది మరొక వైరుధ్యం. గాలి ద్వారా వ్యాప్తి అంటే ఒక వ్యక్తి శ్వాసక్రియలో జరిగే exhalation (ముక్కు ద్వారా విడుదల అయిన గాలి)ను పీల్చిన వారికి కూడా సోకుతుందనేది దీని సారాంశం. ఇదే కనుక నిజమైతే ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 90% మందికి సోకి ఉండాల్సింది. ప్రజల్లో వైరస్ పట్ల భయం తగ్గుతుందన్నప్పుడల్లా దానిని పెంచే ఉత్ప్రేరకాలుగానే ఈ పరస్పర వైరుధ్య, హాస్యాస్పదమైన ప్రకటనలు విడుదలవుతున్నట్లుగా భావించాల్సి వస్తుంది.

ఇంకా మొదట ప్రకటించిన వైరస్ లక్షణాలు కేవలం నాలుగు. అవి పొడి దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి. ఈ లక్షణాల జాబితాలోకి ఒక్కొక్కటిగా చేరుస్తూ సాధారణ అనారోగ్య లక్షణాలు అన్నింటినీ వైరస్ లక్షణాలుగా మార్చేశారు. ఇవాళ తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, కళ్ళు తిరగడం, నీరసం, రుచి వాసన గుర్తించలేకపోవడం, వాంతులు, విరేచనాలు, ఛాతినొప్పి వంటివన్నీ కరోన లక్షణాలుగా ముందుకు తెచ్చారంటే ప్రజలు ఏ చిన్న అనారోగ్య సమస్యనైనా కరోన గానే అనుమానించి హాస్పిటల్స్‌కి వెళ్లాల్సిన పరిస్థితి సృష్టించబడింది. జలుబు చేసినప్పుడు వాసన గ్రహణశక్తి, జ్వరం వచ్చినప్పుడు రుచిని గ్రహించే శక్తిని కోల్పోవడం పోషకాహారం లోపం వల్ల నీరసం సర్వ సాధారణం అనే వాస్తవాన్ని కూడా ఆలోచించలేని భయానక స్థితిలోకి మనుషులందరూ కూరుకపోయారు. ఎంతగా అంటే భూమి మీద పుట్టిన ప్రతీ మనిషి, జ్ఞానం తెలిసిన పసిపిల్లలతో సహా, నాగరిక సమాజానికి సుదూరంగా కొండ ప్రాంతాల్లో జీవించే ఆదివాసులతో సహా కరోన పేరును ఉచ్చారణ చేసిన వాళ్లే. ప్రపంచ వ్యాప్తంగా ఇంత వేగంగా, సూటిగా ఖచ్చితంగా ప్రజల్లోకి వైరస్ భయాన్ని చొప్పించడానికీ ఉపయోగించిన ఆయుధమే లాక్ డౌన్.

లాభాల వేటలో సృష్టించబడ్డ భయాలు వ్యాపారాలుగా మారి తక్షణ లాభాలను ఆర్జించడంలో బహుళజాతి కంపెనీలు, ఫార్మా కంపెనీలు, కార్పొరేట్ వైద్యరంగం, రసాయన పరిశ్రమలు పోటీపడుతూ శరవేగంగా దూసుకుపోతున్నాయి. గతంలో దేశాల మధ్య లాభాల వేటలో సాగిన ఆయుధ పోటీ స్థానంలో ఇప్పుడు ఔషధాలు వచ్చి చేరాయి. రూ॥ 1000 ల మందులతో నయమయ్యే వ్యాధిని, 5 లక్షల రూపాయలకు పెంచేసింది కార్పొరేట్ వైద్యం. పదుల సంఖ్యలో బాధితులు వున్నప్పుడు ప్రజా వైద్యంను అందించిన ప్రభుత్వాలు, వేలల్లో లక్షల్లో ప్రజలు బాధితులుగా మారే క్రమంలో చేతులెత్తేసి, కార్పొరేట్ దోపిడీకి మార్గం సుగమం చేశాయి. సంపన్నులకు కార్పొరేట్ వైద్యం, లేని వాడికి అరకొర వసతుల మధ్య ఉన్న ప్రభుత్వ వైద్యం అందిస్తూ, సామాన్యుడికి అందనంత ఎత్తులో కరోన వైద్యాన్ని ఇప్పటికే నిలబెట్టారు. మరొక వైపు కరోన మందు, వాక్సిన్‌ల పేరుతో ఫార్మా కంపెనీల పోటీ, మందులను బ్లాక్ మార్కెట్టుకు తరలించే దందా కూడా అప్పుడే మొదలైంది. ఒక సర్వే ప్రకారం గతంలో సంవత్సరానికి దేశంలో 70 లక్షల లీటర్ల శానిటైజర్ ఉపయోగించగా, ప్రస్తుతం ఒక్క నెలలోనే అంతకు మించి వినియోగిస్తున్నారంటే ఒక్క శానిటైజర్ వల్లే ఎన్ని కోట్ల వ్యాపారం జరుగుతుందో ఊహించవచ్చు. గతంలో కంటే అనేక రెట్లు వినియోగం పెరిగిన సబ్బులు, హాండ్ వాష్‌లు, మాస్కులు, మందుల వల్ల జరుగుతున్న వ్యాపారం దీనికి అదనం. రాబోయే కొద్దిరోజుల్లోనే కరోన షాపింగ్ మాల్స్ రూపొంది ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చడం కూడా జరుగుతుంది. ఇది మాత్రమే కాకుండా కరోన పేరుతో విద్యా రంగంలో డిజిటల్, ఆన్లైన్ తరగతుల నిర్వహణ పేరుతో మొబైల్ ఫోన్ల పరిశ్రమలు, టెలికాం కంపెనీలు లాభాలు పొందే ప్రయత్నాలు ముమ్మరం చేయడం, దీనికి ప్రభుత్వాలు సహకరించడం మూలంగా ప్రభుత్వ విద్యారంగ వినాశానానికి బాటలు పరుస్తున్నారు.

ఇప్పటికైనా వైరస్ పట్ల ప్రజల్లోకి చేర్చబడ్డ అనవసర భయాలను పోగొట్టేలా ప్రభుత్వాలు, మీడియా, రచయితలు, మేధావులు, విశ్లేషకులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. *(ఉప్పలయ్య గారు టిపిటిఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి, వారికి కృతజ్ఞతలతో)*

## కాకి సాలమ్మ గారికి విప్లవ జోహార్లు



పోరాటమే ప్రాణంగా జీవించిన అమరజీవి కాకి లక్ష్మారెడ్డి జీవిత సహచరిణి, స్వర్ణ భాస్కర్ మాతృమూర్తి కాకి సాలమ్మ (84) 24 జులై 2020న ఖమ్మంలో అమరులయ్యారు. సాలమ్మ తన భర్త లక్ష్మారెడ్డి మరణం తర్వాత కృంగి పోయారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనూ, తెలంగాణా సాయుధ పోరాట సమయంలో సాలమ్మ కీలక పాత్ర పోషించారు.

పోరాటమే ప్రాణంగా ఉద్యమమే జీవితంగా పోరాడి గెలిచిన కాకి లక్ష్మారెడ్డి గారి ఉద్యమ కుటుంబం నేటి తరానికి ఆదర్శం. తెలంగాణా సాయుధ పోరాటాల కాలం నుంచి, గోదావరిలోయ పోరాటాల దాకా – ముఖ్యముగా నల్గొండ, సిరిసిల్ల పోరాటాలలో వారి కుటుంబ పాత్ర చాలా ముఖ్యమైనది. సాలమ్మ గారు భర్త విప్లవ రాజకీయ జీవితంలో తనెప్పుడూ పరోక్ష భాగస్వామిగా కష్టాలు పడుతూనే నడిచింది. ఆయన అజ్ఞాత జీవితం గడిపితే తను పిల్లల్ని సాదుకుని కుటుంబాన్ని పోషించింది. యింటి కొచ్చే వందలాదిమంది ప్రజా కార్యకర్తలకు అమ్మ అయి అన్నం పెట్టింది. ఆరోగ్య సమస్యలు తనని వెంటాడుతూ వచ్చాయి. ఆస్తమా నుండి మొదలు కాన్సర్ వరకు అనీ తనని ఎప్పుడూ ఇబ్బంది పెడుతూ చివరి వరకు వెంటాడుతూనే వచ్చాయి. విప్లవోద్యమానికి ఎంతో సేవలందించిన కా॥ సాలమ్మ గారికి విప్లవ జోహార్లు.

సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఆం.ప్ర. రాష్ట్ర కమిటీ

# జూలై 17 నుండి ఆగస్టు 6 వరకు దళితులపై సాగుతున్న హింస, దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా జరిగిన కార్యక్రమాలు

వేల సంవత్సరాలుగా బ్రాహ్మణీయ మనువాద కులవ్యవస్థ దళితలను అంటరానివారిగా, అగ్రకులాల సేవకులుగా వుంచి అమానవీయంగా సమాజానికి దూరంగా వుంచింది. పశువులు కంటే హీనంగా చూస్తూ ఏ హక్కులూ లేకుండా కట్టుబానిసలుగా మార్చింది. కాలం మారుతున్నా దళితుల పట్ల మనువాద వ్యవస్థ దాష్టికం, దౌర్జన్యాలు, హింస మారలేదు. దళితులు హక్కులు గురించి, ఆత్మాభిమానం గురించి ప్రశ్నించినప్పుడుల్లా భౌతికదాడులకి, హత్యలకి, అత్యాచారాలకి గురవుతూనే వున్నారు. ' స్వాతంత్ర్యం ' వచ్చిందని చెప్పబడిన తర్వాత కూడా దళితులపై దాడులు ఆగలేదు. వేలు వేలుగా మారణకాండలు సాగుతూనే వున్నాయి. కారంచేడు, చుండూరు లాంటి ఊచకోతలు, మారణకాండలు నిత్యం జరుగుతూనే వున్నాయి. కేంద్రంలో ఆరెస్సెస్-బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరావాత ఈ దాడులు, హింస మరింత పెరిగాయి. తన మనువాద హిందూత్వ ఫాసిస్టు ఎజెండాలో భాగంగా మోడీ ప్రభుత్వం దళితుల మీద, మైనారిటీల మీద దాడులను తీవ్రం చేసింది.

కారంచేడు మరణహోమం జరిగిన జూలై 17 నుండి చుండూరు మారణకాండ జరిగిన ఆగస్టు 6 వరకు దళితులపై, మత మైనారిటీలపై జరుగుతున్న హింసా, దాడులకు వ్యతిరేకంగా సభలు, సమావేశాలు జరపమని సి.పి.ఐ (ఎం.ఎల్) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా రాష్ట్రంలో పలుచోట్ల సభలు, సమావేశాలు జరిగాయి.

**విజయవాడలో** తే.6-8-2020న పార్టీ నగర కార్యదర్శి కె.పోలారి ఆధ్వర్యంలో న్యూడెమోక్రసీ కార్యాలయంలో సభ జరిగింది. ఈ సభలో పోలారితోపాటు పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రవిచంద్ర, ఇఫ్టూ రాష్ట్ర కమిటీ సభ్యులు దాది శ్రీనివాసరావు మాట్లాడారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

**అనంతపురంలో** తే.6-8-2020న స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ మాట్లాడుతూ చుండూరు కేసును పునర్విచారణ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నరేష్ మరియు ఆర్‌సిసి నాయకులు మాట్లాడారు.

**శ్రీకాకుళంలో** తే.6-8-2020న వానపేట గ్రామంలో సభ నిర్వహించారు. న్యూడెమోక్రసీ నాయకులు టి.ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఇఫ్టూ నాయకులు ఎన్.నీలంరాజు, ఏఐకెఎంఎస్ నాయకులు బి.భాస్కరరావు. కెఎన్‌పిఎస్ నాయకులు మిస్కా కృష్ణయ్య, మాల మహానాడు రాష్ట్ర నాయకులు అప్పారావు. కార్మిక నాయకులు గణేష్, పీఓడబ్ల్యూ నాయకురాలు ఎస్.కృష్ణవేణి ప్రసంగించారు.

**ఆదోనిలో** తే.6-8-2020న పార్టీ కార్యాలయంలో దళిత మృతవీరులకు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ అధికార ప్రతినిధి వి.మల్లిఖార్జున, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జి.వెంకటప్ప, పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను నాయకులంతా తీవ్రంగా ఖండించారు.

**విశాఖలో** తే.6-8-2020న దళితులపై దాడులకి వ్యతిరేకంగా, మనువాద ఫాసిస్టుల దాడులకు వ్యతిరేకంగా స్థానిక గాంధీ బొమ్మ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరశన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వై.కొండయ్య, సి.ఎల్.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొ.కె.పి.సుబ్బారావు, భీమ్‌సేన విశాఖ నాయకులు చిన్నారావు, పీ.ఓ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నిర్మల మరియు కార్మికులు పాల్గొన్నారు.


విశాఖపట్నం


శ్రీకాకుళం



అనంతపురం



విజయవాడ



ఆదోని

## విప్పర్తి రామన్న నీకు విప్లవ జోహార్లు

– ఉప్పెన

విప్పర్తి రామన్న నీకు విప్లవ జోహార్లే
వీరుడ రామన్న నీకు ఎర్రని దండాలే
కామ్రేడా రామన్న నీకు పోరాట దండాలే

పేదవాల్లను ఏకం చేసి
భూమి పోరును నడిపించావు
బీదవాల్లను ఒక్కటి చేసి
ఇండ్ల పోరును నడిపించావు
జైలుకు పోయిన జంకనివాడ
శిక్షలు పడ్డ బెదరని వాడ "విప్పర్తి"

పార్టీ ఏ పనులు చెప్పిన
సంఘం ఏ పిలుపు ఇచ్చిన
ఎర్రని జెండా చేతిలో పట్టి
ఎర్ర చొక్కాకు బ్యాడ్జిని పెట్టి
ఊరేగింపులో ఉర్మే వాడివి
ధర్నాలాన్ని భలే దద్దరిల్లేవి "విప్పర్తి"

ఎన్ని బాధలు వచ్చినగాని
ఎర్ర జెండను విడ్వని వాడా
ఎంత కష్టము వచ్చినగాని
కమ్యూనిజాన్ని వదలనివాడా
నమ్మిన మార్గం నడ్చినవాడా
ఎత్తిన జెండను దించనివాడా "విప్పర్తి"

ఉద్యమాలకే ఊపిరి నీవు
పోరాటాలకు ప్రాణం నీవు
పేదవాల్లకు పెన్నిది నీవు
బీదవాల్లకు బంధువు నీవు
రెపరెపలాడే ఎర్రని జెండలో
తల తల మెర్సే సుత్తి కొడవలి "విప్పర్తి"

## ప్రముఖ ప్రజా కవి, కళాకారుడు, విప్లవ వాగ్గేయకారుడు కామ్రేడ్ వంగపండు ప్రసాదరావుకు విప్లవ జోహార్లు



ప్రముఖ కవి, ప్రజా కళాకారుడు, విప్లవ వాగ్గేయకారుడు కామ్రేడ్ వంగపండు ప్రసాదరావు గారు తే.4-8-2020 తెల్లారిజామున పార్వతీపురంలోని ఆయన స్వగ్రామంలో గుండెపోటుతో మృతి చెందారు. వారి మరణం పట్ల సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూడెమాక్రసీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి చెందింది. కా॥ వంగపండుకు విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. ఆయన మరణం ప్రజా సాంస్కృతిక రంగానికి తీరని లోటు.

వంగపండు ప్రసాద్ గారి స్వగ్రామం విజయనగరం జిల్లా పార్వతీపురం మండలంలోని (బొండపల్లి పంచాయితీ) వీరభద్రపురం. మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధపోరాట ప్రభావం ఆయనపై బాగా పడింది. ఆయనలోని కళాకారుడికి మరింత ప్రేరణ కలిగించింది. ఆయన ఉత్తరాంధ్ర జానపద బాణీలను విప్లవీకరించి ఆదివాసీలు, ఇతర పీడిత ప్రజల సమస్యలు, బాధలు, కన్నీలను గానం చేస్తూ వందల పాటలు రాశారు. వారి రచనలలో ఎమర్జన్సీ కాలంలో రచించిన "భూమి భాగోతం" చాలా ప్రజాదరణ పొందింది. రాష్ట్రంలో వేల బృందాలు ఈ కళారూపాన్ని ప్రదర్శించాయి. శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటాన్ని గానం చేస్తూ రచించిన సిక్కోలు యుద్ధం నృత్యరూపకం బాగా ప్రసిద్ధి చెందింది. ఆయన పాటలు వంగపండు ఉరుములు, వంగపండు ఉప్పెన పేరుతో చాలా ప్రజాదరణ పొందాయి. విరసం సభ్యుడుగా, జననాట్యమండలి కళాకారుడుగా అనేక విప్లవ, ప్రజా గీతాలు రచించి గానం చేశారు. వంగపండు మొదట విశాఖ షిప్‌యార్డులో ఉద్యోగం చేశారు. తర్వాత కాలంలో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసారు. విప్లవ కళాకారుడుగా తన కృషిని మరింత చురుగ్గా కొనసాగించారు. ఒగ్గుకథ లాంటి ప్రజా కళారూపాలని బాగా ప్రాచుర్యంలోకి తెచ్చి ప్రజల పోరాటాలకి, ఉద్యమాలకి సంఘీభావాన్ని కూడగట్టారు.

విప్లవ సినిమాలకోసం కూడా ఆయన బాగా ప్రజాదరణ పొందిన పాటలు రాశారు. వాటిలో "జజ్జనకరి జనారె, ఏం పిల్డో ఎల్దామొస్తవ, అయ్యో నే చదివి బాగుపడతా" లాంటి పాటలు చాలా పాపులరయ్యి 80, 90 లలో ప్రజల నోట బాగా నానుతుండేవి. ఆనాటి తరంలోని యువతపై ఈ పాటలు మంచి ప్రభావాన్ని కలిగించి వారిని కమ్యూనిస్టు, విప్లవ రాజకీయాల వైపు ఆకర్షించడానికి దోహద పడ్డాయి.

ఆయన జీవిత చివరి కాలంలో కారణాలు ఏమైనా తొలికాలం నాటి నిబద్ధతలో సడలింపులు పొడచూపాయి. అయినప్పటికీ ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఆయన గళాన్ని ఎత్తి వాటిని గానం చేసేవారు. ఇటీవల సంవత్సరాలలో ఉత్తరాంధ్ర దీర్ఘకాలిక సమస్యలపై " దభేల్ దుభేల్ " అనే కళారూపం ద్వారా అనేక చోట్ల ప్రదర్శనలిచ్చి ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి కృషి చేసారు. ఏదిఏమైనా వంగపండు ప్రసాద్ తన జీవితంలో చాలా భాగం విప్లవ ఆకాంక్షలకి, ప్రజా జీవితాల గానానికి, ప్రజా చైతన్యానికి, ఉద్యమాలకి అంకితం చేశారు.

కామ్రేడ్ వంగపండుకి విప్లవ జోహార్లు. వారి బంధు, మిత్రులకు మా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియచేస్తున్నాము.

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఆం.ప్ర. కమిటీ**

## కవి, రచయిత, రాయలసీమ ఉద్యమ నాయకుడు కా॥ బి.పాండురంగారెడ్డి కి విప్లవ జోహార్లు



కవి, రచయిత, రాయలసీమ ఉద్యమ నాయకుడు కామ్రేడ్ బి.పాండు రంగారెడ్డిగారు తే.3-8-2020న తెల్లవారు జామున 3గంటలకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనాతో మృతిచెందారు.

పాండురంగా రెడ్డి గారి స్వగ్రామం కర్నూలు జిల్లా శిరువెళ్ళ మండలంలోని గోవిందపల్లె. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. APTF రాష్ట్ర కార్యదర్శిగా, "ఉపాధ్యాయ" పత్రికా సంపాదకుడిగా పనిచేసారు. ఉపాధ్యాయుడిగా ఉంటూనే ఆయన అనేక విప్లవ పోరాటాలలో పాల్గొన్నారు. వీరు తొలి నాళ్ళలో విరసం, జనసాహితి సంస్థల్లో ఉంటూ రచయితగా కృషిచేశారు. 1991లో ఉవ్వెత్తున ఎగసిన సారా వ్యతిరేక ఉద్యమానికి మద్దత్తు ఇచ్చారు. పౌర హక్కుల సంస్థ OPDR కు కర్నూల్ జిల్లా ప్రతినిధులుగా కూడా పొండు పనిచేశారు. 1996లో రాయలసీమ రచయితలను అందరినీ ఏకం చేసి నంద్యాల లో "సీమ సాహితి" సంస్థను ఏర్పాటు చేశారు. సీమ సాహితి ప్రధాన సంపాదకుడుగా మరుగున పడిన రాయలసీమ సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చారు.

పదవీ విరమణ చేశాక తన లాంటి భావ స్వారూప్యం కల వారితో కలిసి "రాయలసీమ పార్టీ " అనే రాజకీయ వేదికను ఏర్పాటు చేశారు. సీమ ఉద్యమకారులను అందరినీ భాగస్వాములు చేసే ప్రయత్నం చేశారు. ఎ.పి విభజన సమయంలో జస్టీస్ శ్రీకృష్ణ కమిటీకి "రాయలసీమ పార్టీ" తరపున రాయలసీమ వెనుకబాటుతనం, వర్షపాతం, నదీ జలాలు లభ్యత, సీమకరవు తదితర విషయాలపై సవివరమైన రిపోర్ట్ ను అందించారు. పాండురంగారెడ్డి గారి మృతి రాయలసీమ ఉద్యమానికి తీరని నష్టం. ఆయనకి విప్లవ జోహార్లు అర్పిస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాం.

**సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఆం.ప్ర. కమిటీ**

## ప్రభుత్వ విద్యాసంస్థలో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే ట్యాబ్ లు అందించాలి!



పి.డి.ఎ.స్.యు రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ చేయాలని కోరుతూ కర్నూలు జిల్లా నంద్యాలలో స్థానిక సంస్థ కార్యాలయంలో ప్లేకార్డులు నిరశన ప్రదర్శన చేసారు. ప్రస్తుతం విజృంభిస్తున్న ఈ కరోనా సమయంలో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఆన్లైన్ క్లాసులు వినలేరని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు ట్యాబ్ లు అందించడం ద్వారా వాళ్ళు కూడా ఆన్లైన్ క్లాస్ లు విని కార్పొరేట్ స్థాయిలో పోటీ పడటానికి అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా సంఘం నాయకులూ చెప్పారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను మోసం చేస్తూ ఆన్లైన్ క్లాస్ లని అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో మాతృభాషను 8 వ తరగతి వరకు కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఆ జీఓ ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో PDSU డివిజన్ అధ్యక్షుడు సిసింద్రీ, కార్యదర్శి రాంబాబు, నాయకులు, రాజేష్, చిన్ని తదిరులు పాల్గొన్నారు.

## ఇసుక లేక పనులు కోల్పోయిన నిర్మాణరంగ కార్మికులకు భృతి కల్పించాలి!



ఇసుక లేక మరియు కరోనా వల్ల పనులు కోల్పోయి గత సంవత్సర కాలంగా ఉపాధి దొబ్బతిన్న నిర్మాణరంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తే.4-8-2020న పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో ఐ.ఎఫ్.టి.యు, సి.ఐ.టి.యుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమేవేశంలో రెండు సంఘాల జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోదావరిలోయ ప్రతిఘటనోద్యమ యోధుడు కా॥ పూనెం లింగన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళి



పార్వతీపురం

గోదావరిలోయ ప్రతిఘటనోద్యమ యోధుడు, సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణా రాష్ట్ర కమిటీ నాయకుడు గత సంవత్సరం జూలై 31న పోలీసులు ఎదురుకాల్పుల పేరుతో పాశవికంగా హత్య చేసారు.

లింగన్న అమరత్వం గోదావరిలోయ ప్రతిఘటనోద్యమానికి తీరని లోటు. పార్టీ నాయకత్వంలో వేలాది ఎకరాల భూములను సాధించుకొని ఆదివాసీలు, ఇతర పేదలు సాగుచేసుకొని జీవిస్తున్నారు. ఈ పోడు భూముల నుండి హరితహారం పేరుతో కెసిఆర్ సర్కార్ పేదలను తరిమివేసి వాటిని స్వాధీనం చేసుకొని బడా కార్పొరేట్ సంస్థలకి అప్పగించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. వందలాది పోలీసులను, ఫారెస్టు సిబ్బందిని ప్రజలపైకి పంపి బలవంతంగా భూముల నుండి గెంటివేయడానికి నిత్య నిర్బంధం ప్రయోగిస్తున్నది. అయినా కెసిఆర్ ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి తమ భూములను రక్షించుకొని సాగుచేసుకుంటున్నారు.

ప్రజలకు అండగా వుంటున్న పార్టీ నాయకులని, కార్యకర్తలని బెదిరింపులు, కేసులు, అరెస్టులతో వేధిస్తూ నిర్బంధించడానికి నిత్యం కుట్రలు సాగిస్తున్నది. ఇప్పుడు కా॥ లింగన్న ప్రథమ వర్ధంతి సభలను జరగనీయకుండా పోలీసులను ఉసిగొల్పి అరెస్టులు సాగిస్తున్నది. నిర్మాణంలో కా॥ లింగన్న స్థూపాన్ని పోలీసులు కూల్చివేసారు. పోరాటానికి నాయకుడైన ఖమ్మం-వరంగల్ రీజనల్ కమిటీ కార్యదర్శి కా॥ అవునూరు మధుని అక్రమంగా అరెస్టుచేసి నిర్బంధించింది. బెయిల్‌పై విడుదలైనా మరల కొత్త కేసులు బనాయిస్తున్నారు. కా॥ లింగన్న వర్ధంతి సభలు జరగనీయకుండా పోలీసులు అడుగడుగున ఆటంకాలు కల్పిస్తున్నారు. అయినా ప్రజలు లెక్కచేయకుండా తమ ప్రియతమ నాయకుడికి గత వారం రోజులుగా అనేకచోట్ల నివాళులర్పించారు.



ఆత్మకూరు

కా॥ లింగన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ రాష్ట్ర వ్యాపితంగా సభలు, సమావేశాలు జరిపి నివాళులర్పించమని పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా విజయనగరం జిల్లా పార్వతీపురంలో తే.31-7-2020న స్థానిక ఏ.ఐ.కె.ఎం.ఎస్ ఆఫీసులో శ్రీకాకుళం-పార్వతీపురం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో కా॥ లింగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏరియా కమిటీ నాయకులతోపాటు, ఏ.ఐ.కె.ఎం.ఎస్, పీ.ఓ.డబ్ల్యు, ఐ.ఎఫ్.టి.యు, అరుణోదయ సంస్థల భాద్యులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లా ఆత్మకూరులో సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి కా॥ ప్రతాప్ అధ్యక్షతన కా॥లింగన్న ప్రథమ వర్ధంతి జరిపి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సభలో పీ.ఓ.డబ్ల్యు జిల్లా ధ్యక్షురాలు కా॥ మణెమ్మ, ఇఫ్టూ నాయకులు కా॥ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరులో కూలీ రేట్లు పెంచుకున్న చుట్టల కార్మికులు



ఏలూరు లోని వివిధ చుట్టల కంపెనీలలో సుమారు 1000 మంది చుట్టల కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించి గతంలో జరిగిన వేతన ఒప్పందం 14-07-2020 తేదీతో ముగిసింది. దీనికి ముందుగానే ఐఎఫ్‌టియు అనుబంధ ఏలూరు చుట్టల కార్మిక సంఘం ఆధ్వర్యంలో యజమానుల సంఘానికి డిమాండ్ నోటీసు ఇచ్చారు. తర్వాత యజమానులతో దఫ దఫాలుగా చర్చలు జరిగిన తర్వాత తే.26-7-2020న ఒప్పందం జరిగింది. 1000 చుట్టలకు ప్రస్తుతం ఇస్తున్న కూలీరేట్లపై 45 రూ॥లు పెంచడానికి ఉభములూ అంగీకరించారు. రేట్లు పెంచుకోవడంతోపాటు పండుగ బోనస్‌ని కూడా 1800 నుండి 2100 రూ॥లకి పెంచడానికి, కార్మిక సంక్షేమ నిధికి ఒక్కొక్క కార్మికుడికి సంవత్సరానికి వంద రూ॥లు చొప్పున చెల్లించడానికి యజమానులు అంగీకరించారు. ఈ ఒప్పందం రెండు సంవత్సరాల పాటు అమలులో ఉంటుంది. కరోనా కష్టకాలంలో అనేక సంస్థలు, పరిశ్రమలు మూతపడి ఉపాధి దెబ్బతింటున్న నేపథ్యంలో చుట్టల కార్మికులు సంఘటితంగా నిలబడి, ఐక్యతను ప్రదర్శించి మెరుగైన ఒప్పందం సాధించుకున్నారు.

ఒప్పందం జరిగిన సందర్భంగా జరిగిన సభలో ఐ.ఎఫ్.టి.యు. నాయకులు యు.వెంకటేశ్వరరావు (యు.వి), బద్దా వెంకట్రావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావు, ఏలూరు చుట్టల కార్మిక సంఘం నాయకులు వి.చంటి, శేషపు రాము, మీసాల శ్రీనివాస్, మహాలక్ష్మి, బి.హైమావతి, పందిరిపల్లి సత్యనారాయణ, ఆచారి, దాలమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 9న ఏ.ఐ.కె.ఎస్.సి.సి పిలుపుని విజయవంతం చేయాలని రైతాంగానికి మద్దతుగా కార్యక్రమం

రైతాంగం రబీ రుణాలను రద్దుచేసి, ఖరీఫ్‌కి క్రొత్తగా రుణాలు ఇవ్వాలని, అన్ని పంటలకు ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం రైతాంగ పంటల మార్కెటింగ్, నిత్యవసర సరుకులు, ప్రజా పంపిణీ వ్యవస్థలపై జారీ చేసిన 3 ఉపసంహరించాలని, ఆర్డినెన్సులను, వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వరాదని, ఉపాధి హామీ పనుల కాలాన్ని 200 రోజులకు పెంచాలని, కాంప చట్టం-2016 ప్రకారం అడవుల పెంపకం పేరుతో ఆదివాసీల భూములను సేకరించే దాన్ని రద్దుచేయాలని తదితర డిమాండ్లతో అఖిల భారత రైతు పోరాట సమన్వయ కమిటీ (ఏ.ఐ.కె.ఎస్.సి.సి) ఇచ్చిన పిలుపులో భాగంగా అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్) కేంద్ర కార్యవర్గం జూలై 26 నుండి ఆగస్టు 9 వరకు ప్రచార కార్యక్రమంలో భాగంగా సభలు, సమావేశాలు జరపమని పిలుపునిచ్చింది.

దీనిలో భాగంగా ఏ.ఐ.కె.ఎం.ఎస్ శ్రీకాకుళం - విజయనగరం జిల్లాల సంయుక్త కమిటీ ఆధ్వర్యంలో తే.1-8-2020న పార్వతీపురంలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ ఆఫీసు వద్ద ఆగస్టు 9న రైతాంగ సమస్యలపై జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్లేకార్డులు ప్రదర్శించి రైతాంగానికి సంఘీభావం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా నాయకులు పి.రమణి, వి.కృష్ణ, పి.లక్ష్మణరావు, ఎస్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# కరోనా కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలకు నిరసనగా 10 పార్టీల పిలుపు - రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన




ఏలూరు




శ్రీకాకుళం




విశాఖపట్నం



కాకినాడ



రాజమండ్రి



జంగారెడ్డిగూడెం



విజయవాడ



విస్సన్నపేట



తాడేపల్లిగూడెం

కరోనాని కట్టడి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టాలని 10 వామపక్ష పార్టీలు యిచ్చిన పిలుపు నిచ్చాయి. రాష్ట్రంలో పలు చోట్ల ఈ పిలుపులో భాగంగా క్వారంటైన్, ఇసోలేసన్ సెంటర్ లలో సౌకర్యాలు మెరుగుపరచాలని, మెరుగైన వైద్యం అందించాలనీ, అందరికీ టెస్టులు వేగంగా చేసి, ఫలితాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనా కార్యక్రమాలు జరిగాయి.

ఏలూరులో ఆర్.ఆర్.పేటలోని స్ఫూర్తి భవనం వద్ద జరిగిన కార్యక్రమానికి సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు (యు.వి), సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, ఎంసిపిఐ(యు) జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నాగరాజు సిపిఎం నాయకులు పి.కిషోర్, సిపిఐ నాయకులు కె.కన్నయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కాకర్ల అప్పారావు, ఐ.ఎఫ్.టి.యు. నాయకులు ఎర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. జంగారెడ్డి గూడెంలో సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, సిపిఎంల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. న్యూడెమోక్రసీపట్టణ కార్యదర్శి ఏసుబాబు, ఇఫ్టూ నాయకలు కె.వి.రమణ, పిడిఎస్‌యు నాయకులు యు.శశి, మరియు సి.పి.ఎం నాయకులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలో కూడా ఆందోళనా కార్యక్రమం జరిగింది.

విశాఖలో సి.పి.ఐ, సి.పి.ఎం, సి.పి.ఐ (యం.యల్) న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ (యం.యల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వై.కొండయ్య, సి.పి.ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తిగారు, సి.పి.ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సి.హెచ్.నరసింగరావు మాట్లాడారు. ఐ.యఫ్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం. వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యురాలు పి. లక్ష్మి పాల్గొన్నారు. విజయవాడలో పది పార్టీల ఆధ్వర్యంలో విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్లో ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సి.పి.ఐ నుండి రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, ఏ.వనజ, సి.పి.ఎం నుండి రాష్ట్ర కార్యదర్శి పి.మధు, బాబూరావు, సి.పి.ఐ (ఎమ్ ఎల్) న్యూడెమోక్రసీ నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.ప్రసాద్, కె.పోలారి, ఎస్.యూ.సి.ఐ నుండి సుధీర్, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సుందర రామరాజు, ఎం.సి.పి.ఐ నుండి ఖాదర్ బాషా, పి.డి.ఎస్.యూ నుండి ఏ.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. కృష్ణా జిల్లా విస్సన్నపేటలోఎమ్.నాగరాజు, పి.కోటేశ్వరరావు మరియు న్యూడెమోక్రసీ కార్యకర్తలు పాల్గొని నిరసన తెలిపారు.




అనంతపురం

కాకినాడలో 10 పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు జె.వెంకటేశ్వర్లు, సి.పి.ఎం జిల్లా కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాస్, సి.పి.ఐ జిల్లా నాయకులు తోకల ప్రసాద్, సిపిఎం నాయకులు ఎం.రాజశేఖర్, సిహెచ్. అజయ్ కుమార్, కె.వీరబాబు, సిహెచ్. రమణి, ఎం.రాజగోపాల్, సిపిఐ నాయకులు టి.అన్నవరం, పి.ఆదినారాయణ, పి.ఎస్.నారాయణ, జోష్, న్యూడెమోక్రసీ నాయకులు రాజబాబు, రాజు, హస్మి తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రిలో స్థానిక ఆర్యాపురంలోని అడతి సెంటర్లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.పిఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు ఎ.వి.రమణ, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షులు కె.అప్పారావు, డి.శ్రీనివాస్, సురేష్‌బాబు, వెంటేశ్వర్లు, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో 10 పార్టీల పిలుపులో భాగంగా ఈరోజు క్రాంతి భవనం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోవడం విఫలం కావడాన్ని నిరసిస్తూ కార్యక్రమం జరిగింది. సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు టి.ప్రకాష్, సి.పి.ఐ కార్యదర్శి నర్సింహులు, సి.పి.ఎం కార్యదర్శి, మరియు ఇఫ్టూ నాయకులు నీలంరాజు, ఏ.ఐ.కె.ఎం.ఎస్ నాయకులు భాస్కరరావు, పీ.ఓ.డబ్ల్యూ నాయకురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, సి.పి.ఐ, సి.పి.ఎం, సి.పి.ఐ (ఎం.ఎల్) పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఐ.ప్రభాకర్, సి.నాగరాజు మరియు సి.పి.ఐ, సి.పి.ఎం, సి.పిఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సి.పి.ఐ [ఎం.ఎల్] న్యూడెమోక్రసీ తూర్పు గోదావరి జిల్లా కమిటీ సభ్యుడు, ఏ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు

## కామ్రేడ్ విప్పర్తి రామన్నకు విప్లవ జోహార్లు!



అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్) తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షులు, సి.పి.ఐ (ఎం. ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు, కామ్రేడ్ రామన్న 25 జూలై 2020 శనివారం రాత్రి 9. 30 గంటలకు తన స్వగ్రామంలో లివర్ క్యాన్సర్ కారణంగా, అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతికి అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏ.ఐ.కే.ఎం.ఎస్) రాష్ట్ర కమిటీ జోహార్లు అర్పిస్తున్నది. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

కామ్రేడ్ విప్పర్తి రామన్న (65) పిఠాపురం మండలం, వెల్దుర్తి గ్రామనివాసి. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య 20 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. 1990 నుంచి ఆయన పార్టీలో ప్రజాసంఘాల లో పనిచేస్తున్నారు. జగ్గంపేట పెంకు మిల్లు కార్మికుల ఉద్యమంలో, కాత్రావులపల్లి ఫిడేలు పొలం భూ పోరాటం లోను, పిఠాపురం, యు కొత్తపల్లి మండలాల్లోని మాధవపురం, వీరవ, చిత్రాడ, గోర్స తదితర భూ పోరాటాలకు నాయకత్వం వహించాడు. పోలీస్ నిర్బంధాలను ఎదుర్కొన్నాడు. భూమికోసం పోరాటంలో జైలు జీవితం గడిపాడు. పిఠాపురం సబ్ కోర్టులో మాదాపురం భూ పోరాట కేసులో మూడు సంవత్సరాలు జైలు శిక్ష పడింది. ఆ కేసును కాకినాడ జిల్లా కోర్టులో అప్పీల్ చేయగా ఆ కేసును జిల్లా కోర్టు కొట్టి వేసింది.

కాకినాడ ఎస్.ఇ.జెడ్ కు వ్యతిరేకంగా రైతుల పక్షాన నిలబడి పోరాడాడు. పోలీసులు రైతులతో పాటు రామన్న పై కూడా కేసులు పెట్టారు. తొండంగి మండలంలో దివీస్ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నాడు. కాకినాడ పర్ల పేట లో పోర్టు భూమిని ఆక్రమించి, ఇల్లు లేని పేదలకు పంపిణీ చేయడం జరిగింది. దానికి మహాత్మా జ్యోతి రావు పూలే కాలనీగా పేరు పెట్టారు. ఇక్కడ కూడా పోలీసు నిర్బంధాన్ని ప్రజలతో ఎదుర్కొన్నాడు. సర్పవరం దళితుల భూమి కోసం పోరాడి సాధించాడు. పెదపూడి, కరప, తాళ్ళరేవు మండలాల్లో సహపురం, కైకవోలు, చోల్లంగి తదితర గ్రామాలలో రైతు-కూలీలకు, పేద ప్రజల పోరాటాలకు అండగా ఉన్నాడు.

కా॥ రామన్న మృతి విప్లవ పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు తీరని నష్టం. ఆయన ఆశయాలను కొనసాగించడానికి మరింత దీక్షతో ఏ.ఐ.కె.ఎం.ఎస్ కృషి చేస్తుంది. కా॥ రామన్నకు విప్లవ జోహార్లు తెలుపుతోంది.

### సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంత్యక్రియాలు



సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కా॥ రామన్న అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో జరిగాయి. ఈ అంత్యక్రియలలో న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.వెంకటేశ్వర్లు, పి.వెంకటనాయుడు, ఏ.ఐ.కెఎం.ఎస్ జిల్లా నాయకులు జి.సూరిబాబు, వి.రాజబాబు, పి.వై.ఎల్ నాయకులు రాజు, పి.డి.ఎం జిల్లా అధ్యక్షులు కె.గంగరాజు పాల్గొని నివాళు లర్పించారు. రామన్న మృతి విప్లవ పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు తీరని నష్టం అని, ఆయన ఆశయాలను కొనసాగించాలని, పీడిత ప్రజల రాజ్యాన్ని సాధించేవరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ, ఏ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా కమిటీలు కా॥ రామన్న ఘనంగా నివాళులర్పించాయి.

# పశ్చిమ గోదావరి జిల్లా PDSU తొలితరం నాయకురాలు కామ్రేడ్ జ్యోతికి విప్లవ జోహార్లు!



కామ్రేడ్ జ్యోతి తే.22-7-2020న తూర్పు గోదావరి జిల్లా అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో మరణించారు. ఈవార్త తీవ్ర ధిగ్భ్రాంతిని కలిగించింది. జ్యోతితోనూ, ఆ కుటుంబంతోనూ పార్టీకి లోతైన అనుబంధం వుంది. సుమారు 53సంవత్సరాల వయస్సు గల జ్యోతి అప్పుడే మరణించడం చాలా బాధకరం.

1985 అక్టోబర్ 16,17,18 తేదీల్లో ఏలూరులో PDSU పశ్చిమగోదావరి జిల్లా క్లాసులు జరిగాయి. ఈ క్లాసులకు జ్యోతి నిడదవోలు నుండి హాజరయ్యారు. ఆనాటి క్లాసుల్లో ఎంతో ఉత్తేజం పొందిన జ్యోతి నిడదవోలులో PDSU కార్యక్రమాలు చురుకుగా నిర్వహించారు. జ్యోతి తనతోపాటు తన చెల్లి మల్లిక, తమ్ముడు గ్రీష్మ కుమార్‌లను కూడా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసింది. సుమారు 4 సంవత్సరాలు పాటు చురుగ్గా పనిచేసింది. 1989-90 లో ఇంటర్ ఫీజులు పెంపుదలకు వ్యతిరేకంగా PDSU ఉభయగోదావరి జిల్లాల కమిటీలు యిచ్చిన "ఛలో రాజమండ్రి" పిలుపుకు నిడదవోలు నుండి అధికసంఖ్యలో విద్యార్థినిలను జ్యోతి కదిలించింది. ఆ సమయంలో కడియం ఎం.ఎల్.ఎ. జక్కంపూడి రామ్మోహనరావు, అతని అనుచరులు దాడిచేసి కొట్టారు. అ సమయంలో జ్యోతి, అమ్మాజీలు తీవ్రంగా ప్రతిఘటించారు. గూండాలచేతిలో గాయపడ్డారు. చాలా ప్రశంసనీయమైన పాత్ర పోషించారు.

సుమారు 4 సంవత్సరాలపాటు జ్యోతి సాగించిన క్రృషి కారణంగా నిడదవోలు, శెట్టిపేట తదితర ప్రాంతాల్లో PDSU బాగా విస్తరించింది. తన తమ్ముడు గ్రీష్మను చురుకైన కార్యకర్తగా తయారు చేసింది.

వివాహం జరిగిన తరువాత భర్తతో కలిసి అమాలాపురంలో చిన్న ప్రయివేటు స్కూలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఉద్యమ శ్రేయోభిలాషిగా వున్నది. APTF జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఇ.వి.శాస్త్రి గారు జ్యోతికి తండ్రి. జ్యోతి అంతటి చురుకైన పాత్ర పోషించడానికి తండ్రి ప్రోత్సాహం ప్రధానం. తల్లి భవానీగారి సహకారం కూడా వుంది. కామ్రేడ్ జ్యోతి మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ విప్లవ జోహార్లు తెలియజేస్తున్నాం, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నాం.

సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ

# జంగారెడ్డిగూడెంలో కోవిడ్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి!

జంగారెడ్డిగూడెంలో మెట్ట ప్రాంత, ఏజెన్సీ ప్రాంతాలలో పదుల సంఖ్యలో కేసులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలో ఏలూరు, భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెంలలో ఏర్పాటు చేసిన కోవిడ్ క్వారంటైన్ సెంటర్‌లు పేషెంట్లు ఎక్కువై ఖాళీ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాలలో కరోనా వైరస్ ప్రభావితులకు వైద్యం అందటం సమస్యగా వుంది. అందువల్ల అధికారులు వెంటనే స్పందించి జంగారెడ్డిగూడెం ఏరియాలో 200 పడకలతో క్వారంటైన్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తూ తే.30-7-2020న జంగారెడ్డి గూడెంలో ప్లేకార్డులతో ప్రదర్శన చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారం రాఘవ, కె.వి.రమణ, పట్టణ కార్యదర్శి యు.ఏసుబాబు, పి.వై.ఎల్ నాయకులు పూనెం రాముడు, పి.ఓ.డబ్ల్యూ నాయకురాలు కె.రామలక్ష్మి పాల్గొన్నారు.



## రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐ.ఎఫ్.టి.యు జాతీయ కమిటీ పిలుపు – రాష్ట్ర వ్యాపితంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన ధర్నాలు




రాజమండ్రి




తిరుపతి



కాకినాడ




ఏలూరు




డోన్




ద్వారాపూడి



గుంతకల్




తాడేపల్లిగూడెం



జంగారెడ్డిగూడెం

ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తూ, ప్రజల ఆస్తి గా ఉన్న రైల్వేలను ప్రైవేట్, కార్పొరేట్ లకు మోడీ సర్కారు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ జూలై 24న దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని ఐ.ఎఫ్.టి.యు జాతీయ కమిటీ పిలుపు నిచ్చింది. ఈ పిలుపులో భాగంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో రైల్వే స్టేషన్‌ల వద్ద, ఇతర ప్రాంతాలలోను ఐ.ఎఫ్.టి.యు. ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి. " రైల్వేలను ప్రైవేటీకరించవద్దంటూ " ప్రదర్శకులు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టి.యు. నాయకులు మాట్లాడుతూ "బ్రిటిష్ హయాంలో ఏర్పడి ఈనాటి వరకు ప్రజలకు సేవలు అందిస్తూ, అతి తక్కువ చార్జీలతో దూర ప్రాంతాలకు ప్రజలను చేరవేస్తున్న రైల్వేలను ప్రైవేటీకరించం దుర్మార్గమైన చర్యని " అన్నారు. స్వదేశీ నినాదంతో గద్దెనెక్కిన బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజలకు చెందిన రైల్వే ఆస్తులను అంబానీ, ఆదానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు తేరగా అప్పగించడానికి పూనుకుంటున్నదని విమర్శించారు. ప్రజల శ్రమతో రక్తమాంసాల ద్వారా నిర్మించుకున్న రైల్వేలను ఒక్క కలంపోటుతో మోడీ సర్కార్ కార్పొరేట్లకు అప్పగించటం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా వారు అభివర్ణించారు. రైల్వేలు వలస కూలీలలను, సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలను, చివరకు ఉన్నత వర్గాలను కూడా అతి తక్కువ చార్జీలతో సుదూర ప్రాంతాలకు చేరవేస్తూ, ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్న రైల్వేలను ప్రైవేటీకరించం పట్ల వారు తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే సరకుల రవాణా విభాగాన్ని, రైల్వే పారిశుధ్య పనులను, వివిధ విభాగాలను, ప్రైవేటీకరించారనీ, ఇప్పుడు కొత్తగా 109 రైల్వే మార్గాలను ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించడం, చివరకు రైల్వే స్టేషన్లను కూడా ప్రైవేటీకరించడం దేశ వ్యతిరేక చర్యగా వారు అభివర్ణించారు. మోడీ ప్రభుత్వంతన నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇవి కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిన విధానాల కొనసాగింపుగానే బిజెపి ప్రభుత్వం మరింత వేగంగా అమలు చేస్తున్నదని అన్నారు. నవరత్నాలుగా పేరుగాంచిన అన్ని ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. విమానసర్వీసులను, బియస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, పోస్టల్ సర్వీసులనుఇప్పటికే ప్రయివేటీకరించారనీ, చివరికి రైళ్లను, రైలు స్టేషన్లను కూడా ప్రైవేటీకరించడం మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ శక్తుల అనుకూల చర్యలకు నిదర్శనమని విమర్శించారు. మోడీ సర్కార్ ఈ విధానాలను ఉపసంహరించుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




విజయవాడ

రాష్ట్ర వ్యాపితంగా జరిగిన ఈ ఆందోళనా కార్యక్రమంలో విజయవాడలో కె.పోలారి, సిహెచ్ పెద్దిరాజు, ఏలూరులో యూ. వెంకటేశ్వరరావు, బి.వెంకట్రావు, ఎర్ర అప్పారావు, మంగం అప్పారావు, గంగాధర్, కె.అప్పారావు, మజ్జి శ్రీను, నెహ్రూ, జనార్ధన్, తాడేపల్లిగూడెంలో ఎం. దాన వరప్రసాద్, కాకినాడలో జె.వెంకటేశ్వర్లు, భైరవస్వామి, బి.నాయుడు, ఎం.అంజి, డి.సత్తిబాబు, అప్పారావు, కె.వి.రమణ, సిహెచ్.రాఘవ, పి.బసవయ్య, మరియు పి.డి.ఎం జిల్లా అధ్యక్షులు కె.గంగరాజు, రాజమండ్రిలో ఎ.వి.రమణ, కె. అప్పారావు, డి.శ్రీనావాస్, ఎన్.దుర్గారావు, సురేష్‌బాబు, ఆదినారాయణ, నర్శిహులు, ద్వారాపూడిలో పి.వెంకటనాయుడు, జట్టు సంఘం నాయకులు శివన్నారాయణ, సత్యనారాయణ, శ్రీను, పోతురాజు, డోన్ లో రంగనాయకులు, జంగారెడ్డిగూడెంలో కె.వి.రమణ, ఏసుబాబు, ఎమ్.రాజు, ఎస్.మల్లిఖార్జునరావు, జి.వెంకటేశు, కె.రామలక్ష్మి, ఎం.రాంబాబు, తిరుపతిలో వై.ఎస్.మణి, పి.సత్తార్, కె.షాదిక్, బాబూ నాయక్, ఎ.వి.రమణ, గుంతకల్లులో సురేష్, శ్రీరాములు తదితరులు నాయకత్వం వహించారు.

# ఆకలి, నిరుద్యోగం, ధరల పెరుగుదల లకు వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికపై పోరాటాన్ని నిర్మించండి!

## ఆరెస్సెస్-బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలు, బహుళ జాతి సంస్థలు, భూస్వాములకు అనుకూలంగా తెచ్చిన మార్పులను తిరస్కరించండి!

# " లాక్ డౌన్ " ను రద్దు చేయాలి!

## జులై 26 నుండి ఆగస్టు 9 వరకు ప్రజా నిరసనలు జరపండి! ఆగస్టు 9న పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించండి!

లాక్ డౌన్‌ను ఏదో ఒక లేక మరో రూపంలో కొనసాగించటమనేది గత 120 రోజులకు పైగా కొనసాగుతోంది. చిన్న ఆర్థిక కార్యకలాపాలు, రైతాంగం, పారిశ్రామిక కార్మికులు, వ్యాపారస్తులపై తీవ్రమైన ఆంక్షలు విధించబడ్డాయి. అదే సమయంలో చిన్న ఉత్పత్తి, పంపిణీ, మార్కెటింగులన్నింటిలో ప్రవేశించటానికి, వాటిని ఆధీనంలో తెచ్చుకోటానికి బడా పెట్టుబడికి గేట్లు బార్లా తెరిచారు.

ప్రజలు తమ ఇళ్ల నుండి బయటకు వచ్చినందుకు కూడా, వారిపై జరిమానా విధించారు. చిన్న నేరాలకు కూడా కేసులు బనాయించి అరెస్టులు చేశారు. వ్యవసాయ ఉత్పాదకాల సరఫరా, పంటల కొనుగోలు, పంటల క్రమబద్ధీకరణ, ఆహారాన్ని శుద్ధి చేయుట, ఆహార సరఫరా, చిల్లర వర్తకాలు, దొంగ నిల్వలు, బ్లాక్ మార్కెటింగులలో ప్రవేశించి, తమ ఆధీనంలోకి తెచ్చుకోటానికి బహుళజాతి సంస్థలకు, కార్పొరేట్ వర్గాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. బహుళజాతి సంస్థలకు భూమి, సహజ వనరులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. బ్యాంకులు, జీవిత భీమా సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారు. కార్పొరేట్, విదేశీ సంస్థల కొల్లగొట్టుడును, ఆర్థిక రంగంలో అభివృద్ధి మొలకలుగా మోడీ చూస్తున్నాడు.

ఆరెస్సెస్-బిజెపి ప్రకటించిన లాక్ డౌన్, కరోనాను అదుపు చేయటమనేది కాకుండా, దుస్థితిలో వున్న రైతాంగం, చిన్న ఉత్పత్తిదారులు, సాధారణ వ్యాపారులను దెబ్బతీయడానికి మరియు విద్య, వైద్య రంగాలలో కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా అమలవుతోంది. పౌర చట్టం సవరణను వ్యతిరేకించే నిరసనకారులను వేటాడడానికి, రాజ్యాంగాన్ని దెబ్బతీసి, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను స్వాహా చేసి ఎక్కువ అధికారాలను తన ఆధీనంలోకి తెచ్చుకోటానికి కేంద్రీకరణ పెరుగుతోంది.

ప్రపంచంలో ప్రజలతో ఎన్నుకోబడిన ఏ ప్రభుత్వం కూడా కల్పించని అత్యంత తీవ్రమైన మానవ విషాదాన్ని లాక్ డౌన్ సమయంలో వలస కార్మికులకి కేంద్ర ప్రభుత్వం కల్పించింది. వీరు ఆకలితో మలమలమాడుతూ, తమ ఇళ్లకు తిరిగి వెళ్లటానికి వేల కి.మీ. నడవాల్సి వచ్చింది. కరోనాకు ముందుగా అవసరమైనవి అందచేయటానికి కానీ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియచేయుటకు కానీ ప్రభుత్వం ఎప్పుడూ శ్రద్ధ పెట్టలేదు. ఎక్కువ వనరులు, నిధులు బడా ప్రైవేటు సంస్థలకు మళ్లిస్తూ, ప్రజలకు ఆహారం, ఉపాధి హామీ పథకం క్రింద పని, వైద్యం అందచేసి, శ్రద్ధ తీసుకున్నట్లుగా నటిస్తూ, పెద్ద ఎత్తున ప్రచారం గావించింది. కనుక దేశ ప్రజలమైన మనం మన హక్కుల కొరకు నేడు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మించాలి. ఈ క్రింది మన ముఖ్యమైన డిమాండ్లపై పాలకులని నిలదీయాలి.

1) నిరసన కార్యక్రమాలు అనుమతించాలి. అంటువ్యాధుల చట్టం, 144, 353 సెక్షన్లు (ప్రభుత్వం పనిచేయటాన్ని అడ్డుకోవటం), గుండా, దొంగల ముఠా నాయకుల చట్టం, 'ఉపా' టెర్రరిజం), జాతీయ భద్రతా చట్టం, సాయుధ బలగాల (ప్రత్యేక హక్కులు) చట్టం (ఎన్ఎస్ఏ, ఎఎఫ్ఎస్‌పిఏ)లను దుర్వినియోగం చేయటాన్ని ఆపు చేయాలి. పౌరహక్కుల చట్టం సవరణ వ్యతిరేక నిరసనకారులపై బనాయించిన కేసులు ఉపసంహరించాలి. ఎలగార్ పరిషత్ (భీమా కోరేగాం) కేసు బనాయించి అరెస్టు చేసి జైళ్ళలో వుంచిన వారిని విడుదల చేయాలి.

2) ఆహారం, రేషను కార్డు వున్నా లేక పోయినా ప్రతి వ్యక్తికి నెలకు 15 కి.గ్రా. బియ్యం, 1 కి.గ్రా కందిపప్పు, 1 కి.గ్రా. నూనె, 1 కి.గ్రా చక్కెర అందచేయాలి.

3) ఉపాధి హామీ పథకం క్రింద కనీస వేతనం అమలు చేస్తూ, ఏడాదికి 200 రోజులు పని కోరిన వారందరికీ కల్పించాలి. గ్రామాలలో ప్రజల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలి. పేదలకు మిగులు, బినామీ, నదీగర్భాల భూములు పంచాలి. ఆదివాసీలను అడవుల నుండి గెంటి వేయటాన్ని ఆపుచేయాలి. అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలి.

4) రబీ పంటలపై బ్యాంకుల అప్పులను రద్దు చేయాలి. ఖరీఫ్ పంటలకూ, పాడి పశువులకూ వడ్డీలేని రుణాలు యివ్వాలి. వ్యవసాయ కూలీల అప్పులు రద్దు చేయాలి. స్వయం సహాయ బృందాల అప్పులు వాయిదావేసి, వడ్డీ మాఫీ చేయాలి.

5) విమానాలకు టర్బన్ ఆయిలు లీటరు రూ.42కు అమ్మినట్లుగా, డీజిలు, పెట్రోలు ధరలు తగ్గించాలి.

6) వ్యవసాయ రంగానికి సంబంధించిన 3 ఆర్డినెన్సులు 2020 - కేంద్ర ప్రభుత్వం చేసిన, అత్యవసర సరుకుల నిల్వల చట్టం సవరణ, వ్యవసాయోత్పత్తులు దేశంలో ఎవరికైనా, ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ, కాంట్రాక్టు వ్యవసాయంలపై విడుదల చేసిన ఆర్డినెన్సులు రద్దు చేయాలి. వ్యవసాయ పంటలన్నింటికి ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50 శాతం (సి2+50) వుండే విధంగా మద్దతు ధరలు నిర్ణయించాలి.

7) విద్యుత్ బిల్లు-2020 ఉపసంహరించాలి. వ్యవసాయం, చిన్న దుకాణాలు, చిన్న వ్యాపారులు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, పేద ప్రజలకు కరోనా కాలంలో విద్యుత్ బిల్లులు రద్దు చేయాలి.

8) ముందు జాగ్రత్తలు తీసుకుంటూ, పాఠశాలలను ప్రారంభించాలి. ప్రైవేటు పాఠశాలల ఫీజులు క్రమబద్ధీకరించి, పిల్లల ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలి.

9) వైద్య సౌకర్యాలను జాతీయం చేసి, అందరికీ ఉచితంగా సమానంగా నాణ్యమైన వైద్యం అందించాలి.

10) కరోనా కాలంలో పనిచేసే ప్రతి వ్యక్తికీ నెలకు రూ. 10,000 చెల్లించాలి. నష్టపోయిన కూరగాయలు, పండ్లు, పాలు, చేపల రైతులకు నష్టపరిహారం చెల్లించాలి.

11) రైళ్లు తిరిగి ప్రారంభించాలి. వలస కార్మికులకు రాను, పోను ఛార్జీలు లేకుండా, సురక్షితమైన ప్రయాణంకు అనుమతించాలి.

పై డిమాండ్ల సాధన కోసం ***జులై 26 నుండి 9 ఆగస్టు వరకు ఎక్కువ చోట్ల ప్రజా నిరసన కార్యక్రమాలు*** నిర్మించాలి. బహుళజాతి వ్యతిరేక, కార్పొరేట్ వ్యతిరేక పిలుపు ఉధృతం చేసేదానిలో భాగంగా ***ఆగస్టు 9న పెద్దఎత్తున కార్యక్రమాలు*** నిర్వహించాలి. కరోనా విషయంలో అన్ని జాగ్రత్తలూ ఎల్లప్పుడూ తప్పక పాటిస్తూనే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

అఖిల భారత రైతు-కూలీ సంఘం

తే.24-7-20, (ఏ.ఐ.కె.ఎం.ఎస్) - సి.ఇ.సి

## ప్రముఖ బెంగాలీ ప్రజా రచయిత్రి, జీవితాంతం ఆదివాసీల, బడుగువర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహాశ్వేత దేవి 4వ వర్ధంతి (జూలై 28) సందర్భంగా విప్లవ జోహార్లు



" ఈ మానవాళి సజీవంగా కొనసాగాలంటే కలలుగనే హక్కు తప్పకుండా ఉండాలి. కానీ... పరిపాలనా వ్యవస్థ....కలలుగనే నీ హక్కును కాలగొడుతుంటే ఏమవుతుంది. వ్యక్తులు కూలిపోతారు. దేశాలు, మొత్తానికి ప్రపంచమే కూలిపోతుంది. కలలు కనడమన్నది మనందరి ప్రాథమిక హక్కు. దీన్ని మనం కాపాడుకోవాలి! కలలకు స్వాతంత్ర్యం కావాలి. రచయితల కలాలకు మరింత స్వేచ్ఛ కావలి "

# కేంద్ర ప్రభుత్వ నూతన జాతీయ విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలి – పి.డి.ఎస్.యు



విజయవాడ




అనంతపురం




ఎమ్మిగనూరు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం సామాజిక, విద్యార్థి ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో కస్తూరి రంగన్ ఇచ్చిన నివేదిక ప్రజా ప్రయోజనాలకి వ్యతిరేకమని అన్నారు. కేంద్ర మంత్రివర్గం పార్లమెంటులో చర్చ లేకుండానే దీన్ని ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. భారత రాజ్యాంగ విలువలు అయిన సోషలిజం, సెక్యులరిజం, సామాజిక న్యాయం లాంటి వాటికి ఇందులో కనీసం చోటు లేదన్నారు. రాష్ట్రాల అధికారాలను హరించి ఢిల్లీ నుండి నేరుగా నియంత్రించాలని చూడడం హేయమైనదన్నారు. ఇది రాష్ట్రాల ఫెడరల్ హక్కులకు వ్యతిరేకమైనదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓబిసి, మైనారిటీ, మహిళా రిజర్వేషన్ల ప్రస్తావన లేదని విమర్శించారు. నూతన విద్యా విధానం సామాజిక న్యాయానికి వ్యతిరేకమైనది అన్నారు. ముఖ్యంగా విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని ఇందులో పేర్కొనక పోవడం దుర్మార్గమన్నారు. ధార్మిక సంస్థల పేరుతో ప్రైవేటు, రాజకీయ భావజాల సంస్థలకు ప్రభుత్వ నిధులను బదలాయింపు చేయడం ప్రభుత్వ ఉద్దేశమని విమర్శించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ రహస్య ఎజెండాలో భాగంగానే నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. విద్యారంగ కాషాయీకరణ, కార్పొరేటీకరణ లక్ష్యంగానే కేంద్రం నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తోందని దుయ్యబట్టారు. బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ పేరుతో విశ్వవిద్యాలయాలను స్వయంప్రతిపత్తి కోల్పోయేలా చేస్తుందన్నారు. స్వయంప్రతిపత్తి సంస్థలను రద్దు చేసి ఒకే యాజమాన్య సంస్థను ఏర్పాటు చేయడం సహేతుకం కాదన్నారు. విశ్వవిద్యాలయాలకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్రజాప్రయోజనాలకు విరుద్ధమైన నూతన జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో దీనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. ఐక్య ఉద్యమానికి విద్యార్థులను సమాయత్తం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వ నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ గోడ పత్రికను తే.30-7-2020న విజయవాడలోని క్రీస్తు రాజపురంలోని రామనర్సయ్య భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిచంద్ర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నగర అధ్యక్షులు బి.రాజేష్, నాయకులు సందీప్ పాల్గొన్నారు. అలాగే అనంతపురంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల నరేష్ ఆధ్వర్యంలో స్థానిక డా॥ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లేకార్డులు చేపట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రామారావు, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో డా॥ అంబేద్కర్ విగ్రహం వద్ద పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షుడు బి.మహేంద్రబాబు ఆధ్వర్యంలో ప్లేకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఆషిప్, సమీర్, తిరుమలేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా దళితులపై, మేధావులపై జరుగుతున్న దాడులని అరికట్టాలి! వరవరరావు తదితరులను బేషరతుగా విడుదల చేయాలి!



దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులని, మేధావులపై జరుగుతున్న అక్రమ నిర్బంధాలను అరికట్టాలని PDSU, RCC ల ఆధ్వర్యంలో అనంతపురంలో తే.29-7-2020న రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ యనుమల అధ్యక్షత వహించగా, ముఖ్య వక్తలుగా హెచ్.ఆర్.ఎఫ్ నాయకులు చంద్రశేఖర్ గారు, ఒ.పి.డి.ఆర్ నాయకులు రామకృష్ణ, APCLC నాయకులు సురేష్, సి.పి.ఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు.

కరోన కాలంలో జనజీవనానికి అవసరమైన ఆరోగ్య సదుపాయాలు కల్పించమంటే, అవి చేయకపోగా, అవి అమలుచేయమని అడిగే మేధావులపై అరెస్ట్ పేరుతో తీవ్రమైన నిర్బంధాలను, దాడులను పాలకులు కొనసాగిస్తున్నారని, ముఖ్యంగా బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అరెస్టులు నిర్బంధం మరింత తీవ్ర రూపంలో కొనసాగుతున్నాయని విమర్శించారు.

వేల ఏళ్ళ గా అసమానత, పీడన, అణచివేత, దోపిడీ వ్యవస్థలు రద్దయ్యే రోజు కోసం నిరంతరం తమ జీవితాన్ని ఒక ప్రయోగశాలగా మార్చుకుని వారి రచనలతో దళిత, ఆదివాసీ, ప్రజానీకాన్ని, చైతన్య పరుస్తున్నటువంటి మేధావులు, ఉద్యమకారులను అణచివేసే కుట్రతో మనువాద ఫాసిస్ట్ ప్రభుత్వం కా॥ వరవరరావు, ప్రొ॥ ఆనంద్ తెల్ తుంబ్డే, ప్రొ॥ సాయిబాబా సహా దేశవ్యాప్తంగా ఉన్న మేధావులని అక్రమంగా అరెస్ట్ చేసి నిర్బంధించిందని అన్నారు. వీరంతా ప్రజా జీవితాన్ని ధ్వంసం చేస్తున్న ప్రభుత్వ విధానాలను, సామాజిక పీడనను వ్యతిరేకిస్తున్నారు. జైల్లో ఉన్న వరవరరావుతోపాటు మన ప్రియమైన మేధావులను, ఆదివాసీ రాజకీయ ఖైదీలను విడిపించుకొనే ప్రజాస్వామిక పోరాటాన్ని నిర్మించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో ప్రగతిశీల వాదులు, రచయితలు, కళాకారులు, బుద్ధిజీవులు తమ ధిక్కార స్వరాన్ని మరింత పెంచాలన్నారు.

దేశంలో కారంచేడు, చుండూరు లాంటి ఘటనలు పెరిగిపోతున్నాయని, దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు ఆరెస్సెస్-బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీవ్రమైనాయని ఆవేదన వ్యక్తంచేసారు. కోర్టులు కూడా దళితల, ఆదివాసీల, మహిళల హక్కులను కాలరాసే విధంగా తీర్పులు వెలువరించి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను సమర్థిస్తున్నాయని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో ఆర్.సి.సి రాష్ట్ర కార్యదర్శి రాజు, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి నరేష్ యనుమల, ఆర్.సి.సి అధ్యక్ష, కార్యదర్శులు సోమర రాహుల్, వెంకటేష్, AISF జిల్లా కార్యదర్శి మనోహర్, కుల్లాయి స్వామి, AIKMS నాయకులు క్రిష్ణ, పెద్దన్న, వీరణరప్ప, IFTU నాయకులు ఉపేంద్ర, ఏసు, AITUC నాయకులు మల్లికార్జున, ప్రజానాట్యమండలి, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినాన్ని ఆదివాసీల హక్కుల సాధనకై సంకల్ప దినంగా జరపండి!

# ఆదివాసీల రాజ్యాంగపర హక్కుల పరిరక్షణకై పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం!



ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినం. ప్రపంచ వ్యాపితంగా ఆదివాసీల రక్షణ కోసమని 1982లో ఐక్యరాజ్యసమితి జెనీవాలో 170 దేశాలకి చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ప్రతీ సంవత్సరం ఆగస్టు 9న ఆదివాసీ ప్రపంచ దినోత్సవంగా జరపాలని తీర్మానించింది. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక రంగాలలో ప్రగతి సాధించడానికి కృషి చేయాలని తీర్మానించింది. ఈ తీర్మానాల్లో మన దేశం కూడా భాగాస్వామియై సంతకం చేసింది. కానీ మన పాలకులు ఒకప్రక్క ఈ ఆదివాసీ దినాన్ని పండుగలు, జాతర్లులాగా మార్చివేసి, మరోప్రక్క ఆదివాసుల రాజ్యాంగబద్ద హక్కులను, చట్టపర రక్షణలను హరించే విధానాలు చేపడతున్నారు.

గత పాలకుల కంటే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ నాయకత్వంలోని ఆరెస్సెస్-బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు, విదేశీ సామ్రాజ్యవాద కంపెనీలకు అమ్మివేసేదానిలో భాగంగా అడవి మీద కన్నేసి అడవిలోని లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదను దోచిపెట్టడానికి పూనుకుంది. దీనికోసం అనేక ఆదివాసీ వ్యతిరేక విధానాలను, చట్టాలను తీసుకొని వస్తున్నది. నూతన జాతీయ గిరిజన విధానం-2018, నూతన జాతీయ అటవీ విధానం-2018 దీనిలో భాగమే. అలాగే అటవీ నిర్మూలనా పరిహార మార్గదర్శకాలు మరియు ప్రణాళికా నిర్వహణా అథారిటీ (CAMPA) - " కాంప "చట్టం-2016 తెచ్చారు. వీటన్నింటి సారాంశం ఏమిటంటే... ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గ్రామసభల అధికారాలను కాలరాస్తూ అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసే పేరుతో ఉమ్మడి అటవీ యాజమాన్య పద్ధతిని తీసుకొస్తారు. కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ మిషన్ అనే దాన్ని ఏర్పాటు చేసి గ్రామ సామూహిక భూములను, ప్రైవేటు భూములను దాని ఆధీనంలో వుంచుతారు. అంటే అడవిపై సంపూర్ణంగా అటవీశాఖ ఆధిపత్యాన్ని నెలకొల్పి ఆదివాసీల సాంప్రదాయ హక్కులను హరించడమన్న మాట. అలాగే అటవీ ఆధారిత పరిశ్రమల వల్ల, గనుల త్రవ్వకం, క్వారీలు, డ్యామ్‌లు, రోడ్లు నిర్మాణం వంటి వాటి వల్ల అడవికి జరిగే నష్టాన్ని పూరించడానికి ప్రత్యామ్నయ అడవులను పెంచుతారట. దీని కోసం ప్రత్యేక నిధులు " కాంప " చట్టం ద్వారా విడుదల చేస్తారట. అయితే ప్రత్యామ్నయ అడవులు ఎక్కడ పెంచుతారంటే ఆదివాసీలకి చెందిన భూములను దీని కోసం సేకరిస్తారు. అంటే ఒక చేత్తో అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీల సాగులో వున్న పోడు భూములకు పట్టాలు ఇస్తున్నాం అని చెపుతూనే మరోప్రక్క కాంప చట్టం ప్రకారం మరల ఆ భూములనే లాక్కుని ఆదివాసీలకు అన్యాయం చేయడానికి సిద్ధపడుతున్నారన్న మాట.

అంతేగాక ఏజెన్సీ ప్రాంతాల్లో " సౌండ్ ఎకో టూరిజం మోడల్స్ " పేరుతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని, తద్వారా ఆదివాసీల జీవనోపాధిని మెరుగుపర్చవచ్చని ప్రకటించారు. పర్యాటక రంగం పేరుతో అదివాసీల సంస్కృతిని, సాంప్రదాయాలను నాశనం చేయడమేగాక, ఆదివాసీ యువతను సేవకులుగా మార్చేందుకు పూనుకున్నారు.

ఈ ఆగస్టు 9న మన రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములపై హక్కుల కోసం ధరఖాస్తు చేసిన వారికి 3 లక్షల 7 ఎకరాలను అటవీ హక్కుల చట్టం ప్రకారం పంపిణీ చేస్తామని ప్రకటించింది. అయితే పోడు భూములపై ధరఖాస్తు చేసిన వారిలో మొత్తం క్లెయిమ్‌లలో 87,870 ఎకరాలకి సంబంధించిన 43,824 ధరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించబడినట్లు ప్రకటించింది. అలాగే దేశవ్యాపితంగా చూస్తే చత్తీస్‌గడ్, పశ్చిమ బెంగాల్, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, అస్సాం తదితర 14 రాష్ట్రాలలో 5,43,732 మంది ఆదివాసీలు, ఇతర అటవీ నివాసుల ధరఖాస్తులు తిరస్కరించబడినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అంటే దేశం మొత్తం మీద పోడు భూములపై ధరఖాస్తు చేసుకున్న వారిలో నూటికి దాదాపు 40 మంది వారి పోడు భూములపై హక్కులు పొందలేరన్న మాట. దీనికి కారణం పాలకుల తీవ్ర నిర్లక్ష్యమే. అటవీ హక్కుల చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేయడానికి పూనుకోకపోవడం, వచ్చిన ధరఖాస్తులను సకాలంలో పరిశీలించక పోవడం, చివరికి గత సంవత్సరం ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు అటవీ హక్కుల చట్టంపై ఇచ్చిన తీర్పు వల్ల హడావిడిగా, తూతూమంత్రంగా పరిశీలన చేసినట్లు రికార్డులు తయారు చేసి ఆచరణలో అనేక మంది ధరఖాస్తులను అన్యాయంగా తిరస్కరించారు.

దిగువ కోర్టుల నుండి సుప్రీంకోర్టు వరకు సమాజంలో అత్యంత అట్టడుగు వర్గాలైన ఆదివాసీ, దళిత ప్రజల హక్కులను కాపాడే విధంగా కాకుండా, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వంతపాడే విధంగా తీర్పులను వెలువరిస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు అత్యంత ప్రజా వ్యతిరేకంగా వున్నాయి. అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం ఆదివాసీలు పోడు భూములపై హక్కుల కోసం పెట్టుకున్న ధరఖాస్తులు తిరస్కరించబడినట్లయితే,అట్టివారిని అటవీ ప్రాంతాల నుండి ఖాళీచేయించాలని గత సంవత్సరం ఫిబ్రవరిలో అన్యాయమైన తీర్పునిచ్చింది. అంతేగాక ఉద్యోగాల ప్రమోషన్లలో రిజర్వేషన్ చట్టబద్ధ హక్కు కాదని, అది ప్రభుత్వాల స్వయం నిర్ణయం మాత్రమేనని చెప్పింది. అలాగే 2018 మార్చిలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టానికి తూట్లు పొడుస్తూ దాన్ని నీరుగార్చే విధంగా తీర్పునిచ్చింది. ఈ సంవత్సరం ఏప్రిల్ 22న రాష్ట్ర ప్రభుత్వ జీ.ఓ.3 ని కొట్టివేస్తూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 100 శాతం రిజర్వేషన్ చెల్లదని, ఇతర మైదాన ప్రాంతాల మాదిరిగానే 50 శాతం రిజర్వేషన్‌కి మించరాదని అన్యాయమైన తీర్పునిచ్చింది.

భారత ప్రభుత్వం రాజ్యాంగంలో ఆదివాసీల ప్రత్యేక అస్థిత్వం, ప్రత్యేక హక్కులు, స్వయం పాలనా ఆకాంక్షలను గుర్తిస్తూ 5వ షెడ్యూల్‌లో ఆదివాసీ ప్రాంతాలను షెడ్యూల్డు ఏరియాగా గుర్తించింది. " 1950 షెడ్యూల్డ్ ఏరియా ఆర్డర్ "లో షెడ్యూల్లు తెగలు జాబితాను ప్రకటించారు. అయితే ఆచరణలో ఈ తెగలు నివసిస్తున్న అన్ని ప్రాంతాలను షెడ్యూల్డు ఏరియాలో కలపకుండా, కొన్ని ప్రాంతాలనే కలపడం వల్ల ఆదివాసీలకు తీరని అన్యాయం జరిగింది. నక్సల్బరీ, శ్రీకాకుళ గిరిజనోద్యమాల వంటి అనేక ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 1976లో " 1950 షెడ్యూల్డ్ ఏరియా ఆర్డర్ " కి సవరణ తెచ్చింది. దీని ప్రకారం మన రాష్ట్రంలో 9 జిల్లాల్లో సర్వే జరిపి 753 ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చబడ వలసినవిగా గుర్తించారు. (ఈ గుర్తింపులో కూడా చాలా గ్రామాలని వదిలేసారు) 1980లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఈ జాబితాపై తీర్మానం చేసి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించింది. కానీ ఇప్పటికీ అది ఆమోదం పొందలేదు. మరోప్రక్క గిరిజన సంక్షేమ శాఖాధికారులు, ఐ.టి.డిఏ అధికారులు రాష్ట్రంలో వున్న షెడ్యూల్డు గ్రామాల జాబితాని స్పష్టంగా ప్రకటించకుండా గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఏజెన్సీ గ్రామాలంటే షెడ్యూల్డు గ్రామాలేనని ఒకసారి, కాదు అవి సబ్‌ప్లాన్ ఏరియా గ్రామాలని మరోసారి ప్రకటిస్తూ అవగాహనారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. శాసన సభ్యులతో కూడిన గిరిజన సలహా మండలి కూడా తీర్మానాలు చేయడం తప్పా కేంద్రం వద్ద పెండింగ్‌లో వున్న షెడ్యూల్డు ప్రాంతాల జాబితాని ఆమోదించేలా ఒత్తిడి చేయడం లేదు.

పాలకులు అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలని త్రిప్పికొడుతూ, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే తీర్పులకు నిరసిస్తూ ఆదివాసీలు పోరాడాలి. అలాగే పెండింగ్‌లో వున్న షెడ్యూల్డు ప్రాంత జాబితాను రాష్ట్రపతి ఆమోదించేలా ఉద్యమించాలి. ***ఆగస్టు 9 - ప్రపంచ ఆదివాసీ దినాన్ని ఆదివాసీల హక్కుల పరిరక్షణా పోరాట సంకల్పదినంగా పాటిద్దాం!***

**అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్)**

**తే.30-7-2020** **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ**